
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ప్రకాశం
బుధవారం 22, మే 2024


పేదలకు ఉపాధి కల్పించేందుకు కేంద్రప్రభుత్వం చేపట్టిన మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం అధికారపార్టీ నాయకులకు కల్పతరువుగా మారింది. పేద కూలీలకు చెందాల్సిన ఉపాధి సొమ్మును సీనియర్ మేట్లుగా చెలామణీ అవుతున్న వైసీపీ నేతలు, సాంకేతిక సహాయకులు దర్జాగా దోచుకుంటున్నారు. జిల్లా, మండలస్థాయి అధికారులు కూడా వీరి నుంచి వాటాలు తీసుకొని ఏం జరుగుతున్నా చోద్యం చూస్తున్నారన్న ఆరోపణలున్నాయి. వాస్తవ పరిస్థితులు ఆ ఆరోపణలకు బలం చేకూరుస్తున్నాయి. కలెక్టర్ ప్రత్యేకంగా విచారణ కమిటీని ఏర్పాటు చేస్తే వాస్తవాలు వెలుగు చూస్తాయని స్థానికులు పేర్కొంటున్నారు.


పుల్లలచెరువు మండలం కవలకుంట్ల గ్రామ చెరువులో బురదలో కూడా ఉపాధి పనులు చేస్తున్నట్లుగా కూలీలు..

వైసీపీ నేతలు, ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది కుమ్మక్కు
పనులు చేయకుండానే మస్టర్లు
బోగస్ ఫొటోలతో హాజరు నమోదు
కూలీల నుంచి వారానికి రూ.200 వసూలు
పట్టించుకోని ఉన్నతాధికారులు
పుల్లలచెరువు మండలంలో
దాదాపు అన్ని గ్రామాల్లోనూ బొక్కుడు

ఉపాధిలో వీరదోపిడీ





నిబంధనలు ఇలా..

ఉపాధి హామీ పథకం ప్రకారం ఒక చెరువును ఉపాధి హామీ పథకం ద్వారా పూడిక తీస్తే మూడేళ్ల పాటు ఆ చెరువులో ఎటువంటి పని చేయకూడదు. అందుకు విరుద్ధంగా మండల అధికారులు అదే చెరువుల్లో పూడికతీత పనులతో పాత గుంతలకు కొత్త మెరుగులు ఇచ్చి కొలతలు చూపించి మస్టర్లు వేస్తున్నారు. మండలంలో నిత్యం 3వేల మంది పేరుతో ఇలానే బోగస్ మస్టర్లు వేసి దోపిడీ చేస్తున్నారు. కొలతలు ప్రకారం ఒక క్యూబిక్ మీటరు పనిచేస్తే ఆ కూలీలకు రూ.250 వరకు ఉపాధి వేతనం చెల్లించాలి. కాని ఇవేం పట్టకుండా టెక్నికల్ అసిస్టెంట్లు తమకు నగదు ముట్టజెప్పిన వారికి మస్టర్లు వేస్తున్నారు. దీనిలో సీనియర్ మేట్ నుంచి టీఏ, పైస్థాయి అధికారులకు నిత్యం వాటాలు అందుతున్నాయన్న ఆరోపణలున్నాయి. మండలంలోని దాదాపు అన్ని గ్రామాల్లో ఇదే తంతు నడుస్తోంది.

పుల్లలచెరువు, మే 21 : ఉపాధి హామీ పథకం కొందరు అక్రమార్కులకు వరంగా మారింది. అధికార పార్టీ నేతలు, ఉపాధి సిబ్బంది ఒక్కటై ఇష్టారీతిన దోచుకుతింటున్నారు. వీరికి జిల్లాస్థాయిలో ఉన్నతాధికారుల అండదండలు ఉండటంతో యథేచ్ఛగా అక్రమాలకు పాల్పడి భారీగా స్వాహా చేస్తున్నారు. ఇందుకు పుల్లలచెరువు మండలంలో జరుగుతున్న తంతే నిదర్శనం. మండలంలో 19 పంచాయతీలు ఉండగా, సుమారు 15 గ్రామాల్లో మాయ వ్యవహారం జోరుగా సాగుతోంది. క్షేత్రస్థాయి సీనియర్ మేట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు కుమ్మక్కై కూలీల నుంచి ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. ప్రతి కూలీ నుంచి పనులు చేయకుండానే వారానికి రూ.200 నుంచి రూ.300 వరకు గుంజుకుంటున్నారు. హైదరాబాద్, బెంగళూరు, ఇతర ప్రాంతాల్లో ఉండే సాఫ్ట్‌వేర్ ఉద్యోగులకు, కూలీల పేర్లతో జాబ్ కార్డులు పుట్టించి రోజూ మస్టర్లు వేసి వారి నుంచి సగం తీసుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి. కొందరి నుంచి నేరుగా నగదు ముందుగా తీసుకొని మస్టర్లు వేస్తుండగా, కొందరి నుంచి ఆన్‌లైన్‌లో నగదు తెప్పించుకుంటున్నారు.



ఒకటే ఫొటో 747 మందికి మస్టర్లు

మండలంలోని కవలకంట పంచాయతీని పరిశీలిస్తే గత ఆదివారం 747 మందికి మస్టర్లు వేసినట్లు ఆన్‌లైన్‌లో చూపారు. అయితే ఆయా పనులకు సంబంధించి మొత్తం ఒకేవిధమైన ఫొటో అప్‌లోడ్ చేయగా, అది కూడా చెరువులోని బురదలో పూడిక తీస్తున్నట్లు ఉంది. గ్రామంలోని తిమ్మారెడ్డి చెరువులో ఆ మేరకు పూడిక తీసినట్లు చూపారు. బురదతో కూడిన చెరువులో అంతమంది ఎలా పనిచేశారో అధికారులే సమాధానం చెప్పాలి. ఇక పనికి సంబంధించిన ఫొటోలో సైతం ఏడెనిమిది మందికి మించి లేరు. అయితే 747 మందికి మస్టర్లు ఎలా పడాయో..! లోగుట్టు ఆయా అధికారులే అర్థం చేసుకోవాలి. ఇలా ఈ ఒక్క పంచాయతీలోనే కాదు మండలంలోని అన్ని గ్రామాల్లో ఇదే మాయ కొనసాగుతోంది. ఆ మేరకు ఆన్‌లైన్‌లో చూస్తే సామాన్యులకు సైతం అర్థం అవుతోంది.

ఇక అధికారులకు ఇవేమి తెలియక పోవడంలో ఉన్న అంతర్యాన్ని అర్థం చేసుకోవచ్చు. ఇలాంటి పూడికతీత పనులైతే రేపు సోషల్ ఆడిట్ నిర్వహించే నాటికి చెరువులో నీళ్లు చేరి ఉంటాయని, అప్పుడు దానిని కప్పిపుచ్చుకోవచ్చని అక్రమార్కుల భావన. విచారణాధికారులు కూడా తమ వారే కాబట్టి ఏం ప్రమాదమూ ఉండబోదని సిబ్బంది ధీమాగా ఉన్నారు.

కొలతలు తీయించి చర్యలు తీసుకుంటాం

ఈ విషయంపై మార్కాపురం ఏపీడీని వివరణ కోరగా పుల్లలచెరువు మండలంలో 200 వసూలు చేస్తున్నట్లు, అవినీతి ఆరోపణలు ఉన్నట్లు తన దృష్టికి రాలేదని చెప్పడం గమనార్హం. అయితే గ్రామాల్లో జరిగిన పనులపై కొలతలు తీయించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. వసూళ్లలో అవినీతి తనకు తెలియదన్నారు.

వారానికి రూ.20 లక్షల వసూలు

ఒక్క పుల్లలచెరువు మండలంలో మొత్తం 19 పంచాయతీలు ఉండగా ఆయా పంచాయతీలో అక్రమ మస్టర్ల ద్వారా రూ.20లక్షల వరకు అధికారులు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఈ లెక్కన నెలకు రూ.80లక్షల వరకు సొమ్మును అధికారులు వాటాలు వేసుకొని పంచుకుంటున్నారు. ఈ విధంగా చూస్తే జిల్లాలోని మిగతా మండలాల్లో ఉపాధి హామీ పనులలో ఏ స్థాయిలో అవినీతి జరుగుతుందో అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికైనా ఈ అక్రమాలపై కలెక్టర్ విచారించి అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఓట్ల లెక్కింపు కోసం అబ్జర్వర్ల నియామకం



ఒంగోలు(కలెక్టరేట్), మే 21: పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు కోసం అబ్జర్వర్లను నియమిస్తూ ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీచేసింది. వివిధ రాష్ట్రాలకు చెందిన సీనియర్ అధికారులను నియోజకవర్గాల వారీగా ఓట్ల లెక్కింపు కోసం ప్రత్యేక అధికారులుగా నియమించింది. ఈనెల 13న పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాలకు పోలింగ్ జరిగిన నేపథ్యంలో రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో పెద్దఎత్తున గొడవలు జరిగిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో వచ్చేనెల 4వతేదీన ఓట్ల లెక్కింపు జరగనున్న నేపథ్యంలో నియోజకవర్గాల వారీగా జరిగే ఓట్ల లెక్కింపు కోసం పలు రాష్ట్రాలకు చెందిన సీనియర్ అధికారులను పరిశీలకులుగా నియమించారు. డాక్టర్ బాపు గోపినాథ్ పవర్ (సంతనూతలపాడు), మయూర్ కే మెహత(వైపాలెం), డాక్టర్ గుంజం సోని(దర్శి), డాక్టర్ అరవింద్‌కుమార్(ఒంగోలు), డాక్టర్ ఐ.ఆనంద్‌కుమార్(కొండపి), అనిమేష్.డి(మార్కాపురం), ఆల్బినోలిన్ మోలాంగ్(గిద్దలూరు), బిరేంద్ర.కే(కనిగిరి)లను నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

టీడీపీకి ఓటు వేశారని..

నీళ్ల ట్యాంకర్ల సరఫరా నిలిపివేత

మార్కాపురం రూరల్, మే 21: 'మీరు మా పార్టీకి ఓటు వేయలేదు. మీకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా ఎందుకు చేయాలి' అని టీడీపీకి ఓటు వేశారని భావిస్తున్న వారిపై వైసీపీ నాయకులు వివక్ష చూపుతున్నారు. గ్రామాలలో ఎక్కడైనా నీటి సమస్య ఉంటే అక్కడికి ప్రభుత్వ అధికారులు అక్కడ నీటి సమస్యలను తీర్చాలి. కానీ వైసీపీ నాయకుల ఆదేశాల ప్రకారం గ్రామాలలో ప్రభుత్వం ద్వారా సరఫరా చేస్తున్న నీటి ట్యాంకర్లను టీడీపీ మద్దతుదారుల వద్దకు రాకుండా చూస్తున్నారు. మండలంలోని నాయుడుపల్లి, పెద్దయాచవరం గ్రామాలలోని ఎస్సీ కాలనీలలో టీడీపీకి ఓట్లు వేశారని వారి ప్రాంతాలకు నీటి సరఫరా చేయడం లేదని వాపోతున్నారు. ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ వారి నుంచి ఎటువంటి స్పందన లభించలేదని ప్రజలు వాపోయారు. ప్రభుత్వం ట్యాంకర్ల ద్వారా సరఫరా చేసే నీటిని సమస్య ఉన్న అన్ని ప్రాంతాలకు అందించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

పొగాకు కిలో రూ.322


మార్కెట్లో కొనసాగుతున్న జోరు
మీడియం, లోగ్రేడ్‌లకు భారీ డిమాండ్



ఒంగోలు, మే21 (ఆంధ్రజ్యోతి): దక్షిణాది మార్కెట్లో పొగాకు జోరు కొనసాగుతోంది. మేలురకం బేళ్ల కు గరిష్ఠ ధరలు మంగళవారం మార్కెట్లో ఏకంగా కిలో రూ.322 పలికింది. ఒంగోలు-2 వేలంకేంద్రంలో ఈ ధర లభించగా ఇతర చోట్ల కూడా రూ.312 నుంచి రూ.320 వరకు ఉంది. వారం క్రితం కిలో రూ.300గా ఉండగా శనివారం రూ.311 పలికింది. మంగళవారం కిలోకు మరో రూ.11 పెరిగి ఏకంగా రూ.322 లభించింది. పొగాకు బోర్డు చరిత్రలో దక్షిణాది వేలం కేంద్రాలలో ఈ స్థాయి ధర లభించడం ఇదే ప్రథమం. మార్కెట్లోకి ఇంకా కూడా మేలురకం బేళ్లు పరిమితంగానే వస్తుండగా వాటి కోసం బయ్యర్లు పోటీపడుతున్నారు. తదనుగుణంగా డిమాండ్ లభించి గరిష్ఠ ధరలు పెరుగుతున్నాయి. ఇదిలా ఉండగా మంగళవారం మార్కెట్లో మీడియం, లోగ్రేడ్‌లకు కూడా భారీ డిమాండ్ కనిపించింది. మీడియంగా భావించే ఎఫ్-3 రకం ధర ఇంచుమించు మేలురకంతో పోటీపడుతూ కిలో రూ.310పైనే పలికింది. అదే సమయంలో లోగ్రేడ్‌లో నాణ్యమైనదిగా భావించే బ్రౌన్, అలాగే చిలకపచ్చ రకం బేళ్లకు కిలో రూ.280పైగా ధరలు లభిస్తున్నాయి. ఇక లోగ్రేడ్‌లో తక్కువ రకం బేళ్లకు కూడా కిలో రూ.205నుంచి రూ.220 వరకు పలుకుతున్నాయి. పొగాకు మార్కెట్లో దిగ్గజ కంపెనీలుగా పేరున్న వారి కన్నా డీలర్లు, మధ్య స్థాయి కంపెనీల బయ్యర్లు అధికంగా ఈ ధరలకు కొనుగోలు చేస్తున్నారు. కాగా ఈ సీజన్‌లో ఇప్పటివరకు దక్షిణాది వేలం కేంద్రాలలో సుమారు 52 మిలియన్ కిలోల కొనుగోళ్లు జరగ్గా సగటున కిలోకు రూ.243 ధర లభించింది. ఈ స్థాయి గరిష్ఠ ధరలు అలాగే సగటు ధరలు గతంలో ఎన్నడూ లేకపోగా ప్రస్తుత మార్కెట్ పోకడ చూస్తే సగటు ధరలు మరింత పెరుగుతాయని తెలుస్తోంది.

అతడంతే..! అపర కీచకుడు

మారని సీనియర్ అసిస్టెంట్ ప్రవర్తన
ఉద్యోగినులతో అమర్యాదగా...
ఫిర్యాదు చేసినా స్పందించని డివిజనల్ స్థాయి అధికారి
భరించలేకే ఉన్నతాధికారులకు బాధితురాలు ఫిర్యాదు



మార్కాపురం, మే 21: 'ఎన్నిసార్లు ఉన్నతాధికారులు మందలించినా, శిక్షించినా ఆ మనిషి మారలేదు.. అతని తీరూ మారలేదు.' మళ్లీ మళ్లీ అదే తప్పులు చేస్తున్నాడు. తన కార్యాలయంలో పనిచేసే తనకన్నా ఉన్నత, కింది స్థాయి ఉద్యోగినుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడు. కొంతమేర భరించిన ఆ ఉద్యోగినులు స్థానికంగా ఉండే డివిజనల్ స్థాయి అధికారికి ఫిర్యాదు చేశారు. సీనియర్ అసిస్టెంట్‌కు ఉన్న రాజకీయ పలుకుబడితో ఆయన చర్యలను తప్పుబట్టడానికి కూడా సాహసించలేదు. దీంతో బాధిత ఉద్యోగినులలో ఒకరు డీపీవోకి ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం ఆ ఫిర్యాదుపై విచారణ జరుగుతోంది.

మహిళా ఉద్యోగులతో అసభ్యకరంగా...

ప్రస్తుతం మార్కాపురం డివిజనల్ పంచాయతీ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా జి.శ్రీనివాసులు పనిచేస్తున్నాడు. ఆయన కార్యాలయంలో పనిచేసే మహిళా ఉద్యోగులతో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారని ఆరోపణలున్నాయి. ఆయన సీటు కన్నా ఉన్నత స్థానంలో ఉన్నా, కింది స్థానంలో ఉన్నా.. ఆయన నుంచి వేధింపులు తప్పడం లేదు.. తొలుత అవసరం లేకపోయినా ఫైళ్లు అడగటం, ఫైళ్లు ఇస్తున్న సమయంలో చేతులు పట్టుకోవడం, ద్వంద్వ అర్థాలతో మాట్లాడటం చేసేవాడు. ముఖ్యంగా తన భర్త మరణించడం ద్వారా వచ్చిన ఉద్యోగాన్ని జాగ్రత్తగా చేస్తున్న ఓ మహిళా ఉద్యోగినిని ఆయన లక్ష్యంగా చేసుకున్నాడు. చివరకు లాడ్జికి రా అంటూ ధైర్యంతో పిలిచేదాకా వచ్చాడంటే ఆయనకు ఉన్న రాజకీయ పలుకుబడి ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. మార్కాపురం డీఎల్‌పీవో కార్యాలయంలో పనిచేసే ఒక ఉన్నత స్థాయి ఉద్యోగిని శ్రీనివాసులు అరాచకాలు భరించలేక తనను వెంటనే బదిలీ చేయాలని ఉన్నతాధికారులను వేడుకున్నారు.

గతంలోనూ ఇంతే....

సదరు సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులు కందుకూరు డీఎల్‌పీవో, ఒంగోలు డీపీవో కార్యాలయాల్లో పనిచేశాడు. అక్కడ కూడా మహిళా ఉద్యోగులతో అసభ్యకరంగా ప్రవర్తించినట్లు ఆరోపణలున్నాయి. తోటి ఉద్యోగులతో దురుసుగా ప్రవర్తించేవాడని బాధితులు తెలిపారు. కందుకూరు కార్యాలయంలో పని చేస్తున్న సమయంలో సహచర ఉద్యోగులతో ఇలానే ఒక పర్యాయం ఘర్షణ పడ్డాడు. దీంతో ఒంగోలుకు బదిలీ చేశారు. అక్కడా ఉద్యోగుల పట్ల అసభ్య ప్రవర్తన కారణంగా విచారణ చేపట్టిన అనంతరం కలెక్టర్ దినేష్‌కుమార్ కమిషనర్ కార్యాలయానికి సరెండర్ చేశారు. కోర్టు ఉత్తర్వులకు అనుగుణంగా తిరిగి జిల్లాలో ఉద్యోగానికి వచ్చాడు. అనంతరం శ్రీనివాసులు తనకున్న రాజకీయ పలుకుబడితో మార్కాపురం డీఎల్‌పీవో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా బాధ్యతలు స్వీకరించారు. నాటి నుంచి నేటి వరకు కార్యాలయాన్ని తన సామ్రాజ్యంగా భావిస్తున్నాడు. ఇక్కడ తాను చెప్పిందే వేదమని, తన మాట వినకుంటే సర్వీసు నమోదులో తేడా ఉంటుందని భయపెట్టినట్లు మహిళా ఉద్యోగులు చెబుతున్నారు.

డీపీవోకు ఫిర్యాదు

కామాంధుడి అవతారమెత్తినఅతను తమ పట్ల ఉన్న అనుచిత ప్రవర్తనపై జిల్లా పంచాయతీ అధికారి ఉషారాణికి ఉద్యోగినులలో ఒకరు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. దీంతో ఆ విషయంపై ప్రస్తుతం విచారణ సాగుతోంది.



ఆరోగ్యశ్రీ సేవలపై ప్రభుత్వ నిర్లక్ష్యం!

జిల్లాలో భారీగా పేరుకుపోయిన బకాయిలు
నెట్‌వర్క్ ఆస్పత్రులకు రూ.50కోట్లకుపైనే...
చెల్లింపులు లేకపోవడంతో సేవలు నిలిపివేత
ట్రస్ట్‌కు లేఖ ఇచ్చినా పట్టించుకోని వైనం

ఒంగోలు(కలెక్టరేట్), మే 21 : ఆరోగ్యశ్రీ పథకాన్ని వైసీపీ ప్రభుత్వం అనారోగ్యశ్రీగా మార్చుతోందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. బకాయిల కోసం ఈనెల 22 నుంచి సేవలను నిలిపివేస్తున్నామని నెట్‌వర్క్ ఆస్పత్రులు ప్రకటించినా ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు కనీస స్పందన కరువైంది. నాలుగైదు నెలల నుంచి ఆరోగ్యశ్రీ బకాయిలను ప్రభుత్వం చెల్లించలేదు. ఈ సమస్యను అనేకసార్లు ఆస్పత్రుల యాజమాన్యాలు ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయినా పట్టించుకోకపోవడంతో విధి లేని పరిస్థితుల్లో ట్రస్ట్‌కు ఆరోగ్యశ్రీ సేవలను నిలిపివేస్తామని లేఖ ఇచ్చాయి. అయినా ఎటువంటి సమాధానం ఇవ్వని పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం పేదలకు గత ప్రభుత్వాల కంటే మెరుగైన వైద్యసేవలు అందిస్తుందని ప్రగల్బాలు పలికిన వైసీపీ ప్రభుత్వం నెట్‌వర్క్ హాస్పటల్స్‌కు బకాయిల చెల్లింపుల్లో తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించింది. భారీగా బకాయిలు పేరుకుపోవడంతో ఆ ఆస్పత్రుల యాజమాన్యాలు గగ్గోలుపెట్టడమే కాకుండా ఆరోగ్యశ్రీ సేవలను నిలుపుదల చేస్తామని ఇటీవలే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాయి. అయితే బకాయిలను ఇస్తున్నట్లు నాలుగైదు నెలల క్రితం ప్రకటించినా అందులో నాల్గవ వంతు కూడా ఇవ్వలేదు. మరోవైపు పెరిగిన ధరలకు అనుగుణంగా తాము నిర్వహించే శస్త్రచికిత్సలకు ఆరోగ్యశ్రీ కింద అందించే మొత్తాలను పెంచాలని విజ్ఞప్తి చేసినా పట్టించుకోని పరిస్థితి ఏర్పడింది. జిల్లాలో 60కిపైగా నెట్‌వర్క్ హాస్పటల్స్‌కు రూ.50 కోట్లకుపైగా బకాయిలు చెల్లించాల్సి ఉంది. ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన రాకపోవడంతో ఏమిచేయాలో దిక్కుతోచని స్థితిలో ఆరోగ్యశ్రీ సేవలను నిలిపివేస్తున్నట్లు ప్రకటించినట్లు సమాచారం. గత ప్రభుత్వంలో ఎప్పటికప్పుడు బకాయిలు చెల్లింస్తుండగా వైసీపీ ప్రభుత్వం వచ్చాక చెల్లింపులు అనేది కష్టతరంగా మారింది. నెట్‌వర్క్ హాస్పటల్స్‌లో సేవలు నిలిపివేస్తే ప్రత్యామ్నాయంగా ఏర్పాట్లు చేసేందుకు కూడా యంత్రాంగం చర్యలు చేపట్టడం లేదు. ప్రభుత్వం నుంచి మంగళవారం కూడా ఈవిషయమై ఆరోగ్యశ్రీ పథకాన్ని పర్యవేక్షించే అధికారులకు ఎలాంటి సమాచారం రాలేదని తెలుస్తోంది.

లక్ష్మీనరసింహుని ఆశీస్సులతో
విజయం సాధిస్తా : స్వామి



ఎమ్మెల్యే స్వామిని ఆశీర్వదిస్తున్న అర్చకులు

మద్దిపూడి, మే 21: పృథులగిరి లక్ష్మీనరసింహ స్వామిని మంగళవారం కొండపి శాసనసభ్యులు డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి దర్శించుకున్నారు. ఈసందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. లక్ష్మీనరసింహుని ఆశీస్సులతో విజయం సాధిస్తానని ఆయన ధీమ వ్యక్తం చేశారు. లక్ష్మీనరసింహ జయంతి వైశాఖ పూర్ణిమ సందర్భంగా లక్ష్మీనరసింహ భజన బృందం ఆధ్వర్యంలో జరుగుతున్న సప్తాహ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆయనవెంట తెలుగురైతు కార్య నిర్వాహక కార్యదర్శి యర్రమోతు శ్రీనివాసులు, కొండపి మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ గొర్రెపాటి రామయ్యచౌదరి, టీడీపీ మండల అధ్యక్షుడు చేరెడ్డి నార్సరెడ్డి, తెలుగురైతు అధికార ప్రతినిధి రేగుల వీరనారాయణ, జడ్పీటీసీ మాజీ సభ్యులు తుళ్ళూరి నరసింహారావు, గొంటు హనుమారెడ్డి, సారెడ్డి పుల్లారెడ్డి, కొణిదెన మోహన్‌రావు, ఈదుమూడి గురుబ్రహ్మం, అగ్రహారం రమేష్, పొదిలి శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

ఉపాధి పనులు తనిఖీ



ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఏపీవో వెంకటస్వామి

నాగులుప్పలపాడు, మే 21: ఉపాధి హామీ పథకం పనుల నిర్వహణలో అలసత్వం, నాణ్యత లేకపోవడంతో సిబ్బందిపై ఏపీవో ఆగ్రహం వ్యక్తం చేశారు. కె.తక్కెళపాడు, కొత్తకోట గ్రామాలలో పలుచోట్ల జరుగుతున్న ఉపాధి పనులను మంగళవారం ఒంగోలు క్లస్టర్ ఏపీవో పాలేటి వెంకటస్వామి తనిఖీ చేశారు. తక్కెళపాడు గ్రామ పంచాయతీ పరిధిలో మూడు ప్రదేశాలలో పనులు చేపడుతుండగా ఉదయం 8 గంటలు దాటినా పనులు ప్రారంభించక పోవడం, అక్కడ చేపట్టిన పనులు నాణ్యత లేక నాసిరకంగా ఉండటంతో టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్‌లపై ఏపీవో ఆగ్రహం వ్యక్తం చేశారు. క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతూ ఉన్నతాధికారులకు సిఫార్సు చేస్తానని చెప్పారు. వేసవి ఎండలు ఎక్కువగా ఉన్నందున కూలీలను ఉదయాన్నే 6 గంటలకు పని ప్రదేశంలో ఉండాలన్నారు. పనిప్రదేశంలో నీడ కోసం టెంట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, తాగునీరు, మెడికల్ కిట్లు తప్పనిసరిగా అందుబాటులో ఉంచాలని సిబ్బందికి సూచించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు కూలీలకు 300 రూపాయలు వేతనం అందేలా పనులు చేయించాలన్నారు. అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని ఏపీవో సిబ్బందిని హెచ్చరించారు. ఆయన వెంట ఏపీవో రవి, టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని రద్దు చేయాలి

చీరాలటౌన్, మే 21 : ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన భూహక్కు చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. మంగళవారం చీరాల సీనియర్ సిటిజన్స్ కార్యాలయంలో ల్యాండ్ టైటిలింగ్ చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఈ చట్టం అమలు జరిగితే భూ హక్కులు రాజకీయ నాయకుల చేతుల్లోకి వెళ్లిపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటికే వ్యతిరేకత ఉన్నట్లు చెప్పారు. వెంటనే దీనిని రద్దు చేసి ప్రజలకు, భూ హక్కుదారులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమం లో ఏఐటీయూసీ నాయకులు బత్తుల శామ్యేల్, సీఐటీయూ నాయకులు వసంతరావు, హేమసుందరరావు, పుష్పరాజ్, వాసు, మాచర్ల మోహన్‌రావు, కోటేశ్వరరావు, వెంకటేశ్వర్లు, కట్టా రాజీవినయ్‌కుమార్, మేడా వెంకటరావు, హరిహరరావు పాల్గొన్నారు.

విత్తనాల షాప్‌లో సోదాలు

- రెండు రకాల సీడ్స్ అమ్మకాల నిలిపివేత



దుకాణంలో తనిఖీలు చేస్తున్న అధికారులు

ఇంకొల్లు, మే 21 : ఇంకొల్లులో శ్రీహనుమాన్ సీడ్స్ అండ్ పెస్టిసైడ్స్ షాపులో విజిలెన్సు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, వ్యవసాయాధికారులు మంగళవారం సోదాలు చేశారు. రెండు కంపెనీలకు చెందిన రెండు రకాల ఉత్పత్తులకు సోర్స్ సర్టిఫికెట్ లేనందున దుకాణంలోని 28 కేజీల విత్తనాలు సుమారు రూ.3,36,388 విలువ కలిగిన వాటి అమ్మకాలను నిలిపివేశారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వ్యవసాయాధికారి కే రమణకుమార్ మాట్లాడుతూ ఎవరైనా అనుమతి లేకుండా, నకిలీ విత్తనాలు అమ్మితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీలలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఎం.రామచంద్రయ్య, వ్యవసాయాధికారి వేణుగోపాల్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. ప్రతి రైతు విత్తనాలు కొనేటప్పుడు దుకాణదారుడు నుంచి కచ్చితంగా బిల్లు తీసుకోవాలని వేణుగోపాల్ సూచించారు.

ఘనంగా భీమలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



ప్రత్యేక అలంకరణలో స్వామివార్లు

పంగులూరు, మే 21 : పంగులూరులో శ్రీ భీమలింగేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. రెండవరోజు మంగళవారం వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా వేద పండితులు శాస్త్రోక్తంగా కార్యక్రమాలు నిర్వహించారు. స్వామివారి కల్యాణం సందర్భంగా స్వామి అమ్మవారికి విశేషాలంకరణ గావించారు. ఉదయం నిత్యోపాసన, బలిహరణ, గ్రామోత్సవం, మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అమ్మవారి కుంకుమార్చన, స్వామివారిని పెళ్లి కుమారునిచేసే కార్యక్రమలు శాస్త్రోక్తంగా జరిగాయి. సాయంత్రం ఆలయ బలిహరణ, గ్రామోత్సవం అనంతరం రాయబారం గావించి స్వామి వారి దివ్య కల్యాణోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. భక్తులు స్వామి వారి దివ్య కల్యాణ మహోత్సవాన్ని తిలకించి పులకించారు. రాయబారం కార్యక్రమ వ్యాఖ్యాతగా శ్రీమాన్ నకరికంటి గోపి శరవణశర్మ వ్యవహరించగా, బ్రహ్మశ్రీ శైవాగమ పండితులు పేటేటి ఉదయభాస్కర శర్మ నేతృత్వంలో కార్యక్రమాలు జరిగాయి. కార్యక్రమాలలో ఆలయ ఈవో ఉప్పలమర్తి శ్రీనివాసరావు, అర్చకస్వాములు చందలూరి సునిల్‌కుమార్ శర్మ, కారంచేటి సాంబశివరావులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

1న శ్రీవీరాంజనేయస్వామి తిరునాళ్ల

మార్టూరు, మే 21 : మండల పరిధి బొబ్బేపల్లి, రాజుగారిపాలెం గ్రామాల మధ్య కొండపై వెలసిన శ్రీవీరాంజనేయస్వామి తిరునాళ్లను వచ్చే నెల 1వ తేదీ శనివారం నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఈ నెల 29వ తేదీ నుంచి దేవస్థానంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. అనంతరం 1వ తేదీన శ్రీ సువర్చలా సహిత వీరాంజనేయస్వామి కల్యాణం నిర్వహిస్తామన్నారు. అదే రోజు రాత్రి కోలాటం, ఎడ్ల బల ప్రదర్శన, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

పలు ప్రాంతాల్లో కార్డన్ సెర్చ్

వాహనాల తనిఖీలను విస్తృతంగా చేపట్టిన పోలీసు అధికారులు, సిబ్బంది • సరైన పత్రాలు లేని వాహనాల సీజ్



టంగుటూరులో పట్టుబడ్డ వాహనాలతో పోలీసులు



పొన్నలూరులో స్వాధీనం చేసుకున్న బైక్‌లతో సీఐ పాండురంగారావు

టంగుటూరు, మే 21 : జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మంగళవారం టంగుటూరు పంచాయతీ పరిధిలోని పోతుల చెంచయ్య వెస్ట్ కాలనీలో ఉదయం 5 నుంచి 8గంటల వరకు పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈసెర్చ్‌లో ఎలాంటి పత్రాలు లేని 25 మోటారు సైకిళ్లను గుర్తించారు. వీటన్నింటిని వారు స్వాధీనం చేసుకున్నారు. ఆ మోటారు సైకిళ్లను పోలీసులు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఎస్సై పున్నారావు ఆ బైక్‌ల వివరాలను ఒంగోలు ఆర్‌టీవో కార్యాలయానికి పంపిస్తారు. వాటి తాలూకా ఆధారాలే దొరకకుంటే వాటియజమానులకు ఆర్టీవో జరిమానా విధిస్తారు. జరిమానా చెల్లించాక ఆర్టీవో కార్యాలయం రిలీజ్ ఆర్డర్ చూపితే ఆ బండిని యజమానికి అప్పగిస్తారు. ఈ దాడిలో సింగరాయకొండ సీఐ రంగనాథ్, టంగుటూరు, జరుగుమల్లి ఎస్సైలు పున్నారావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పొన్నలూరులో 16 వాహనాలు స్వాధీనం

పొన్నలూరు (కొండపి): పొన్నలూరులో కొండపి సీఐ పాండురంగారావు ఆధ్వర్యంలో మంగళవారం పోలీసు సిబ్బంది కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సరైన ధ్రువీకరణ పత్రాలు లేని 16 ద్విచక్రవాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఆయన పోలీస్‌స్టేషన్ ఆవరణలో ప్రజలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కౌంటింగ్ జరిగేంత వరకు రాజకీయ దాడులకు పాల్పడినా, అవాంఛనీయ సంఘటనలకు పాల్పడినా కఠిన చర్యలు చేపడతామని హెచ్చరించారు. హింసాత్మక ఘటనలకు పాల్పడి, సంఘ వ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొని కేసుల పాలు కావద్దని ముఖ్యంగా యువతను హెచ్చరించారు. ఎన్నికల కేసుల్లో ఇరుక్కుంటే జీవితాంతం ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో కొండపి, పొన్నలూరు, మర్రిపూడి ఎస్సైలు కృష్ణబాజీబాబు, రాజేష్, బసవరాజు పాల్గొన్నారు.

రెడ్డిపాలెంలో 20 బైక్‌లు.

కొత్తపట్నం(ఒంగోలునగరం): కొత్తపట్నంలో పోలీసులు మంగళవారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. రెడ్డిపాలెంలో ఇంటింటిని జల్లెడపట్టారు. ఎలాంటి పత్రాలు లేకుండా ఉన్న 20 మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. ఈ సెర్చ్‌లో ఒంగోలు టూ టౌన్ సీఐ జగదీష్, కొత్తపట్నం ఎస్ఐ సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

కల్లు కోసమే వృద్ధురాలి దారుణహత్య

దొంగతనంగా అర్ధరాత్రి ఇంటిలోకి ప్రవేశం • కల్లు తాగుతుండగా నిద్ర లేచిన నాగేశ్వరమ్మ మందలింపు
హత్య చేసి గాజులు, కమ్మలతో నిందితులు పరారీ • కేసును ఛేదించిన పోలీసులు • ఇరువురి అరెస్టు..రిమాండ్‌కు తరలింపు

కొత్తపట్నం(ఒంగోలునగరం) మే 21: కల్లు తాగే అలవాటు. వృద్ధురాలి హత్యకు దారితీసింది. కల్లు అమ్మే వృద్ధురాలి ఇంటిలోకి దొడ్డిదారిన ప్రవేశించిన ఇరువురు కలు తాగుండగా ఆమె నిద్ర లేవడంతో హత్య చేసి చేతులకు ఉన్న రోల్డు గోల్డు గాజులు.. చెవికమ్మలు దొంగిలించి పరారయ్యారు. ఈ కేసును పోలీసులు ఛేదించి నిందితులను అరెస్టు చేశారు. గత శనివారం కొత్తపట్నంరెడ్డిపాలెంలో జరిగిన వృద్ధురాలి హత్య కేసును పోలీసులు తక్కువ సమయంలోనే ఛేదించారు. హత్యకు పాల్పడిన ఇద్దరిని మంగళవారం అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచగా న్యాయాధికారి రిమాండ్ విధించారు. హత్యకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి..

కొత్తపట్నం రెడ్డిపాలెంకు చెందిన గౌరవరపు నాంచార్లు, కోడూరి నాగరాజు బంధువులు. ఇద్దరు మద్యానికి అలవాటు పడ్డారు. చుక్కపడనిదే నిద్ర పట్టని పరిస్థితికి వారిది. రెడ్డిపాలెంలో కల్లు అమ్మే గుడపల్లి నాగేశ్వరమ్మ దగ్గర తరచూ కల్లు తాగుతుండే వారు. నాగేశ్వరమ్మ నివాసంలో ఒంటరిగానే ఉంటున్న విషయం వీరికి తెలుసు. గత శనివారం అర్ధరాత్రి ఇద్దరూ కల్లు కోసం నాగేశ్వరమ్మ ఇంటిలోకి ప్రవేశించారు. దొంగతనంగా కల్లు తాగుతుండగా నాగేశ్వరమ్మ నిద్రలేచి ఇద్దరిని పెద్దగా మందలించారు. దీంతో ఆగ్రహానికి గురయిన ఇద్దరు ఆమె తలపై బలంగా కొట్టారు. కింద పడిపోయిన ఆమె గొంతును గట్టిగా నులిమేశారు. అంతేగాకుండా ముఖంపై దిండుతో అదిమిపట్టారు. దీంతో నాగేశ్వరమ్మ అక్కడికక్కడే మృతి చెందారు. అనంతరం వారు మృతిరాలి చేతులకు ఉన్న గాజులను, చెవులకు ఉన్న బంగారు కమ్మలను లాగేసుకున్నారు. ఆమె వద్ద ఉన్న తాళాలు తీసుకుని బీరువాని తెరిచారు. బీరువాలో ఎలాంటి నగదుగాని, ఇతర ఆభరణాలు కాని లేకపోవటంతో అలాగే వదిలేసి పోయారు. ఈ విషయం ఎవరికీ తెలియకుండా ఇంటి నుంచి బయట పడ్డారు. అర్ధరాత్రి కావటంతో ఎవరూ గుర్తించలేక పోయారు. ఉదయాన్నే నాగేశ్వరమ్మ హత్య ఉదంతం గ్రామంలో గుప్పుమంది. పోలీసులు వేగంగా స్పందించారు. ఏఎస్పీ శ్రీధర్‌రావు, డీఎస్పీ కిషోర్ బాబు, టూ టౌన్ సీఐ జగదీష్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. హత్య జరిగిన ప్రాంతంలోని చుట్టుపక్కల అందుబాటులో ఉన్న సీసీకెమెరాల ఫుటేజిలను పరిశీలించారు. డాగ్ స్క్వాడ్‌లతో పరిశీలన జరిపారు. ఎట్టకేలకు నిందితులను గుర్తించి అరెస్టు చేశారు. నిందితులు నేరాన్ని పోలీసుల ఎదుట అంగీకరించినట్లు తెలిసింది. ఇద్దరిని కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించినట్లు టూటౌన్ సీఐ జగదీష్ తెలిపారు.

ప్రత్యేక అవసరాల పిల్లల సర్వే నిర్వహించాలి

- డీఈవో సుభద్ర

ఒంగోలు(విద్య), మే 21: జిల్లాలో ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులను గుర్తించేందుకు సర్వే నిర్వహించి వారిని 2024-25 విద్యా సంవత్సరానికి సమీపంలోని పాఠశాలలో చేర్పించాలని భవిత కేంద్రాల్లో పనిచేస్తున్న సహిత విద్యా రిసోర్స్‌పర్సన్లను జిల్లా విద్యాశాఖాధికారి డి.సుభద్ర మంగళవారం ఆదేశించారు. 21 రకాల ప్రత్యేక అవసరాల పిల్లలను గుర్తించి వారి వివరాలను తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేయించాలన్నారు. మండలంలోని గ్రామాలను రెండు క్లస్టర్లుగా విభజించి మండలంలోని సహిత విద్యా రిసోర్స్‌పర్సన్లకు కేటాయించారు. రిసోర్స్‌పర్సన్లు తమకు కేటాయించిన క్లస్టరు పరిధిలోని గ్రామాలను సందర్శించి సర్వే నిర్వహించాలని, మండల విద్యాధికారులు ఈ సర్వేను పర్యవేక్షించాలని సూచించారు. 20 రోజుల పాటు జరిగే ఈ సర్వే వివరాలను ఎప్పటికప్పుడు సమగ్ర శిక్ష జిల్లా ప్రాజెక్టు కార్యాలయానికి తెలియజేయాలన్నారు. సర్వే అనంతరం పిల్లల గుర్తింపు, పాఠశాలల్లో నమోదు పూర్తయిన తర్వాత వివరాలను నిర్ణీత ప్రొఫార్మాలో మండల విద్యాధికారి సంతకంతో సమగ్ర శిక్ష జిల్లా కార్యాలయానికి పంపించాలని ఆదేశించారు.

230 మంది గుర్తింపు

జిల్లావ్యాప్తంగా ఇప్పటి వరకు 230 మంది ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులను గుర్తించినట్లు జిల్లా సహిత విద్యా కో ఆర్డినేటర్ ఎం.రమేష్ తెలిపారు. సర్వేలో భాగంగా రమేష్ మంగళవారం ఒంగోలులోని గద్దలగుంటలోని దివ్యాంగురాలు ఇంటిని సందర్శించారు. భవిత కేంద్రాల్లో దివ్యాంగులకు లభిస్తున్న ప్రత్యేక సదుపాయాలు, సేవలు గుర్తించి తల్లిదండ్రులకు వివరించారు. కార్యక్రమంలో సహిత విద్యారిసోర్స్ టీచర్లు పాల్గొన్నారు.

కౌంటింగ్ ఏర్పాట్లను వేగవంతం చేయాలి

- కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశం



కౌంటింగ్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు(కలెక్టరేట్), మే 21 : వచ్చేనెల 4వతేదీన జరగనున్న ఓట్లలెక్కింపునకు అవసరమైన కౌంటింగ్ కేంద్రాల పనులను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా ఎన్నికల అధికారైన కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. ఒంగోలు సమీపంలోని రైజ్ ఇంజనీరింగ్‌లో జరుగుతున్న పనులను మంగళవారం రాత్రి దినేష్‌కుమార్ పరిశీలించారు. ఇదే ప్రాంగణంలో కౌంటింగ్ కూడా ఉన్నందున ఆ దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. ఓట్ల లెక్కింపు గదుల వద్ద సిబ్బందికి, రాజకీయ పార్టీల ఏజెంట్లకు వేరువేరుగా బ్యారికేడ్లు ఏర్పాటు చేయాలన్నారు. ఓటల లెక్కింపు విధులలో పాల్గొనే సిబ్బందికి శిక్షణ కార్యక్రమాన్ని ఈ ప్రాంగణంలోనే గురువారం నిర్వహించనున్నట్లు తెలిపారు. టేబుల్స్ ఏర్పాటు చేసే విషయంలో అధికారులకు పలు సూచనలను చేశారు. కలెక్టర్ వెంట డీఆర్వో శ్రీలత, ఒంగోలు లోక్‌సభ నియోజకవర్గ ఏఆర్వో ఝాన్సీలక్ష్మీ, గిద్దలూరు ఆర్వో డి.నాగజ్యోతి, ఎన్నికల విభాగ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు

ఎవరివద్దా లంచాలు తీసుకోలేదు : ఎంపీపీ



మాట్లాడుతున్న ఎంపీపీ ప్రసన్నకుమారి

మేదరమెట్ల, మే 21 : తాము ఎవరివద్దా లంచాలు తీసుకోలేదని, తమపై అనవసరంగా వివాదం చేస్తున్నారని, తప్పుడు కేసులు పెట్టడానికి ప్రయత్నించారని ఎంపీపీ సాధినేని ప్రసన్నకుమారి అన్నారు. మంగళవారం కొరిశపాడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి ఆమె అధ్యక్షతన వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు తాము ఎవరికీ పనులు చేయకుండా బిల్లులు చెల్లించలేదని, తమపై అనవసరంగా నిందలు వేస్తున్నారన్నారు. ఇటువంటి విమర్శలు బాధిస్తాయన్నారు. కొంతమంది అధికారులు మండల అభివృద్ధిలో భాగం కాగా మరికొంత మంది వివాదం సృష్టిస్తున్నారన్నారు. కోరం లేకపోవడంతో మండల పరిషత్ సమావేశం వాయిదా వేస్తున్నట్లు ఆమె ప్రకటించారు. సమావేశానికి ఎం పీపీతో పాటు నలుగురు ఎంపీటీసీలు హాజరు కావడంతో సమావేశం వాయిదా వేశారు. వేసవిలో తాగునీటి సమస్యలు వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులు, తొలకరిలో రైతులకు అందించాల్సిన పచ్చిరొట్ట వివరాలు కానీ సమావేశంలో చర్చించకపోవడంపై ప్రజాప్రతినిధుల తీరును మండల ప్రజలు ఆక్షేపిస్తున్నారన్నారు. సమావేశానికి జడ్పీటీసీ తుళ్లూరి వెంకటరమణ, తహసీల్దార్ బి.సుశీల, ఎంపీడీవో సమతావాణి, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు.

పిచ్చికుక్క స్వైరవిహారం

- ఒకే రోజు 10మందిని గాయపరిచన వైనం
- ప్రభుత్వాసుపత్రికి పరుగులు తీసిన బాధితులు
- ఆందోళనలో ప్రజలు



కుక్క దాడిలో గాయపడి ఆసుపత్రిలో వైద్యం పొందుతున్న వృద్ధురాలు



గాయపడిన బాలుడు

పర్చూరు, మే 21 : పిచ్చికుక్క దాడిలో 10 మంది తీవ్రంగా గాయపడిన సంఘటన మంగళవారం పర్చూరులో చోటుచేసుకుంది. ఒకే రోజు పదుల సంఖ్యలో పిచ్చికుక్క దాడిలో గాయపడడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పిచ్చికుక్క దాడిలో తీవ్రంగా గాయపడినవారు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి పరుగులు తీసారు. మూకుమ్మడిగా బాధితులు మూకుమ్మడిగా క్యూ కట్టి మరీ వైద్యం కోసం పర్చూరు ప్రభుత్వ వైద్యశాలకు పోవడంతో వారుసైతం ఒకింత ఆందోళనకు గురయ్యారు. మండలంలోని దేవరపల్లి గ్రామానికి చెందిన మారినేని ఆదిలక్ష్మి పర్చూరు గుడికి వచ్చి తిరుగు ప్రయాణం చేస్తుంగా వెనుకుండి వచ్చిన పిచ్చికుక్క ఆమెపై దాడిచేసి తీవ్రంగా గాయపరిచింది. అపస్మారక స్థితిలో ఉన్న వృద్ధురాలిని హుటాహుటిన పర్చూరు వైద్యశాలకు తరలించారు. వృద్ధురాలిని రక్షించే క్రమంలో అదే గ్రామానికి చెందిన మరో వ్యక్తిని కూడా పిచ్చికుక్క దాడిచేసి గాయపరిచింది. అదేవిధంగా పర్చూరు ఇందిరాకాలనీలో ఆడుకుంటున్న ఇద్దరు బాలురుతోపాటు, సమీపంలో ఉన్న పశువులపై కూడా కుక్క దాడిచేసి గాయపడరినట్లు స్థానికులు చెప్తున్నారు.

పర్చూరులో పరిస్థితి దయనీయం

పర్చూరులో పరిస్థితి మరింత దయనీయంగా మారింది. వీధుల్లో ఎక్కడ చూసినా వందల సంఖ్యలో కుక్కలు కన్పిస్తుంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. రాత్రి సమయాల్లో వీధుల్లోకి రావాలంటే ప్రజలు భయపడుతున్నారు. ఏది పిచ్చికుక్కో ఏది మంచి కుక్కో తెలియని స్థితిలో పరిస్థితి నెలకొందని ప్రజలు వాపోతున్నారు. ప్రస్తుత పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని శునకాల బారి నుంచి ప్రజలను రక్షించే విధంగా పంచాయతీ అధికారులు ప్రత్యేక దృష్టిసారించాలని ప్రజలు కోరుతున్నారు.

అవీ..ఇవీ..

టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలకు హాల్‌టిక్కెట్లు సిద్ధం

- డీఈవో సుభద్ర

ఒంగోలు(విద్య), మే 21: పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థుల హాల్ టిక్కెట్లు వెబ్‌సైట్‌లో సిద్ధంగా ఉన్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి డి.సుభద్ర మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలు ఈనెల 24నుంచి జూన్ 3వతేదీ వరకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. హాల్ టిక్కెట్లను ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ వెబ్‌సైట్ నుంచి పాఠశాలల హెచ్‌ఎంల లాగిన్ ద్వారా డౌన్‌లోడ్ చేసు కోవచ్చన్నారు. ఇందుకు సంబంధించిన సమాచారం కోసం 7842777439, 7842777429 సెల్‌నెంబర్లను సంప్రదించాలని డీఈవో కోరారు.

మహిళా కాలేజీలో మూల్యాంకనం ప్రారంభం

ఒంగోలు(విద్య), మే 21 : ఆచార్య నాగార్జున యూనివర్సిటీకి సంబంధించిన మూడవ సంవత్సరం 5వ సెమిస్టర్ రెండవ సంవత్సరం నాల్గవ సెమిస్టర్ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం మంగళవారం ఒంగోలులోని ప్రభుత్వ మహిళా కళాశాలలో ప్రారంభమైంది. బీఎస్సీ అన్ని సబ్జెక్టులు, బీఏ ఎకనామిక్స్, హిస్టరీ పొలిటికల్ సైన్స్, బీకాం కామర్స్‌కు సంబంధించిన సబ్జెక్టుల మూల్యాంకనం జరుగుతుందని క్యాంపు ఆఫీసర్ డాక్టర్ డి.కళ్యాణి తెలిపారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు కళాశాలల అధ్యాపకులు మూల్యాంకనానికి హాజరైనట్లు ఆమె పేర్కొన్నారు.

రేపు ఎంపీ మాగుంట రాక

ఒంగోలు(కలెక్టరేట్), మే 21 : ఒంగోలు లోక్‌సభ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి గురువారం ఒంగోలులో జరిగే పలు కార్యక్రమాలకు హాజరుకానున్నారు. ఈనెల 23వతేదీ ఉదయం 8 గంటలకు, అలాగే మధ్యాహ్నం సమయంలో రామనగర్‌లోని మాగుంట కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారు. అనంతరం నగరంలో జరిగే కార్యక్రమాల్లో పాల్గొంటారు.

ఉచిత సమ్మర్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలి

ఒంగోలు(విద్య), మే 21 : ఒంగోలు చిల్డ్రన్ క్లబ్ ఆధ్వర్యంలో ఈనెల 25నుంచి జూన్ 1వతేదీ వరకు స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో ఉచిత సమ్మర్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈమేరకు కార్యాలయంలో మంగళవారం సమ్మర్ క్యాంపు పోస్టర్లను నిర్వాహకులు వినోద్, జ్యోతి, పి.నరసింహారావు, బాబు ఆవిష్కరించారు. విద్యార్థులకు ఆటలు, పాటలు, క్రాఫ్టింగ్, మ్యూజిక్, ఫన్ని మ్యాథ్స్, ఇంకా పలు రకాల విజ్ఞానదాయక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. వివరాలకు 9490300412 సెల్‌నెంబర్‌ను సంప్రదించాలని వారు కోరారు.

నేడు రావిపాటి ప్రథమ వర్ధంతి

కొండపి, మే 21 : మండలంలోని చోడవరం గ్రామంలో మండల మాజీ వైస్ ఎంపీపీ, దివంగత టీడీపీ నాయకుడు రావిపాటి మధుసూదనరావు ప్రథమ వర్ధంతి కార్యక్రమం బుధవారం జరగనుంది. కుటుంబసభ్యులు నిర్వహిస్తున్నారు. మధుసూదనరావు తండ్రి వారసత్వంగా వచ్చిన శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఉపాసన, ఆరాధన చేస్తుండేవాడు. గత ఏడాది శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆరాధన కార్యక్రమం నిర్వహిస్తూ మధుసూదనరావు మరణించారు. వైస్ ఎంపీపీగా పని చేసిన మధుసూదనరావు తన తల్లి పేరున చారిటబుల్ ట్రస్టు ఏర్పాటు చేసి పలు సేవా కార్యక్రమాలు మండలంలో కొనసాగించారు. వర్ధంతి కార్యక్రమాన్ని బుధవారం తమ స్వగృహంలో నిర్వహిస్తున్నామని కుటుంబ సభ్యులు తెలిపారు.

కొనసాగుతున్న వేసవి విజ్ఞాన తరగతులు



ప్రయోగాలపై అవగాహన కల్పిస్తున్న శామ్యూల్

నాగులుప్పలపాడు, మే 21: ఉప్పుగుండూరు గ్రంథాలయంలో గత నాలుగు రోజులుగా జరుగుతున్న వేసవి విజ్ఞాన తరగతులలో భాగంగా మంగళవారం విద్యార్థులకు వ్యక్తిత్వవికాసం గురించి సామాజిక సేవా కార్యకర్త తెలగతోటి శామ్యూల్ వివరించారు. పుస్తక పఠనం, నీతి కథలు చదివించి వివరించారు. కార్యక్రమంలో గ్రంథపాలకులు ఎ.ప్రసాద్ పాల్గొన్నారు.

కూలీలకు వసతులు కల్పించాలి

కొండపి, మే 21 : ఉపాధి కూలీలకు మెరుగైన వసతులు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కేజీ మస్తాన్ డిమాండ్ చేశారు. మంగళవారం ఉదయం మండలంలోని మూగచింతల గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన కూలీలతో మాట్లాడారు. కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పని ప్రదేశంలో టెంటు, దుస్తులు, పలుగు, పారలు లేవని కూలీలు తెలిపారు. మెడికల్ కిట్లు, మజ్జిగ, మంచినీరు లేదని వాపోయారు. మస్తాన్ వెంట వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు హరిబాబు, రాము, అగ్గిరాజు, సునీత, వెంకాయమ్మ పాల్గొన్నారు.

అభ్యర్థులతో సమావేశం



నాయకులతో మాట్లాడుతున్న ఆర్వో కుమార్

కొండపి, మే 21 : కొండపి అసెంబ్లీ నియోజకవర్గానికి పోటీ చేసిన అభ్యర్థులతో నియోజకవర్గ ఎన్నికల అధికారి ఎ.కుమార్ మంగళవారం తన కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కౌంటింగ్ ఏర్పాట్లు, స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద భద్రతా ఏర్పాట్లు, కౌంటింగ్ ఏజెంట్ల గుర్తింపు కార్డులు తదితర విషయాలపై తగిన సూచనలు ఆర్వో చేశారు. సమావేశంలో సీపీఎం నాయకుడు కేజీ మస్తాన్, అన్ని మండలాల తహసీల్దార్‌లు పాల్గొన్నారు.

కొండపిలో కేజీ పొగాకు రూ.318

కొండపి, మే 21 : కొండపి పొగాకు వేలం కేంద్రంలో ఎఫ్-1 రకం పొగాకు కేజీ 318 రూపాయలు ధర పలికింది. వేలానికి అయ్యపరాజుపాలెం, నరసరాజుపాలెం, పెదకండ్లగుంట గ్రామాలకు చెందిన పొగాకు రైతులు 965 బేళ్లను వేలానికి తీసుకురాగా, 918 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారని వేలం నిర్వహణాధికారి జి. సునీల్‌కుమార్ తెలిపారు. అత్యధికంగా కేజీకి ధర 318 రూపాయలు పలికిందని వివరించారు.

ఘనంగా కొండేపమ్మ ఆలయ వార్షికోత్సవం



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

కొండపి, మే 21 : కొండేపమ్మ ఆలయ 18వ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఆలయ నిర్మాణ దాతలు గుర్రం ప్రసాద్ బ్రదర్స్ ఆధ్వర్యంలో మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈసందర్భంగా భజన చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

రేపే టంగుటూరులో క్రీడాభారతి సమావేశం

టంగుటూరు, మే 21 : క్రీడాభారతి జిల్లా స్థాయి సమావేశం ఈనెల 23న టంగుటూరులోని శ్రీనివాస థియేటర్ ఆవరణలో జరుగుతుందని ఆర్గనైజర్ పత్తిపాటి విజయకుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 23న సాయంత్రం నాలుగు గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని, ఈ సమావేశానికి జిల్లాలోని క్రీడాభారతి సభ్యులంతా హాజరుకావాలని జిల్లా రెజ్లింగ్ కార్యదర్శి సురేష్ రెడ్డి కోరారు. అనంతరం జిల్లా కార్యవర్గ ఎన్నిక జరుగుతుందని, ముఖ్యఅతిథులుగా అబ్జర్వర్ ధనుంజయరెడ్డి హాజరవుతారని తెలిపారు.

ఉచిత యోగా శిక్షణ

టంగుటూరు, మే 21 : టంగుటూరులోని ఆలకూరపాడు రోడ్డులోగల మణికంఠ ఆశ్రమంలో వచ్చే ఆదివారం నుంచి ఉచిత యోగా శిక్షణ ఉంటుందని ఆర్గనైజర్ అబ్బూరి వరప్రసాద్ మంగళవారం తెలిపారు. ప్రారంభ దినమైన ఆదివారం, 26న గేటు టు గెదర్ ఆశ్రమంలో ఉదయం 10 గంటలకు శిక్షణ ప్రారంభమవుతుందని, సోమవారం నుంచి రోజూ ఉదయం 6 నుంచి 7గంటల వరకు, సాయంత్రం 5 నుంచి 6గంటల వరకు శిక్షణ కొనసాగుతుందని వివరించారు. ప్రముఖ యోగా శిక్షకురాలు జ్యోతి మాతాజీ శిక్షణలో ఉదయం, సాయంత్రం యోగా తరగతులు నిర్వహించబడతాయని అబ్బూరి తెలిపారు.

శేషవాహనంపై విహరించిన వేణుగోపాలస్వామి

నాగులుప్పలపాడు, మే 21 : ఉప్పుగుండూరు గ్రామంలో వెంచేసి ఉన్న శ్రీ రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి బ్రహోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. రెండవ రోజు మంగళవారం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు, అభిషేకాలు చేశారు. రాత్రి శేషవాహనంపై విష్ణుమూర్తి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. గ్రామ పురవీధుల్లో స్వామి వారి గ్రామోత్సవం నిర్వహించారు. దేవస్థాని ఈవో ఈవో శ్రీనివాసరావు, చైర్మన్ పెంట్యాల శ్రీనివాసరావు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

విద్యాదీవెన, వసతిదీవెన పథకాలు

పక్కాగా అమలు చేయాలి : డీడీ



మాట్లాడుతున్న డీడీ లక్ష్మానాయక్

మార్కాపురం వన్‌టౌన్, మే 21: విద్యాదీవెన, వసతి దీవెన పథకాలు పక్కాగా అమలు చేయాలని సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ లక్ష్మానాయక్ పేర్కొన్నారు. మార్కాపురంలోని వేమన డిగ్రీ కళాశాలలో 2023-24 సంవత్సరానికి విద్యా, వసతి దీవెనల పథకాలకు సంబంధించి సహాయ సాంఘిక సంక్షేమ అధికారి ఎన్. అరుణకుమారి ఆధ్వర్యంలో మార్కాపురం డివిజన్ పరిధిలోని వెల్ఫేర్, అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు, వార్డు ఎడ్యుకేషన్, డేటా ప్రాసెసింగ్ కార్యదర్శులు కళాశాల కోఆర్డినేటర్లకు పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా లక్ష్మానాయక్ మాట్లాడుతూ పథకాలకు సంబంధించి అర్హత కలిగిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనార్టీ విద్యార్థులకు ఈ పథకాల లబ్ది చేకూర్చే విధంగా చూడాలన్నారు. జాయింట్ ఖాతాలకు సంబంధించి ఖాతాలను అప్డేట్ చేయాలన్నారు. గడిచిన త్రైమాసికం వరకు విడుదలైన నిధులను కళాశాలలకు చెల్లించని తల్లులకు ఫీజులు కళాశాలలకు చెల్లించే విధంగా కౌన్సిలింగ్ నిర్వహించి నవశకం లాగిన్‌లలో అప్డేట్ చేయాలన్నారు. వివిధ 8 అంశాలపై వివరించి నిర్ణీత సమయంలో అప్డేట్ చేయని అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో గిద్దలూరు, బేస్తవారపేట సహాయ సాంఘిక సంక్షేమాధికారులు అమ్మాజి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

దొనకొండలో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు

హాల్టింగ్ ఎప్పుడో..?

రైల్వే జనరల్ మేనేజర్, బోర్డు చైర్‌పర్సన్‌కు ఎంపీ మాగుంట విన్నవించినా కానరాని స్పష్టత

దొనకొండ, మే 21: దొనకొండ రైల్వేస్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ సౌకర్యం లేక, ఉన్న రైళ్లను డబ్లింగ్ లైను పనుల కారణంగా అధికారులు తరచూ తాత్కాలికంగా రద్దు చేస్తున్నారు. దీంతో ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. దొనకొండ రైల్వేస్టేషన్లో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ సౌకర్యం ఉన్నట్లా, లేనట్లా.. ఉంటే ఎప్పుడు కల్పిస్తారో అర్థంకాని పరిస్థితి నెలకొంది. కరోనాకు ముందు అన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ ఉండేది. ఆ తర్వాత ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ సౌకర్యం ఎత్తేయటంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విశాఖపట్టణం, బెంగళూరు, విజయవాడ తదితర ప్రాంతాల నుంచి రాకపోకలు జరుపుకునే వారు దొనకొండలో ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగకపోవటంతో మార్కాపురం లేదా వినుకొండ రైల్వే స్టేషన్లల్లో దిగాల్సి వస్తుంది. దక్షిణ మధ్య రైల్వే జీఎం గజానన్‌మాల్యా 2021లో దొనకొండ పర్యటనకు విచ్చేసిన సందర్భంగా ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారేగాని ఎటువంటి స్పష్టమైన హామీ ఇవ్వలేదు. తదనంతరం ఈ విషయాన్ని స్థానికులు ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి దృష్టికి తీసుకెళ్లి దొనకొండలో ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్టింగ్ సౌకర్యం కల్పించేలా తగిన చర్యలు చేపట్టాలని విన్నవించారు. అందుకు స్పందించిన ఎంపీ రైల్వే జీఎం దొనకొండకు వచ్చిన రోజు స్వయంగా కలుసుకొని దొనకొండలోని రైల్వేపరమైన అనేక సమస్యలు ఆయన దృష్టికి తెచ్చారు. ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ సౌకర్యం కల్పించాలంటూ విజ్ఞప్తి చేసి వినతిపత్రం అందించారు. ఇది జరిగి నెలలు గడిచినా నేటికీ ఎటువంటి స్పందన లేదు. తిరిగి ఎంపీ మాగుంట శ్రీని వాసులురెడ్డి గత సెప్టెంబరు 20న ఢిల్లీలో రైల్వే బోర్డు చైర్‌పర్సన్ జయవర్మసిన్హాను కలిసి దొనకొండలో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ సౌకర్యం కల్పించాలంటూ వివరించి వినతిపత్రం అందజేశారు. దీంతో దొనకొండలో ఎక్స్‌ప్రెస్ రైళ్లు కచ్చితంగా హాల్టింగ్ అవకాశం కల్పిస్తారంటూ ప్రజలు ఎంతో ఆశపడ్డారు. నెలలు గడుస్తున్నా ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగకుండా పరుగులు తీస్తుండటం, రైల్వే ఉన్నతాధికారుల నుంచి ఎటువంటి ఉత్తర్వులు రాక పోవటంతో తమకు రవాణా కష్టాలు తప్పవని ప్రజలు నిత్యం చర్చించుకుంటున్నారు.

అమృత్‌భారత్ పథకానికి ఎంపిక

అమృత్‌భారత్ పథకానికి గత ఆగస్టు 6న దొనకొండ రైల్వే స్టేషన్‌ఎంపిక కావటంతో దాదాపు రూ.17 కోట్లతో అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయి. జరుగుతున్న పనులు చూసి పనులు పూర్తయిన తర్వాత ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ సౌకర్యం కల్పిస్తారేమోనని ప్రజలు చర్చించుకోవటం మొదలుపెట్టారు. దొనకొండ ప్రాంత ప్రజలకు రోడ్డు మార్గాన సహితం సరైన రవాణా సౌకర్యం లేక రైలు ప్రయాణమే దిక్కు కావటంతో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ సౌకర్యం ఎప్పుడు కల్గుతుందోనని ప్రజలు నిత్యం ఆశగా ఎదురుచూస్తున్నారు. బెంగళూరు, విశాఖపట్టణం, విజయవాడ, తదితర పట్టణాల నుంచి రాకపోకలు జరుపుకునేందుకు వీలుగా దొనకొండ రైల్వేస్టేషన్‌లో కొండవీడు-అమరావతి, ధర్మవరం ఎక్స్‌ప్రెస్ రైళ్లకైనా దొనకొండలో హాల్టింగ్ సౌకర్యం కల్పించేలా పాలకులు చర్యలు చేపట్టి తమ రవాణా కష్టాలు తీర్చాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

ఊరించి..ఉసూరుమనిపించి..!

- లోగ్రేడ్ ధరకే పరిమితమైన నాణ్యమైన పొగాకు
- ఆందోళనలో వైట్‌బర్లీ రైతులు
- ధర కోసం ఎదురుచూపు



పర్చూరులో అమ్మకానికి సిద్ధంగా ఉన్న పొగాకు

పర్చూరు, మే 21 : ఒక పక్క ప్రకృతి వైపరీత్యాలు, మరో పక్క వాతావణ పరిస్థితులు, అధిక పెట్టుబడులు వెరసి రైతులను కలవరానికి గురిచేస్తున్నాయి. వేలకువేల పెట్టుబడులు పెట్టి సాగు చేసుకున్న రైతులకు సరైన ధరలేకపోవడంతో నష్టాలపాలు కావాల్సిన దుస్థితి నెలకొంది. దీంతో ఏమిచేయాలో పాలుపోని స్థితిలో రైతులు ఉన్నారు. పర్చూరు వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో వేల ఎకరాల్లో సాగు చేసుకున్న వైట్ బర్లీ పొగాకు రైతులు పరిస్థితి అగమ్య గోచరంగా తయారైంది. పంట చేతికి వచ్చిన తరుణంలో లోగ్రేడ్ పొగాకు క్వింటాకు రూ.14వేలు పైచిలుకు పలకడంతో సాగుచేసుకున్న రైతులకు ఎంతో ఊరట నందించింది. దీంతో నాణ్యమైన వైట్‌బర్లీ పొగాకుకు మంచి ధర పలుకుతుందని ఆశపడ్డారు. ఆశ కాస్త అడి ఆశగా ప్రస్తుత పరిస్థితి నెలకొంది. లోడ్ గ్రేడ్ ధరకు మించి నాణ్యమైన పొగాకు కొనుగోలు జరగడం లేదు. దీంతో ఏమిచేయాలో పాలుపోని స్థితిలో అన్నదాతలు ఉన్నారు. ఎన్నికల నేపథ్యంలో కొనుగోలుదారులు ముందుకు రావడం లేదని రైతులు అనుకున్నారు. ఎన్నికలు ముగిసినా ధరల పెరుగుదలలో మార్పులేక పోవడం, కొనుగోళ్లు కూడా మందకుడిగా సాగడంతో రైతుల్లో నైరాశ్యం నెలకొంది. మరో పక్క వర్షాల నేపథ్యంలో చేతికి అందివచ్చిన పంట దెబ్బ తింటుందని రైతులు ఆందోళన చెందుతున్నా రు. బహిరంగ మార్కెట్‌లో వైట్‌బర్లీ పొగాకుకు నాణ్యమైన ధర ఉన్నా వ్యాపారులు సిండికేట్‌గా మారడం వల్లే ధరలు ఇలా దిగజారుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ సీజన్ సమీపిస్తుండడంతో పెట్టుబడుల కోసం విక్రయాలు చేయాల్సి వస్తుందని రైతులు అంటున్నారు.

ధరపైనే రైతుల ఆశ

ప్రస్తుతం వ్యవసాయ ఖర్చులు, నామమాత్రపు దిగుబడుల నేపథ్యంలో ధర అనుకూలంగా ఉంటేనే పెట్టిన పెట్టుబడులు వచ్చే పరిస్థితి. గత ఏడాది సీజన్ ము గిసే సమయంలోనాణ్యమైన పొగాకు క్వింటా రూ.18వేలకు కొనుగోలు చేశారు. దీంతో ఈఏడాది కూడా అనుకున్న మేర ధర ఉంటుందన్న ఆశతో రైతులు వేల ఎకరాల్లో వైట్ బర్లీ పొగాకును సాగు చేశారు. ప్రస్తుతం ఉన్న ధరలతో రైతుల్లో నైరాశ్యం నెలకొంది.

నేడు లక్ష్మీనరసింహస్వామి తిరునాళ్ల

- స్వామివారి శాంతి కల్యాణానికి ఏర్పాట్లు



ప్రత్యేక అలంకరణలో శ్రీలక్ష్మీ నరసింహస్వామి, అమ్మవారు



పంచముఖ ఆంజనేయస్వామి

మార్టూరు, మే 21 : మండలంలోని బొల్లాపల్లి గ్రామంలో బుధవారం శ్రీలక్ష్మీనరసింహ స్వామి తిరునాళ్ల వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఏటా గ్రామంలో ప్రజలు స్వామి వారి తిరునాళ్లను నిర్వహించడం ఆనవాయితీ. అందులో భాగంగా ఈ ఏడాది కూడా వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ తిరునాళ్లకు గ్రామానికి చెందిన వారు ఇతర ప్రాంతాలలో నివసించేవారు తప్పనిసరిగా వస్తారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి ఇంటా బంధువులతో స్నేహితులతో పండుగ వాతావరణం కనిపిస్తుంది. మంగళవారం నుంచి ప్రారంభమైన తిరునాళ్ల కార్యక్రమంలో భాగంగా ఉదయం దేవస్థానంలో హరినామ సంకీర్తన, ప్రత్యేక పూజలు తదితర కార్యక్రమాలను నిర్వహించారు. బుధవారం ఉదయం గ్రామంలోని కొండపై వేంచేసి ఉన్న లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ఉదయం 9 గంటలకు స్వామి వారి శాంతి కల్యాణం నిర్వహిస్తారు. ఆలయంలో ఉన్నలక్ష్మీ నరసింహస్వామి ఉత్సవ విగ్రహాలకు అర్చకులు స్వామి వారి కల్యాణం నిర్వహిస్తారు. కల్యాణోత్సవం తిలకించడానికి గ్రామంలోని ప్రజానీకం అందరూ కొండపైకి వెళ్లి దేవస్థానంలో పూజా కార్యక్రమంలో పాల్గొంటారు. అదేవిధంగా కొండ పైన దేవ స్థానం ఆవరణలో పంచ ముఖ నిలువెత్తు ఆంజనేయ స్వామి విగ్రహం భక్తులను విశేషంగా ఆకట్టుకుంటుంది. అనంతరం మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేస్తారు. సాయంత్రం 6 గంటలకు గ్రామంలో కల్యాణం జరుపుకున్న శ్రీలక్ష్మీ నర సింహస్వామి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో భక్తులు వెంటరాగా గరుడోత్సవం నిర్వహిస్తారు. కార్యక్రమానికి లో భక్తులు, గ్రామస్థులు విశేషంగా తరలిరావాలని ఆలయ కమిటీ సభ్యులు కోరుతున్నారు.

కౌంటింగ్ ప్రశాంతంగా జరిగేలా సహకరించాలి

- ఎస్పీ గరుడ్‌సుమిత్‌సునీల్



సదస్సులో మాట్లాడుతున్న ఎస్పీ గరుడసుమిత్‌సునీల్

దర్శి, మే 21: ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగేందుకు రాజకీయ పార్టీలు, ప్రజలు పూర్తి సహకారం అందించాలని ఎస్పీ గరుడ సుమిత్ సునీల్ కోరారు. దర్శిలోని పీజీఎన్ కల్యాణ మండపంలో మంగళవారం దర్శి నియోజకవర్గంలోని రాజకీయ పార్టీల ప్రతినిధులు, పెద్దలతో జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని అత్యధికంగా దర్శి నియోజకవర్గంలో 90.91 శాతం పోలింగ్ నమోదు కావటం అభినందనీయమన్నారు. పోలింగ్ సందర్భంగా దర్శి, బొట్లపాలెం, దేవవరం గ్రామాల్లో హింసాత్మక సంఘటనలు జరగటం బాధాకరమన్నారు. పార్టీలు, కుల, మతవర్గాలుగా విడిపోయి పంతాలు, పట్టింపులతో దాడులు చేసుకుంటే సహించేది లేదని హెచ్చరించారు. ఉద్దేశపూర్వకంగా సామాన్య ప్రజల హక్కులకు భంగం కల్గిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరైనా బాంబులు, ఇతర మారణాయుధాలు నిల్వ ఉంచినట్లు తెలిస్తే వెంటనే సమాచారం అందించాలని కోరారు. రాయలసీమతో పాటు పక్కన ఉన్న పల్నాడు జిల్లాలో జరిగిన హింసాత్మక సంఘటనలు దృష్టిలో ఉంచుకొని ఎన్నికల కమిషన్ కొత్త నిబంధనలు పెట్టినట్లు చెప్పారు. ఎవరి వద్దనైనా 9 ఇంచులకు మించిన కత్తి లాంటి మారణాయుధాలు కల్గి ఉండరాదన్నారు. పోలీసులు అన్నీ గ్రామాల్లో తనిఖీలు నిర్వహిస్తారని చెప్పారు. ఆ తనిఖీల్లో మారణాయుధాలు పట్టుబడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కొంతమంది వాట్సాప్‌లలో, ఫేస్‌బుక్‌లలో రెచ్చగొట్టే అభ్యంతకర పోస్టింగులు పెడుతున్నారని, వాటిని పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా జరిగేందుకు అందరూ సహకరించాలని కోరారు. అనంతరం పోలీస్‌శాఖ, అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో సాహస విన్యాసాల కార్యక్రమం నిర్వహించారు. అధికారులు చేసిన సాహస విన్యాసాలు ప్రజలను అలరించాయి. కార్యక్రమంలో దర్శి డీఎస్పీ అశోక్‌వర్ధన్‌రెడ్డి, సీఐ షేక్ షమీముల్లా, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ యాజమాన్య నిర్లక్ష్యంతోనే నిండు ప్రాణాలు బలి

- ఎమ్మార్పీఎస్ నేతల ఆరోపణ



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కనిగిరి, మే 21: ఆర్టీసీ యాజమాన్య నిర్లక్ష్యవైఖరితోనే రెండు నిండు ప్రాణాలు బలిగొందని ఎమ్మార్పీఎస్ నాయకుడు రావినూతల కోటయ్య, తదితరులు ఆరోపించారు. ఈనెల 19న కనిగిరి ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు చెన్నై వెళ్తూ మార్గమధ్యంలో నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెం వద్ద ప్రమాదానికి గురైన సంఘటన విదితమే. ఈ ప్రమాదంలో నియోజకవర్గంలోని వెలిగండ్ల మండలానికి చెందిన ఇద్దరు మృతిచెందారు. ఈప్రమాదానికి పూర్తిగా యాజమాన్యమే నిర్లక్ష్యమేనంటూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్‌ను కలసి వినతిపత్రం అందజేశారు. అనంతరం డిపో ఆవరణలో ఆయన విలేకరులతో మాట్లాడారు. బస్సు ప్రమాదంలో చనిపోయిన కుటుంబాలకు ప్ర మాద పరిహారంతో పాటు, ఆర్థిక సహాయం యాజమాన్యం చాలని డిమాండ్ చేశారు. మరో ఇద్దరు ప్రాణాపాయ స్థితిలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని, వారికి వైద్యసహాయంతో పా టు ఆర్థిక సహకారం అందించాలని కోరారు. సుదూర ప్రాంతాలకు చెందిన బస్సులకు కూడా ఒకే డ్రైవర్‌ను డ్యూటీ వే యటం సరికాదన్నారు. ముందురోజు చెన్నై వెళ్లిన బస్సు మధ్యాహ్నం కనిగిరికి వచ్చిందన్నారు. తిరిగి అదే బస్సులో రాత్రి కనిగిరి నుంచి చెన్నైకు వెళ్ళేందుకు కూడా అదే డ్రైవర్‌ను డ్యూటీ వేసినట్టు చెప్పారు. దీంతో డ్రైవర్ అలసిపోవడంతో ప్రమాదం జరిగిందని, దీనికి పూర్తి బాధ్యత డిపో మేనేజర్ వహించాలన్నారు. ప్రమాదంలో చనిపోయిన కుటుంబాలకు చెందిన వారిలో చదువుకున్న వారికి ఆర్టీసీలో ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేదంటే ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో డిపో మేనేజర్ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా బాధిత కుటుంబాలకు న్యాయం జరిగే వరకూ ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు జేపీ రాజు, జుటికే దానియేలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే చర్యలు

పామూరు, మే, 21: ప్రభుత్వ స్థలాలను ఆక్రమి స్తే కఠిన చర్యలు తీసుకొంటామని తహసీల్దార్ షాకిర్‌పాష హెచ్చరించారు. మండలంలోని పడమటకట్టకిందపల్లి పంచాయతి కందులవారిపల్లి గ్రామం 368 సర్వేనెంబర్‌లోని గ్రామకంఠం స్థలాన్ని గ్రామ వలింటర్ గురుస్వామి ఆక్రమించారు. స్థలం చుట్టూ తడికలతో కంచె ఏర్పాటుచేశారు. వలంటర్ గ్రామకంఠం స్థలాన్ని ఆక్రమించి, గతంలో రెవెన్యూ సిబ్బంది ఏర్పాటు చేసిన బోర్డులను సైతం తొలగించి ఆక్రమించారని పత్రికల్లో కథనాలు వచ్చాయి. దీనిపై స్పందించిన తహసీల్దార్ ఆక్రమణలు తొలగించి స్థలం చుట్టూ ఫెన్సింగ్ వేయాలని ఆదేశించారు. ఈ మేరకు వీఆర్వో షేక్ ఖాజారఫి స్థలాన్ని పరిశీలించి స్థలం చుట్టూ ఉన్న కంచెను తొలగించారు. త్వరలో ఫెన్సింగ్ వేయిస్తామని తెలిపారు.

రక్తదానం చేసిన యువకుడు

కనిగిరి, మే 21: ప్రసవం సమయంలో ఓ మహిళకు రక్తం అవసరమై ప్రాణాపాయస్థితిలో ఉండగా విషయం తెలుసుకున్న యువకుడు మోజెస్ మంగళవారం తన రక్తాన్ని దానం చేసి కాపాడాడు. కనిగిరి సాయికృష్ణ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో పూజిత అనే గర్భిణికి ఏబీ పాజిటివ్ రక్తం అత్యవసరమైంది. కాన్పు కష్టమై తీవ్ర రక్తస్రావమై ప్రాణాపాయ స్థితిలోకి వెళ్ళింది. దీంతో ఆసుపత్రి సిబ్బంది కుటుంబసభ్యులకు స్నేహహస్తం వారిని సంప్రదించాలని సూచించటంతో ఆ సంస్థ వలంటీర్ మోజెస్ రక్తదానం చేశారు. గర్భిణికి ప్రసవం జరిగి ప్రాణాపాయ స్థితి నుంచి బయటపడటంతో కుటుంబసభ్యులు మోజెస్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

పార్టీల ప్రతినిధులు

సంయమనం పాటించాలి : ఏఎస్పీ

చీరాలటౌన్, మే 21 : ఓట్ల లెక్కింపు ముందు, అనంతరం అన్ని పార్టీల ప్రతినిధులు సంయమనం పాటించి శాంతి వాతావరణం ఉండేలా సహకరించాలని ఏఎస్పీ విఠలేశ్వర్ విజ్ఞప్తి చేశారు. ఎస్పీ ఆదేశాల మేరకు మంగళవారం చీరాల వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో సమావేశంలో నిర్వహించారు. ఈసందర్భంగా ఏ ఎస్పీ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా హింసాత్మక ప్రాంతాలను గుర్తించామని, ప్రత్యేక నిఘా, పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అలాగే పలు ఘటనలకు సంబంధించి అనేక మందిపై కేసులు నమోదు చేసినట్లు వివరించారు. కౌంటింగ్ అనంతరం విజయోత్సవాలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. ఇందుకు భిన్నంగా వ్యవహరిస్తే కఠినమైన కేసులతో పాటు జిల్లా బహిష్కరణ ఉంటుందని హెచ్చరించారు. సమావేశంలో వన్‌టౌన్ సీఐ శేషగిరిరావు, టూటౌన్ సీఐ సోమశేఖర్, ఎస్ఐ వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ధైర్యంగా ఉండండి.. అండగా ఉంటా!



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

దర్శి, మే 21 : మండలంలోని తూర్పువెంకటాపురంలో ఇటీవల మృతి చెందిన టీడీపీ కార్యకర్త జంపాల గురుబాబు కుటుంబాన్ని దర్శి అసెంబ్లీ టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి మంగళవారం పరామర్శించారు. గురుబాబు అనారోగ్యంతో మృతి చెందాడు. మృతునికి భార్య శ్రావణి, ఏడు నెలల పాప ఉన్నారు. విషయం తెలుసుకున్న లక్ష్మి వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని, అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో స్థానిక టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రైవేటు లెక్చరర్ ఇంట్లో సిలిండర్ చోరీ

సోషల్ మీడియాలో దొంగతనం వీడియో

సమాచారం ఇచ్చినా పట్టించుకోని మహిళా పోలీసు

మార్కాపురం, మే 21: సచివాలయం పరిధిలో జరిగే చిన్నపాటి ఘటనలను కూడా పోలీసుస్టేషన్‌కు తెలియజేయాల్సిన బాధ్యత మహిళా పోలీసులపై ఉంది. కేవలం మహిళలకు సంబంధించిన విషయాలే కాకుండా దొంగతనాలు, అల్లర్లు, సంఘ వ్యతిరేక కార్యకలాపాలను గమనించి పోలీసు అధికారులకు చేరవేయాల్సి ఉంది. కానీ మార్కాపురం పట్టణంలోని ఓ సచివాలయంలో పనిచేసే మహిళా కానిస్టేబుల్ మాత్రం తమకు ఇవేమి పట్టదన్నట్లు వ్యవహరించింది. చివరికి విషయం సోషల్ మీడియాలో హల్‌చల్ కావడంతో పోలీసు అధికారులకు తెలిపింది. వివరాల్లోకి వెళితే.., స్థానిక భగత్‌సింగ్‌కాలనీలో ఓ ప్రైవేటు లెక్చరర్ రామకృష్ణ గృహంలో మంగళవారం సిలిండర్ దొంగతనం జరిగింది. మధ్యాహ్నం సమయంలో ఇంట్లోకి ప్రవేశించిన దొంగ కొద్దిసేపు వరండాలో తిరిగాడు. ఇంటి లోపల తాళం వేసుకొని మనుషులు ఉన్నట్లు గమనించాడు. ఈ క్రమంలో వరండాలో ఉన్న సిలిండర్‌ను బుజాన వేసుకుని ఎంచక్కా వెళ్లిపోయాడు. కొద్దిసేపటి తర్వాత బయటకు వచ్చిన రామకృష్ణ భార్య సిలిండర్ పోయినట్లు గమనించింది. ఇంట్లో వున్న సీసీకెమెరాలో పరిశీలించి చూసి చోరీ జరిగినట్లు నిర్ధారించుకున్నారు. విషయాన్ని సమీపంలోనే వున్న సచివాలయ మహిళా పోలీసుకు తెలపాలని వెళ్లారు. అప్పటికి మహిళా పోలీసు జయకమల అందుబాటులో లేకపోవడంతో ఫోన్‌లోనే చోరీ విషయాన్ని తెలిపారు. తనకు సంబంధంలేదని, పోలీసు స్టేషన్‌కు వెళ్లి రాతపూర్వకంగా ఫిర్యాదు చేయాలని తెలిపి ఫోన్ పెట్టేసింది. చోరీ వీడియోను పలువురు సోషల్ మీడియాలో పెట్టారు. దీంతో మహిళా పోలీసు పట్టణ ఎస్సైకి విషయం తెలియజేసింది. సాయంత్రం బాధితులు కూడా వెళ్లి పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మహిళా పోలీసుకు సమాచారం ఇచ్చినా పోలీసు స్టేషన్‌లో తప్పకుండా ఫిర్యాదు చేయాల్సిందేనని ఎస్సై అబ్దుల్ రెహమాన్ తెలిపారు. దొంగను కూడా గుర్తించినట్లు తెలిసింది.

ఎడ్లబలప్రదర్శన పోటీలు

గిద్దలూరు, మే 21 : రాచర్ల మండలం చోళ్లవీడులోని శ్రీవేమయ్యస్వామి ఆరాధన మహోత్సవం సందర్భంగా జూన్ 1న ఎడ్ల బలప్రదర్శన పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ప్రథమ బహుమతిగా రూ.40వేలు, రెండవ బహుమతిగా రూ.30వేలు, మూడవ బహుమతిగా 20వేలు, నాల్గవ బహుమతిగా రూ.15వేలు, ఐదవ బహుమతిగా రూ.10వేలు, ఆరవ బహుమతిగా రూ.8వేలు, ఏడవ బహుమతిగా రూ.5వేలు, ఎనిదవ బహుమతిగా రూ.4వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. పోటీలో పాల్గొనే వారు 9912995159 సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు.

మారణాయుధాలు కలిగి ఉంటే కఠిన చర్యలు : సీఐ

కంభం, మే 21 : జూన్ 4న జరిగే ఎన్నికల కౌంటింగ్ అనంతరం ఇరు పార్టీల నాయకులుగాని, కార్యకర్తలు గాని ర్యాలీలు చేయడం, బాణసంచా కాల్చడం చేయవద్దని సీఐ రామకోటయ్య హెచ్చరించారు. మంగళవారం కంభం సీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వేటకొడవళ్లు లాంటి మారణాయుధాలను కలిగి ఉండడం నేరమని, తాము ఇప్పటికే కార్డన్‌సెర్చ్‌లో పలుగృహాల్లో సోదాలు చేసి ఎటువంటి పత్రాలు లేని పలు ద్విచక్ర వాహనాలను, కత్తులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పెట్రోల్ బంకుల లో లూజుగా బాటిళ్లలో పెట్రోల్ పట్టవద్దని కంభం, బేస్తవారపేట, అర్ధవీడు మండలాల్లోని 11 పెట్రోల్ బంకుల యజమానులను హెచ్చరించామన్నారు. సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు పెడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో పలువురు ఎస్ఐలు పాల్గొన్నారు.

నూతన వంతెనల నిర్మాణం ఎన్నడో..!

- గుండ్లకమ్మ పొంగితే రాకపోకలు బంద్
- ప్రాణాలు పోతున్నా పట్టని పాలకులు
- ఎన్నికల హామీలు గాలికొదిలేసిన వైనం



పెద్దనాగులవరం సమీపంలోని ఈ వంతెన వద్దే పదుల సంఖ్యలో ప్రాణాలు కోల్పోయింది

మార్కాపురం, మే 21: మార్కాపురం పట్టణ, మండల ప్రజలకు ఆ రెండు వంతెనలు ఎంతో కీలకమైనవి. నిత్యం వందలాది వాహనాలు, వేలాదిమంది రాకపోకలు సాగిస్తుంటారు. కానీ గుండ్లకమ్మ నదిలో ప్రవాహం పెరిగిందంటే ఇక మార్కాపురానికి రాకపోకలు నిలిచిపోవాల్సిందే. ఎవరైనా సాహసం చేసి దాటాలని చూస్తే ప్రాణాలు పోగొట్టుకోవాల్సిందే. దశాబ్దకాలంలో పదుల సంఖ్యలో ప్రజలు నదిని దాటుతూ ప్రాణాలు విడిచారు. ప్రతి ఎన్నికల సమయంలో ప్రజలు వంతెన నిర్మాణానికి ప్రాధాన్యతను నేతలకు వివరించడం, అవసరం తీరిపోగానే పాలకులు వాటి గురించి పట్టించుకోకపోవడం పరిపాటిగా మారింది. మండలంలోని బొడిచెర్ల, పెద్దనాగులవరం గ్రామాల సమీపంలో గుండ్లకమ్మ నదిపై ఉన్న చిన్నపాటి రెండు వంతెనలను ఎత్తుపెంచి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చేయాలని ప్రజలు కోరుతున్నా అది అరణ్య రోదనగానే మిగిలింది.

ఒక పర్యాయం కూలిన మరమ్మతులతో సరి

మార్కాపురం నుంచి తర్లుపాడు మీదుగా కంభం వెళ్లే ప్రధాన రహదారిలో బొడిచెర్ల గ్రామం వద్ద గుండ్లకమ్మ నదిపై చిన్నపాటి లోలెవల్ వంతెన ఉంది. వర్షాకాలం వచ్చిందంటే ఆ వంతెన పైనుంచి గుండ్లకమ్మ నీరు ప్రవహిస్తుంది. దీంతో ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని రాకపోకలు సాగిస్తుంటారు. గతంలో పలు ప్రమాదాలు కూడా ఇక్కడ చోటుచేసుకున్నాయి. వరదల సమయంలో అయితే వాహనాలు కొట్టుకుపోయిన ఘటనలు కూడా ఉన్నాయి. ఎప్పుడో 30 సంవత్సరాల నాటి నిర్మాణం కావడంతో గత సంవత్సరం వంతెనలోని ఒకవైపు కూలిపోయింది. దీంతో సుమారు నెల రోజులపాటు పెద్ద వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. అప్పట్లో ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి వచ్చి పరిస్థితి తీవ్రతను గమనించారు. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించి హైలెవల్ వంతెన నిర్మిస్తామని ప్రజలు హామీ ఇచ్చారు. కానీ ఇప్పటికీ నూతన వంతెన నిర్మాణం కార్యరూపం దాల్చలేదు. వర్షాకాలంలో ప్రజలు బిక్కు బిక్కుమంటూనే ఆ వంతెన దాటాల్సి వస్తోంది.

ప్రాణాలు పోతున్నా పట్టేదెవరికి

పట్టణానికి ఆనుకుని నికరంపల్లి, పెద్దనాగులవరం గ్రామాలు ఉన్నాయి. వీటి మధ్యలో గుండ్లకమ్మ మాత్రమే అడ్డు. ఆ గ్రామాలకు చెందిన వారిలో 80 శాతం మంది నిర్మాణ పనులు చేసుకునే కూలీలే. ఆయా గ్రామాల నుంచి ఉదయాన్నే మార్కాపురం వస్తేనే వారు పొట్టపోసుకునేది. ఒక్కరోజు పనిలేకపోయినా పస్తులుండాల్సిందే. కానీ వర్షాకాలం వచ్చిందంటే ఆ గ్రామస్థులు మార్కాపురం పట్టణానికి చేరుకోవడానికి నానా అవస్థలు పడాల్సిందే. అటు గుండ్లకమ్మ నది దాటలేక ఇటు ఉపాధిలేక తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ క్రమంలో పదేళ్ల కాలంలో సుమారు 13 మంది వంతెన పైనుంచి నది దాటుతూ ప్రాణాలు పోగొట్టుకున్నారు. హైలెవల్ వంతెన నిర్మించి తమ ప్రాణాలు కాపాడాలని నికరంపల్లి, పెద్దనాగులవరం గ్రామస్థులు ఎన్నిసార్లు నాయకులకు మొరపెట్టుకున్నా పట్టించుకున్న నాథుడే లేడు. 2022 ఆగస్టులో ఇద్దరు యువకులు గుండ్లకమ్మ దాటుతూ ప్రాణాలు కోల్పోయారు. ఎవరూ పట్టించుకోకపోవడంతో టీడీపీ, జనసేన నేతలు పెద్దఎత్తున అక్కడ గ్రామస్థులతో కలిసి ఉద్యమించడంతో మృతులకు ఏదో పరిహారం ఇప్పించి మమ అనిపించారు. కీలకమైన నూతన బ్రిడ్జీ నిర్మాణం పాలకులు, అధికారగణానికి పట్టకుండాపోయింది.



గత సంవత్సరం కూలిన బొడిచెర్ల సమీపంలోని వంతెన

మారణాయుధాలు కలిగి ఉంటే కఠిన చర్యలు

- కంభం సీఐ రామకోటయ్య



మాట్లాడుతున్న సీఐ రామకోటయ్య

కంభం, మే 21 : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జూన్ 4న జరిగే ఎన్నికల కౌంటింగ్ అనంతరం ఇరు పార్టీల నాయకులు గాని, కార్యకర్తలు గాని ర్యాలీలు చేయడం, బాణసంచా కాల్చడం చేయవద్దని కంభం సీఐ రామకోటయ్య హెచ్చరించారు. మంగళవారం కంభం సీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వేట కొడవళ్లు లాంటి మారణాయుధాలను కలిగి ఉండడం నేరమని, తాము ఇప్పటికే కార్డన్‌సెర్చ్‌లో పలుగృహాల్లో సోదాలు చేసి ఎటువంటి పత్రాలు లేని పలు ద్విచక్ర వాహనాలను, కత్తులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పెట్రోల్ బంకులలో లూజుగా బాటిళ్లలో పెట్రోల్ పట్టవద్దని కంభం, బేస్తవారపేట, అర్ధవీడు మండలాల్లోని 11 పెట్రోల్ బంకుల యజమానులను హెచ్చరించామన్నారు. సోషల్ మీడియాలో ఇరుపార్టీల వారు రెచ్చగొట్టే మాటలు మాట్లాడినా, వాట్సప్‌లలో పోస్టు లు పెట్టినా, అడ్మిన్ వారిపై కూడా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో సీఐతోపాటు కంభం ఎస్సై పులి రాజేష్, బేస్తవారపేట ఎస్సై నరసింహారావు పాల్గొన్నారు.

గిద్దలూరులో కార్డన్ సెర్చ్



వాహనాలు సీజ్ చేసిన పోలీసులు

గిద్దలూరు టౌన్, మే 21 : సరైన ధ్రువపత్రాలు లేని కారణంగా 10 ద్విచక్ర వాహనాలను పోలీసులు సీజ్ చేసి స్వాధీనం చేసుకున్నారు. గిద్దలూరు అర్బన్ సీఐ సోమయ్య ఆధ్వర్యంలో పట్టణంలోని జగనన్న కాలనీ, పూసల బజార్, నల్లబండ బజారు ప్రాంతాలలో వాహనాలను తనిఖీ చేశారు. సుమారు 10 ద్విచక్ర వాహనాలకు ఎలాంటి ధృవపత్రాలు లేని కారణంగా వాటిని సీజ్ చేసి స్వాధీనం చేసుకున్నట్లు సీఐ సోమయ్య తెలిపారు.

మార్కాపురం, మే 21: పట్టణంలోని పూలసుబ్బయ్య, ఇందిరమ్మ కాలనీల్లో మంగళవారం మార్కాపురం సీఐ ఆవుల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా అనుమానస్పద గృహాలను సందర్శించారు. అంతేకాక ప్రతి వాహనానికి సంబంధించిన పత్రాలను పరిశీలించారు. పత్రాలు సరిగాలేని 12 వాహనాలను సీజ్ చేసి ఎంవీఐ కార్యాలయానికి అప్పగించినట్లు సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ తనిఖీల్లో పట్టణ, గ్రామీణ ఎస్సైలు అబ్దుల్ రెహమాన్, వెంకటేశ్వర్లు నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రైవేటు లెక్చరర్ ఇంట్లో సిలిండర్ చోరీ

- సోషల్ మీడియాలో దొంగతనం వీడియో
- సమాచారం ఇచ్చినా పట్టించుకోని మహిళా పోలీసు

మార్కాపురం, మే 21: సచివాలయం పరిధిలో జరిగే చిన్నపాటి ఘటనలను కూడా పోలీసు స్టేషన్‌కు తెలియజేయాల్సిన బాధ్యత మహిళా పోలీసులపై ఉంది. కేవలం మహిళలకు సంబంధించిన విషయాలే కాకుండా దొంగతనాలు, అల్లర్లు, సంఘ వ్యతిరేక కార్యకలాపాలను గమనించి పోలీసు అధికారులకు చేరవేయాల్సి ఉంది. కానీ పట్టణంలోని ఓ సచివాలయంలో పనిచేసే మహిళా కానిస్టేబుల్ మాత్రం తమకు ఇవేమి పట్టదన్నట్లు వ్యవహరించింది. చివరికి విషయం సోషల్ మీడియాలో హల్‌చల్ కావడంతో పోలీసు అధికారులకు విషయం తెలిసింది. వివరాల్లోకి వెళితే.., స్థానిక భగత్‌సింగ్ కాలనీలో ఓ ప్రైవేటు లెక్చరర్ రామకృష్ణ గృహంలో మంగళవారం సిలిండర్ దొంగతనం జరిగింది. మధ్యాహ్నం సమయంలో ఇంట్లోకి ప్రవేశించిన దొంగ కొద్దిసేపు వరండాలో తిరిగాడు. ఇంటి లోపల తాళం వేసుకొని మనుషులు ఉన్నట్లు గమనించాడు. ఈ క్రమంలో వరండాలో ఉన్న సిలిండర్‌ను బుజాన వేసుకుని ఎంచక్కా వెళ్లిపోయాడు. కొద్దిసేపటి తర్వాత బయటకు వచ్చిన గృహ యజమాని రామకృష్ణ భార్య సిలిండర్ పోయినట్లు గమనించింది. ఇంట్లో వున్న సీసీ కెమెరాలో పరిశీలించి చూసి చోరీ జరిగినట్లు నిర్ధారించుకున్నారు. విషయాన్ని సమీపంలోనే వున్న సచివాలయ మహిళా పోలీసుకు తెలపాలని వెళ్లారు. అప్పటికి మహిళా పోలీసు జయకమల అందుబాటులో లేకపోవడంతో ఫోన్‌లోనే చోరీ విషయాన్ని తెలిపారు. తనకు సంబంధంలేదని పోలీసు స్టేషన్‌కు వెళ్లి రాతపూర్వకంగా ఫిర్యాదు చేయాలని తెలిపి ఫోన్ పెట్టేసింది. చోరీ వీడియోను పలువురు సోషల్ మీడియాలో పెట్టారు. దీంతో మహిళా పోలీసు పట్టణ ఎస్సైకి విషయం తెలియజేసింది. సాయంత్రం బాధితులు కూడా వెళ్లి పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మహిళా పోలీసుకు సమాచారం ఇచ్చినా పోలీసు స్టేషన్‌లో తప్పకుండా ఫిర్యాదు చేయాల్సిందేనని ఎస్సై అబ్దుల్ రెహమాన్ తెలిపారు. దొంగను కూడా గుర్తించినట్లు తెలిసింది.

ట్రాక్టర్ వరి గడ్డి రూ.20 వేలు



ప్లాస్టిక్ వ్యర్థాలను తింటున్న పశువులు

తర్లుపాడు, మే 21: మండలంలో తీవ్రకరువు పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో పశుగ్రాసం కొరత ఏర్పడింది. దీంతో గ్రాసం కోసం పశువులు అలమటి స్తున్నాయి. పొలాల్లో గ్రాసం దొరక్క గ్రామం శివారులలో పడేసిన చెత్తా, ప్లాస్టిక్ కవ ర్లను తింటున్నాయి. ట్రాక్టర్ వరిగడ్డి సుమారు రూ.15 నుంచి రూ.20 వరకు విక్రయిస్తున్నారు. కొందరు పశువులను కాపాడుకొనేందుకు దూరప్రాంతాల నుంచి గ్రాసం కొనుగోలు చేసి పశువులను పోషించుకుంటున్నారు. పశువులను పోషించలేని రైతన్నలు అతి తక్కువ ధరలకు పశువులను అమ్ముకుంటున్నారు. గ్రామాల్లో కూడా మంచినీటి ఎద్దడి నెలకొనటంతో పశువులకు కూడా నీటికి అలమటిస్తున్నాయి. ఏ చెరువులు, కుంటల్లో కూడా చుక్క నీరు లేదు. దీంతో పశువులకు నీరు తెచ్చుకునేందుకు కూడా అవస్థలకు గురవుతున్నారు. ఈనెల 15వరకు వివిధ రాజకీయ పార్టీల నాయకులు గ్రామాల్లో పోటీలు పడి ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేశారు. ప్రస్తుతం ఎన్నికలు అయిపోయేసరికి రాజకీయ నాయకులు ట్యాంకర్లను నిలిపివేయటంతో నానా అవస్థలకు గురవుతున్నారు. ప్రభుత్వం సబ్సిడీ ద్వారా పశుగ్రాసం, దానం అందించి రైతులను ఆదుకోవాలని పశుపోషకులు కోరుతున్నారు.

వైభవంగా నరసింహ స్వామి జయంతి

మార్కాపురం రూరల్, మే 21: మండల పరిధిలోని కొండేపల్లి రోడ్డులోని కొండపై వెలసిన శ్రీ కలివిగిరి నరసింహస్వామి జయంతి వేడుకలు మంగళవారం ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు వైభవంగా నిర్వహించారు. స్వామివారి మూల విరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించి, తీర్థ బిందె, ధ్వజారోహణం, పంచామృతం సహస్రనామార్చన కార్యక్రమాలు నిర్వహించారు. స్వామివారి ఉత్సవ మూర్తులకు పంచామృత స్నపన, తిరుమంజన కార్యక్రమాలు భక్తుల మధ్య నిర్వహించారు. సాయంత్రం స్వామివారి కల్యాణం, భజన నిర్వహించారు. తోకపల్లె కోలాట బృందం వారితో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. జయంతి కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకొన్నారు. స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. స్వామి కార్యక్రమాలలో మున్సిపల్ ఛైర్మన్ బాలమురళీకృష్ణ, అధ్యక్షులు బొగ్గరపు శేషయ్య, ఉభయ దాతలు మాల కొండయ్య, రాధాకృష్ణమూర్తి దంపతులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మార్కాపురం వన్‌టౌన్ : పట్టణంలోని 9వ వార్డులో వెలసిన శ్రీ రమాసహిత సత్యనారాయణ స్వామి కల్యాణ మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా ప్రధాన అర్చకులు రెంటచింతల గౌరిశంకరశర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. గరుడవాహనంపై సత్యదేవునికి ప్రత్యేక పుష్పమాలలతో అలంకరించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు బాసాని సుధాకర్, కార్యదర్శి పొత్తంశెట్టి చిన్నసుబ్బారావు, సహాయ కార్యదర్శులు నూనె రామిరెడ్డి, కాసాని ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో కార్యక్రమాలు పర్యవేక్షించారు.



నరసింహస్వామికి విశేష పూజలు చేస్తున్న అర్చకులు, గరుడవాహనంపై సత్యనారాయణుడు

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

ఎర్రగొండపాలెం : ఈ నెల 22వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ఎర్రగొండపాలెం సమీపంలో వెలసిన శ్రీ రుక్మిణి, సత్యభామసమేత వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 22వ తేదీ సాయంత్రం 6 గంటలకు ధ్వజారోహణం, అంకురార్పణం పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 23న ఉదయం సూర్యవాహనం, రాత్రి సింహవాహనం, 24న ఉదయం చంద్రవాహనం, రాత్రిశేషవాహనం, 25న రాత్రి హనుమంతవాహనం, 26వతేదీ రాత్రి గరుడ వాహనం, 27 వ తేదీ రాత్రి గజవాహనం, 28న రాత్రి రథోత్సవం, 29న రాత్రి అశ్వవాహనం, 30న పూర్ణాహుతి, చక్రస్నానం, రాత్రి హంసవాహనం, వసంతోత్సవం నిర్వహించనున్నట్లు ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి తెలిపారు. భక్తులు అందరు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించాలన్నారు.

కౌంటింగ్ అనంతరం అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు

- మార్కాపురం డీఎస్పీ బాలసుందరరావు

మార్కాపురం, మే 21: వచ్చే నెల 4న జరిగే సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ అనంతరం మార్కాపురం పోలీసు సబ్‌డివిజన్ పరిధిలో అల్లర్లు జరిగితే రౌడీషీట్ తెరుస్తామని డీఎస్పీ ఎం.బాల సుందరరావు అన్నారు. స్థానిక ఎస్‌డీపీవో కార్యాలయంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా ఎస్పీ గరుడ్ సుమిత్ ఆదేశాల మేరకు సబ్ డివిజన్ పరిధిలో ప్రత్యేక కార్యాచరణతో కౌటింగ్ అనంతరం ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగ కుండా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ముఖ్యంగా మండలంలోని ప్రతి గ్రామానికి వెళ్లి గొడవలకు పాల్పడితే ఎలాంటి చర్యలు ఉంటాయో ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. సమస్యాత్మక గ్రామాల్లో రాత్రిళ్లు పల్లెనిద్ర కార్యక్రమం కూడా ఉంటుందన్నారు. పోలింగ్ రోజు ఘర్షణలు జరిగిన గ్రామాలపై ప్రత్యేక దృష్టిసారించామన్నారు. పట్టణాలు, గ్రామాల్లో కార్డన్‌సెర్చ్ నిర్వహించి ఎలాంటి పత్రాలు లేని వాహనాలను సీజ్‌చేసి రవాణశాఖ అధికారులకు అప్పజెబుతున్నామన్నారు. పెట్రోల్ బంకుల్లో వాహనాలకు తప్ప లూజ్‌గా అమ్మకాలు చేయవద్దని నోటీసులు ఇచ్చామన్నారు. టపాసులు అమ్మే వ్యాపారులకు కూడా ఎలాంటి అమ్మకాలు చేపట్టరాదని ఆదేశాలు ఇచ్చామన్నారు. ఎవరైనా మారణాయుధాలు కలిగి ఉన్నట్లు తెలిస్తే ఆర్మ్స్ యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. రౌడీషీటర్లు, సంఘ వ్యతిరేక శక్తులపై నిఘా పెట్టామన్నారు. సోషల్ మీడియాపై కూడా ప్రత్యేక దృష్టిపెట్టినట్లు తెలిపారు. విద్వేషాలను రెచ్చగొట్టే విధంగా ఎలాంటి పోస్టింగ్‌లు పెట్టినా గ్రూప్ అడ్మిన్‌లపై కఠిన చర్యలు ఉంటాయన్నారు. సమావేశంలో సీఐ ఆవుల వెంకటేశ్వర్లు, పట్టణ ఎస్సై అబ్దుల్ రెహమాన్‌లు పాల్గొన్నారు.



విలేకర్లతో మాట్లాడుతున్న డీఎస్పీ బాలసుందరరావు

గిద్దలూరు టౌన్ : ఎన్నికల కౌంటింగ్ సమయంలో అల్లర్లు సృష్టిస్తే ఉపేక్షించేది లేదని గిద్దలూరు అర్బన్ సీఐ వి.సోమయ్య హెచ్చరించారు. మంగళవారం పోలీసుస్టేషన్ నందు విలేకరుల సమావేశం నిర్వహించారు. సీఐ సోమయ్య మాట్లాడుతూ ఇంటిలో ఎవరైన మారణాయుధాలు కలిగి ఉండడం చట్ట విరుద్ధమన్నారు. ఇప్పటికే పలు ప్రాంతాలలో కార్డన్ సెర్చ్‌లు నిర్వహించామన్నారు. సోషల్ మీడియా, వాట్సప్ గ్రూప్‌లపై నిరంతరం నిఘా ఉంచామని, రెచ్చగొట్టే విధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకోవడంతోపాటు గ్రూప్ అడ్మిన్‌పై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. బాటిళ్లలో పెట్రోల్ పట్టవద్దని షాపు యజమానులకు నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు. ఓట్ల లెక్కింపు సందర్భంగా విజయోత్సవాలు చేసుకోవడం నిషేధమని, నిబంధనలు ఉల్లంఘిస్తే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

సంక్షేమ పథకాలు పక్కాగా అమలు చేయాలి



మాట్లాడుతున్న లక్ష్మానాయక్

మార్కాపురం వన్‌టౌన్, మే 21: విద్యా దీవెన, వసతి దీవెన పథకాలు పక్కాగా అమలు చేయాలని సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ లక్ష్మానాయక్ అన్నారు. స్థానిక వేమన డిగ్రీ కళాశాలలో 2023-24 సంవత్సరానికి విద్యా వసతి దీవెనల పథకాలకు సంబంధించి మార్కాపురం సహాయ సాంఘిక సంక్షేమ అధికారి ఎస్.అరుణకుమారి ఆధ్వర్యంలో మార్కాపురం డివిజన్ పరిధిలోని వెల్ఫేర్, అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు, వార్డు ఎడ్యుకేషన్, డేటా ప్రాసెసింగ్ కార్యదర్శులు కళాశాల కోఆర్డినేటర్లకు పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా లక్ష్మానాయక్ మాట్లాడుతూ.. పథకాలకు సంబంధించి అర్హత కలిగిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనార్టీ విద్యార్థులకు ఈ పథకాల లబ్ధి చేకూర్చే విధంగా చూడాలన్నారు. జాయింట్ ఖాతాలకు సంబంధించి ఖాతాలను అప్డేట్ చేయాలన్నారు. గడిచిన త్రైమాసికం వరకు విడుదలైన నిధులను కళాశాలలకు చెల్లించని తల్లులకు ఫీజులు కళాశాలలకు చెల్లించే విధంగా కౌన్సిలింగ్ నిర్వహించి నవశకం లాగిన్‌లలో అప్డేట్ చేయాలన్నారు. వివిధ 8 అంశాలపై వివరించి నిర్ణీత సమయంలో అప్డేట్ చేయని అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో గిద్దలూరు, బేస్తవారిపేట సహాయ సాంఘిక సంక్షేమాధికారులు అమ్మాజి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా నరసింహుని జన్మదిన వేడుకలు

- పురాతన దేవాలయంలో ప్రత్యేక పూజలు



ఉగ్రనరసింహస్వామి మూలవిరాట్, పూజలు చేస్తున్న భక్తులు

కొమరోలు, మే 20: మండంలోని తాటిచర్ల మోటు కొండపైన స్వయంగా వెలసిన శ్రీలక్ష్మీ సమేత ఉగ్రనరసింహస్వామి జన్మదినం సందర్భంగా ఆ ఆలయంలో భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించినట్లు ఆలయ దర్మకర్త తాటిచర్ల కుమారస్వామి తెలిపారు. తాటిచర్లమోటు కొండపై పూరాతన లక్ష్మీనరశింహస్వామి దేవాలయాన్ని ఇటీవల పునఃప్రారంభం సందర్భంగా నూతన విగ్రహాలను, ఆలయ ప్రాంగణాన్ని నిర్మిస్తున్నారు. స్వామి వారి జన్మ నక్షత్రం స్వాతి సందర్భంగా ఉదయం స్వామి వారికి పురుషసూక్తి, పంచామృత అభిషేకాలు, నూతన వస్త్ర అలంకరణ, నవగ్రహ, సుదర్శన హోమాలు దంపతులతో నిర్వహించారు. కార్యాక్రమాలకు చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరైనారు.

కంభం మార్కెట్‌యార్డు తలరాత మారేనా !

- అక్కరకు రాని రైతు బంధు పథకం
- ప్రయోజనాలు కోల్పోతున్న రైతులు
- సివిల్‌సప్లై సరుకుల నిల్వలకే పరిమితం

కంభం, మే 21 : రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతుబంధు పథకం అక్కరకు రావడం లేదు. దీనిపై అధికారులు అవగాహన కల్పించక పోవడం, గోదాములు ఉన్నా వినియోగించక పోవడంతో పథకం మూలకు చేరింది.

కంభం వ్యవసాయ మార్కెట్ పరిధిలో గోదాములలో రైతులు ఎవరూ పంటలను నిల్వ చేసుకోవడం లేదు. దీంతో ఈ పథకం ద్వారా పొందే ప్రయోజనాలను కోల్పోతున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం మార్కెట్ యార్డులపై దృష్టిసారించి నిరుపయోగంగా ఉన్న యార్డులను గుర్తించి రైతులకు ఉపయోగపడేలా చేస్తామని చెబుతోంది. అయితే ఇంతవరకు అమలు కాలేదు. ఎన్నికల అనంతరం అధికారంలోకి వచ్చే ప్రభుత్వమైనా గిద్దలూరు నియోజకవర్గ పరిధిలోని కంభం వ్యవసాయ మార్కెట్ యార్డు అభివృద్ధిపై దృష్టి సారించాలని రైతులు కోరుతున్నారు. మార్కెట్ యార్డు పరిధిలో కంభం, బేస్తవారపేట, అర్థవీడు మండలాలు ఉన్నాయి. మద్దతు ధర లభించని సమయంలో రైతులు పంటలను నిల్వ చేసుకొనేందుకు కంభంలో రూ.40 లక్షలతో రెండు గోదాములు నిర్మించారు. వీటిని వినియోగించుకుని మద్దతు ధర వచ్చాక పంటలను అమ్ముకోవచ్చు. కానీ ప్రభుత్వాలు, అధికారులు పట్టించుకోలేదు. ప్రస్తుతం సివిల్ సప్లై సరుకుల కోసం లీజ్‌కు తీసుకుని రేషన్ సరుకులు నిల్వ చేసుకుంటున్నారు.



కంభం వ్యవసాయ మార్కెట్ కార్యాలయం

ఇవి ఉపయోగాలు

గోదాములలో నిలువ ఉంచే పంట నిలువలో 75శాతం రైతుబంధు పథకం ద్వారా రుణంగా తీసుకోవచ్చు. అలాగే గరిష్ఠంగా రూ.50వేల వరకు రుణం పొందే అవకాశం ఉంది. మొదటి 3 నెలల కాలానికి వడ్డీ వర్తించదు. ఆ తరువాత ఏడాది కాలానికి 5వేలకు 5శాతం, 10వేలకు 6శాతం, 15వేలకు 8శాతం, 50వేల లోపు 10శాతం వడ్డీ చెల్లించాలి.



అలంకారప్రాయంగా ఉన్న గోదాములు

కోల్డ్ స్టోరేజీ లేక రైతులు ఇబ్బందులు

కంభం, గిద్దలూరు మండలాల్లో కోల్డ్‌స్టోరేజ్ ఏర్పాటుకు ప్రభుత్వానికి వినతిపత్రాలు అందజేశారు. ఈ ప్రాంతం తీవ్ర వర్షాభావ పరిస్థితుల వలన శనగ, మిరప, కంది, పెసర పంటలు పండించుకోవలసి వస్తోంది. వాటికి గిట్టుబాటు లేని సమయంలో పంటలను నిలువ చేసుకునేందుకు వీలుగా కోల్డ్ స్టోరేజ్‌లు ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

అవీ..ఇవీ..

నేటి నుంచి తిరునాళ్ల

గిద్దలూరు, మే 21 : పట్టణంలోని కొండపై వెలసిన శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థాన తిరునాళ్ల బ్రహ్మోత్సవాలు బుధవారం నుంచి మూడు రోజులపాటు జరుగనున్నాయి. 22న బుధవారం ధ్వజారోహణం, అగ్నిసేవ, అనంతరం శ్రీ అభయాంజనేయస్వామి దేవస్థానం నుంచి ఉత్సవ విగ్రహాలను కొండపైకి ఊరేగింపుగా తీసుకుని వెళ్లడం, రాత్రి కల్యాణ మహోత్సవం, 23న గరుడ ఉత్సవం, రాత్రికి భరతనాట్య ప్రదర్శన, 24న ధ్వజారోహణం, గరుడసేవ, గ్రామోత్సవం నిర్వహిస్తున్నట్లు కమిటీ ప్రతినిధులు తెలిపారు.

ఎడ్లబలప్రదర్శన పోటీలు

గిద్దలూరు, మే 21 : రాచర్ల మండలం చోళ్లవీడులోని శ్రీవేమయ్యస్వామి ఆరాధన మహోత్సవం సందర్భంగా జూన్ 1న ఎడ్ల బలప్రదర్శన పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ప్రథమ బహుమతిగా రూ.40వేలు, రెండవ బహుమతిగా రూ.30వేలు, మూడవ బహుమతిగా 20వేలు, నాల్గవ బహుమతిగా రూ.15వేలు, ఐదవ బహుమతిగా రూ.10వేలు, ఆరవ బహుమతిగా రూ.8వేలు, ఏడవ బహుమతిగా రూ.5వేలు, ఎనిదవ బహుమతిగా రూ.4వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. పోటీలో పాల్గొనే వారు 9912995159 సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు.

పుస్తక పఠనం అలవరుచుకోవాలి

పెద్దారవీడు, మే 21: విద్యార్థులు పుస్తకపఠనం అలవర్చుకోవాలని గ్రంథ పాలకుడు వై.వెంకటేశ్వరరెడ్డి అన్నారు. స్థానిక గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా మంగళవారం పుస్తక పఠనం, డ్రాయింగ్, క్యారమ్స్, డాన్స్ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పంటనష్టం వివరాల నమోదుకు ఆదేశం

పెద్దారవీడు, మే 21: రబీలో పంటలు సాగుచేసిన రైతులలో 33 శాతానికి పైగా నష్టం వాటిల్లిందని ఏవో బుజ్జిబాయ్ అన్నారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో ఆర్‌బీకే సిబ్బందితో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ గ్రామస్థాయిలో పనిచేసే వ్యవసాయ సిబ్బంది రబీలో ఈ-క్రాప్ చేసిన పంటలను 34 కాలమ్స్ ప్రొఫార్మాలో నమోదు చేసి ఈ నెల 24వ తేదీ లోపు అందజేయాలన్నారు. రైతుల నుంచి పట్టాదారుపాసు పుస్తకం, ఆధార్‌కార్డు, బ్యాంక్ పాసుపుస్తకాల జిరాక్స్‌లను తీసుకోవాలన్నారు. ఈ నెల 29న మండల సమాచారాన్ని జిల్లా వ్యవసాయాధికారి కార్యాలయానికి పంపిస్తామన్నారు.

ఉచిత శిక్షణను ఉపయోగించుకోవాలి



శిక్షణ ప్రారంభిస్తున్న వైద్యసంజీవ్

మార్కాపురం వన్ టౌన్, మే 21: వేసవిలో ఉచితంగా నిర్వహి స్తున్న శిక్షణ శిబిరాలు ఉపయోగించుకోవాలని డాక్టర్ వైద్యసంజీవ్ అన్నారు. స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో కోడి రామ్మూర్తి క్రీడా సాంస్కృతిక సేవా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బాక్సింగ్, కర్రసాము, నృత్య, నటశిక్షా శిబిరాలను మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా బాక్సింగ్ కోచ్ వేణు, ఫుట్‌బాల్ కోచ్ ఉప్పు రామకృష్ణ, బి.వెంకటేశ్వరరెడ్డి, కాళంగి లక్ష్మీ, పిన్నిక నాగేశ్వరరావు, కళంగి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

అరగంటపాటు వర్షం

- చల్లబడిన వాతావరణం
- పండ్లతోటలకు జీవం

ఎర్రగొండపాలెం, మే 21 : ఎర్రగొండపాలెం మండల కేంద్రంతో పాటు చుట్టూ ఉన్న గ్రామాల్లో మంగళవారం సాయంత్రం 5.30 గంటల నుంచి 6 గంటల సమయం వరకు అరగంటపాటు వర్షం కురిసింది. ఎండవేడిమి తో అల్లాడుతున్న మండల ప్రజలు ఊహించని విధంగా అరగంట సమయం వర్షం కురవడంతో వీధిరోడ్లపై ప్రవహిస్తున్న వర్షంనీరు చూసి పిల్లలు పెద్దలు ఉత్సాహంగా ఉన్నారు. మండలంలో సాగులో ఉన్న బొప్పాయి, అరటి, జామ, దానిమ్మ తోటలకు ఈ వర్షం జీవం పోసిందని పండ్లతోటల సాగు రైతులు ఊరట చెందారు. ఈ వారం రోజుల్లో మూడుసార్లు వర్షం కురవడంతో 15 రోజుల వరకు నీటి తడులు అవసరం లేదని వై.కొత్తపల్లి, గోళ్లవీడపి, గంజివారిపల్లె, వీరభద్రాపురం రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. నైరుతి రుతపవనాల కుంటే ముందే వర్షం కురుస్తుండడంతో ప్రజలు ఉత్సాహంగా ఉన్నారు.

ఆశాజనకంగా పొగాకు ధరలు

పొదిలి, మే 21 : ఈ ఏడాది పొగాకు ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. దీంతో అన్నదాతలు ఎంతో సంతోషంతో ఉన్నారు. ప్రారంభం నుంచి పొగాకు ధరలు ఎక్కడ తగ్గకుండా పెరుగుతూనే వచ్చాయని అన్నదాతలు చెబుతున్నారు. ఈక్రమంలో మంగళవారం కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.319 పలికింది. మొత్తం వేలం కేంద్రానికి 651 బేళ్లు వచ్చాయని వేలం నిర్వహణాధికారి గిరిరాజ్‌కుమార్ తెలిపారు. అందులో 608 బేళ్ళను వ్యాపారులు కొనుగోలు చేశారు. మిగిలినవి తిరస్కరణకు గురయ్యాయి. బ్రైట్‌రకం పొగాకు క్రమంగా ధరలు పెరుగుతుండటంతో రైతులు ఆబేళ్లను వేలంలో ఉంచుతున్నారు. మొత్తం 20 కంపెనీల చెందిన వ్యాపారులు వేలంలో పాల్గొన్నారు. ఇప్పటికే 4 మిలియన్ కిలోల పొగాకు అమ్మకాలు పుర్తయ్యాయని, మీడియం గ్రేడ్ 260 ధర పలికినట్లు ఆయన తెలిపారు. సరాసరి కిలో పొగాకు ధర రూ.264 పలికిందన్నారు.

విద్యుత్ సరఫరాలో జాగ్రత్తలు తీసుకోవాలి

మార్కాపురం వన్‌టౌన్, మే 21: షిఫ్ట్ ఆపరేటర్లు విద్యుత్ సరఫరాలో జాగ్రత్తలు తీసుకోవాలని ఒంగోల్ ట్రాన్స్‌ఫార్మర్ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ కె.వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక విద్యుత్‌శాఖ కార్యాలయంలో మార్కాపురం సబ్‌డివిజన్ పరిధిలోని సబ్ స్టేషన్‌ల షిఫ్ట్ ఆపరేటర్లకు మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సబ్ స్టేషన్‌లలో పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు, వీసీబీలు ఆపరేట్ చేయడంలో, లైన్‌క్లియరెన్స్‌లు తీసుకునేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో ప్రొటెక్షన్ ఏఈ ఎల్.రఘుబాబు, ఏడీఏ గురువయ్య, ఐటీఏడీఈ పద్మావతి పాల్గొన్నారు.

అల్లర్లు సృష్టిస్తే రౌడీషీట్ తెరుస్తాం

త్రిపురాంతకం, మే 21: ఎన్నికల నేపథ్యంలో ఫలితాల అనంతరం మండలంలోని గ్రామాల్లో ఎక్కడైనా అల్లర్లు సృష్టిస్తే అటువంటివారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, రౌడీషీట్ ఓపెన్ చేస్తామని ఎస్సై వి.సాంబశివయ్య హెచ్చరించారు. ప్రతిరోజూ గ్రామాల్లో పోలీసుల నిఘా, పల్లెనిద్ర నిర్వహిస్తామన్నారు. ఎండ్లూరివారిపాలెం, మిట్టపాలెం, వెల్లంపల్లి, రామసముద్రం, అన్నసముద్రం తదితర గ్రామాల్లో పోలీసుల పహారా ఉంటుందన్నారు.



మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి లోకేశ్వరరావు

'నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాలి'

దర్శి, మే 21: ఎన్నికల కౌంటింగ్‌లో రాజకీయ పార్టీల ఏజెంట్లు నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాలని దర్శి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎంవీపీఎస్ లోకేశ్వరరావు సూచించారు. స్థానిక ఆర్వో కార్యాలయంలో మంగళవారం వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, అభ్యర్థులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈవీఎంలు, పోస్టల్ బ్యాలెట్‌లను పటిష్ట భద్రత, బందోబస్తు మధ్య స్ట్రాంగ్‌రూంలో భద్రపరచినట్లు చెప్పారు. కౌంటింగ్ ఏజెంట్లుగా పాల్గొనే వారు సంబంధిత డాక్యుమెంట్లు అందించాలన్నారు. కౌంటింగ్‌లో ఎవరైన అక్రమాలకు పాల్పడితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో దర్శి అసెంబ్లీ టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి భర్త డాక్టర్ లలిత్‌సాగర్, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ప్రతినిధులు, అభ్యర్థులు పాల్గొన్నారు.

గుంటిగంగలో లలితా సహస్రనామ పూజలు



పూజలందుకుంటున్న గంగమ్మ తల్లి

తాళ్లూరు, మే 21: పవిత్ర పుణ్యక్షేత్రమైన గుంటిగంగలో దేవదాయ, ధర్మాదాయశాఖ నూతనవరవడితో గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టింది. అందులోభాగంగా మంగళవారం అమ్మవారి ఆలయంలో లలితా సహస్రనామ పూజలు నిర్వహించారు. పలుగ్రామాలకు చెందిన 50 మంది ముత్తైదువులు 108 సార్లు లలితాసహస్రనామ పారాయణం, దేవిఖడ్గమాల పారాయణం వంటి పూజా కార్యక్రమంలు జరిపారు. ఇతరప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజా కార్యక్రమాలను తిలకించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కార్తీక్, ఆలయకమిటీ చైర్మన్ కొసనా గురుబ్రహ్మం, పూజారులు కామేశ్వరశర్మ, ప్రకాష్ పంతులు, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. గంగమ్మ తల్లి ఆలయం వద్ద గురువారం మహాచండీహోమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని ఆలయకమిటీ నిర్వాహకులు కోరారు.

భక్తిశ్రద్ధలతో సీతారాముల కల్యాణం



స్వామివార్ల కల్యాణంలో పాల్గొన్న భక్తులు

పామూరు, మే 21: మండలంలోని రేణిమడుగు గ్రామంలో మంగళవారం శ్రీకోదండరామస్వామి దేవస్థాన తిరునాళ్ల వైభవంగా జరిగింది. దేవస్థాన అర్చకులు వేమూరి వెంకన్నస్వామి ఆధ్వర్యంలో సీతారాముల స్వామివార్ల కల్యాణాన్ని నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీచేశారు. ఈసందర్భంగా భక్తులు దేవస్థానంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. స్వామివార్ల ఉత్సవ విగ్రహాలతో గ్రామోత్సవం నిర్వహించారు. బుధవారం వసంతోత్సవం, అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటుచేశారు. కార్యక్రమాల్లో గంగయ్యచౌదరి, బాలాజీరావు, నారాయణ, మల్లేశ్వరరావు, వెంకటేశ్వర్లు, కమ్మ బాలకృష్ణ, శ్రీను, వెంకట్రావు, మాల్యాద్రి, మాలకొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే చర్యలు

పామూరు, మే, 21: పామూరు మండలంలో ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకొంటామని తహసీల్దార్ షాకిర్‌పాష హెచ్చరించారు. మండలంలోని పడమటకట్టకిందపల్లి పంచాయతి కందులవారిపల్లి గ్రామం 368 సర్వేనెంబర్‌లోని గ్రామ కంఠం స్థలాన్ని గ్రామ వలింటర్ గురుస్వామి ఆక్రమించారు. స్థలం చుట్టూ తడికలతో కంచె ఏర్పాటుచేశారు. గ్రామ వలంటర్ గ్రామ కంఠం స్థలాన్ని ఆక్రమించి, గతంలో రెవెన్యూ సిబ్బంది ఏర్పాటు చేసిన బోర్డులను సైతం తొలగించి ఆక్రమించారని పత్రికల్లో కథనాలు వచ్చాయి. దీనిపై స్పందించిన తహసీల్దార్ ఆక్రమణలు తొలగించి స్థలం చుట్టూ ఫెన్సింగ్ వేయాలని ఆదేశించారు. ఆయన ఆదేశాల మేరకు వీఆర్వో షేక్ ఖాజా రఫి స్థలాన్ని పరిశీలించి స్థలం చుట్టూ ఉన్న తడికల కంచెను తొలగించారు. త్వరలో స్థలం చుట్టూ ఫెన్సింగ్ వేయించి బోర్డులు ఏర్పాటు చేయిస్తామని తెలిపారు.

రోడ్డుపై చప్టా ఎత్తు పెంచాలి

పామూరు, మే, 21 : మండలంలోని చిలంకూరు, పడమటకట్టకిందపల్లి గ్రామాల మధ్యన ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్డుపై వర్షపునీరు నిలబడుతుంది. రోడ్డు మధ్యలో ఉన్న చప్టా ఎత్తు రోడ్డు కన్నా తక్కువగా ఉండటంతో కొద్దిపాటి వర్షం కురిసిన నీళ్లు రోడ్డుపై నిలబడుతున్నాయి. గతంలో రోడ్డు నిర్మించేటప్పుడు కాంట్రాక్టర్ చప్టాకన్నా రోడ్డు ఎత్తుగా నిర్మించారు. దాంతో పాత చప్టా ఎత్తు తగ్గడంతో ఆర్టీసీ బస్సులు, స్కూల్ వ్యాన్‌లు ఆటోలు, దిచక్రవాహనాలు చప్టాపై వస్తున్నప్పుడు ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

కేజీబీవీలో బైపీసీ గ్రూపు

పీసీపల్లి, మే 21: స్థానిక కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో ఎబైపీసీ గ్రూపు ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపాల్ బి.సుజాత తెలిపారు. ఈ విద్యా సంవత్సరంలో కళాశాలలో చేరాలనుకునే విద్యార్థినులు ఈనెల 22 నుంచి 27వరకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. సంబంధిత దరఖాస్తులను కళాశాల ప్రిన్సిపాల్‌కు సమర్పించాలని ఆమె కోరారు. మరిన్ని వివరాల కోసం 77020 76045 నెంబరును సంప్రదించాలని ఆమె తెలిపారు.

పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్‌పీవో శోభన్‌బాబు

పీసీపల్లి, మే 21: గ్రామాల్లో పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని డీఎల్‌పీవో శోభన్‌బాబు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పంచాయతీ కార్యదర్శులు క్షేత్రస్థాయిలో పర్యటించి గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు గుర్తించాలన్నారు. ప్రధానంగా తాగునీటి సమస్యను పరిష్కరించడంతో పాటు పాడయిన వీధిలైట్లను తొలగించి కొత్తవి ఏర్పాటుచేయాలని ఆదేశించారు. ఇంటిపన్ను వసూళ్లను త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. గ్రీన్ అంబాసిడర్లకు వేతన బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో సుబ్బారావు, ఈఓఆర్డీ మల్లేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం చేసిన యువకుడు

కనిగిరి, మే 21: ప్రసవం సమయంలో ఓ మహిళకు రక్తం అవసరమై ప్రాణాపాయస్థితిలో ఉండగా విషయం తెలుసుకున్న యువకుడు మోజెస్ మంగళవారం తన రక్తాన్ని దానం చేసి కాపాడాడు. స్థానిక సాయికృష్ణ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో పూజిత అనే గర్భిణీకి ఏబీపాజిటివ్ రక్తం అత్యవసరమైంది. ప్రసవం సమయంలో కాన్పు కష్టమై తీవ్ర రక్తస్రావమై ప్రాణాపాయ స్థితిలోకి వెళ్ళింది. దీంతో ఆసుపత్రి సిబ్బంది గర్భిణీ కుటుంబ సభ్యులకు స్నేహహస్తం వారిని సంప్రదించాలని సూచించటంతో ఆసంస్థ వలంటీర్ మోజెస్ రక్తదానం చేశారు. గర్భిణీకి సుఖప్రసవం జరిగి ప్రాణాపాయ స్థితి నుంచి బయటపడటంతో కుటుంబసభ్యులు మోజెస్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

దొనకొండలో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ ఎప్పుడో..!

- ప్రజలకు తీరని రవాణా కష్టాలు
- రైల్వే జనరల్ మేనేజర్, బోర్డు చైర్‌పర్సన్‌కు ఎంపీ మాగుంట విన్నవించినా కానరాని స్పష్టత

దొనకొండ, మే 21: దొనకొండ రైల్వేస్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ సౌకర్యం లేక, ఉన్న రైళ్లను డబ్లింగ్ లైను పనుల కారణంగా అధికారులు తరచూ తాత్కాలికంగా రద్దు చేస్తున్నారు. దీంతో పండుగలకు, ఇతర వివిధ కారణాలతో పట్టణాల నుండి స్వగ్రామాలకు చేరుకునేందుకు ప్రజలు తీవ్ర ప్రయాణ కష్టాలు ఎదుర్కొంటున్నారు. దొనకొండ రైల్వేస్టేషన్లో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ సౌకర్యం ఉన్నట్లా, లేనట్లా.. ఉంటే ఎప్పుడు కల్పిస్తారో అర్థంకాని పరిస్థితి ఈ ప్రాంత ప్రజల్లో నెలకొంది. కరోనాకు ముందు దొనకొండ రైల్వేస్టేషన్‌లో అన్నీ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ సౌకర్యం ఉండేది. ఆతర్వాత రైళ్ల పునఃప్రారంభం నుంచి ఎక్స్‌ప్రెస్ రైళ్లకు దొనకొండలో హాల్టింగ్ సౌకర్యం ఎత్తేయటంతో ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

విశాఖపట్టణం, బెంగుళూరు, విజయవాడ తదితర ప్రాంతాల నుంచి రాకపోకలు జరుపుకునే వారు దొనకొండలో ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగకపోవటంతో ఇటు మార్కాపురం అటు వినుకొండ రైల్వే స్టేషన్లల్లో దిగి ఆటోలలో ప్రమాదకరమైన తప్పనిసరిగా ప్రయాణాలు కొనసాగిస్తున్నారు. దక్షణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ గజానన్‌మాల్యా సెప్టెంబరు 13,2021న దొనకొండ పర్యటనకు విచ్చేసిన సందర్భంగా ఈ విషయమై స్పష్టత వస్తుందని ప్రజలు ఎంతో ఆత్రుతగా ఎదురుచూశారు. రైల్వే జీఎం ఆరోజు ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారేగాని ఎటువంటి స్పష్టమైన హామీ ఇవ్వకపోవటం, సంవత్సరాలు గడిచినా ఎటువంటి స్పందన లేకపోవటంతో నాడు జీఎంకు వినతిపత్రాలు అందించిన పెద్దలు, ప్రజలు తీవ్ర నిరుత్సాహానికి గురయ్యారు. తదనంతరం ఈ విషయాన్ని స్థానికులు ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి దృష్టికి తీసుకెళ్లి దొనకొండలో ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్టింగ్ సౌకర్యం కల్పించేలా తగిన చర్యలు చేపట్టాలని విన్నవించారు. అందుకు స్పందించిన ఎంపీ మాగుంట దక్షణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్‌జైన్ దొనకొండ పర్యటన ఖరారు కావటంతో ఆరోజు ఎంపీ మాగుంట స్వయంగా దొనకొండ విచ్చేశారు. రైల్వే జీఎంను కలుసుకొని దొనకొండలోని రైల్వేపరమైన అనేక సమస్యలు ఆయన దృష్టికి తెచ్చి ప్రధానంగా దొనకొండలో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ సౌకర్యం కల్పించాలంటూ విజ్ఞప్తి చేసి వినతిపత్రం సహితం అందించారు. ఎంపీ మాగుంట రైల్వే జీఎంను కలిసి నెలలు గడిచినా నేటికీ ఎటువంటి స్పందనలేదు. తిరిగి ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి గత సెప్టెంబరు 20న ఢిల్లీలో రైల్వే బోర్డు చైర్‌పర్సన్ జయవర్మసిన్హాను కలిసి దొనకొండలో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ సౌకర్యం కల్పించాలంటూ వివరించి వినతిపత్రం అందజేశారు. దీంతో దొనకొండలో ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఖచ్చితంగా హాల్టింగ్ అవకాశం కల్పిస్తారంటూ ప్రజలు ఎంతో ఆశపడ్డారు. నెలలు గడుస్తున్నా దొనకొండలో ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగకుండా పరుగులు తీస్తుండటం, రైల్వే ఉన్నతాధికారుల నుంచి ఎటువంటి ఉత్తర్వులు రాకపోవటంతో దొనకొండలో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ సౌకర్యం ఉండదని తమకు రవాణా కష్టాలు తప్పవని ప్రజలు నిత్యం చర్చించుకుంటున్నారు.



దొనకొండ రైల్వేస్టేషన్

అమృత్‌భారత్ పథకానికి గత ఆగస్టు 6న దొనకొండ రైల్వే స్టేషన్‌ఎంపిక కావటంతో దాదాపు రూ.17 కోట్లతో అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయి. జరుగుతున్న పనులు చూసి పనులు పూర్తయిన తర్వాత ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ సౌకర్యం కల్పిస్తారేమోనని ప్రజలు చర్చించుకోవటం మొదలుపెట్టారు. దొనకొండ ప్రాంత ప్రజలకు రోడ్డు మార్గాన సహితం సరైన రవాణా సౌకర్యం లేక రైలు ప్రయాణమే దిక్కు కావటంతో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ సౌకర్యం ఎప్పుడు కల్పుతుందోనని ప్రజలు నిత్యం ఆశగా ఎదురుచూస్తున్నారు. బెంగుళూరు, విశాఖపట్టణం, విజయవాడ, తదితర పట్టణాల నుంచి రాకపోకలు జరుపుకునేందుకు వీలుగా దొనకొండ రైల్వేస్టేషన్‌లో కొండవీడు-అమరావతి, ధర్మవరం ఎక్స్‌ప్రెస్ రైళ్లకైనా దొనకొండలో హాల్టింగ్ సౌకర్యం కల్పించేలా పాలకులు చర్యలు చేపట్టి తమ రవాణా కష్టాలు తీర్చాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

ప్రశాంతంగా కౌంటింగ్ నిర్వహణకు సహకరించాలి

- విఘాతం కల్పించేందుకు ప్రయత్నిస్తే కఠిన చర్యలు
- ఎస్పీ సుమిత్‌సునీల్



మాట్లాతున్న ఎస్పీ గరుడ సుమిత్ సునీల్

దర్శి, మే 21: ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగేందుకు రాజకీయ పార్టీలు, ప్రజలు పూర్తి సహకారం అందించాలని ఎస్పీ గరుడ సుమిత్ సునీల్ కోరారు. స్థానిక పీజీఎన్ కల్యాణ మండపంలో మంగళవారం దర్శి నియోజకవర్గంలోని రాజకీయ పార్టీల ప్రతినిధులు, పెద్దలతో జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని అత్యధికంగా దర్శి నియోజకవర్గంలో 90.91 శాతం పోలింగ్ నమోదు కావటం అభినందనీయమన్నారు. పోలింగ్ సందర్భంగా దర్శి, బొట్లపాలెం, దేవవరం గ్రామాల్లో హింసాత్మక సంఘటనలు జరగటం బాధాకరమన్నారు. పార్టీలు, కుల, మతవర్గాలుగా విడిపోయి పంతాలు, పట్టింపులతో దాడులు చేసుకుంటే సహించేది లేదని హెచ్చరించారు. ఉద్దేశపూర్వకంగా సామాన్య ప్రజల హక్కులకు భంగం కల్గిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరైనా బాంబులు, ఇతర మారణాయుదాలు నిల్వ ఉంచినట్లు తెలిస్తే వెంటనే సమాచారం అందించాలని కోరారు. రాయలసీమతో పాటు పక్కన ఉన్న పల్నాడు జిల్లాలో జరిగిన హింసాత్మక సంఘటనలు దృష్టిలో ఉంచుకొని ఎన్నికల కమిషన్ కొత్త నిబంధనలు పెట్టినట్టు చెప్పారు. ఎవరి వద్దనైనా 9 ఇంచులకు మించిన కత్తి లాంటి మారణాయుధాలు కల్గి ఉండరాదన్నారు. పోలీసులు అన్నీ గ్రామాల్లో తనిఖీలు నిర్వహిస్తారని చెప్పారు. ఆ తనిఖీల్లో మారణాయుధాలు పట్టుబడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామ న్నారు. కొంతమంది వాట్సాప్‌లలో, ఫేస్‌బుక్‌లలో రెచ్చగొట్టే అభ్యంతకర పోస్టింగులు పెడుతున్నారని, వాటిని పరిశీలించి చర్యలు తీసుకుంటాం న్నారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా జరిగేందుకు అందరూ సహకరించాలని కోరారు. అనంతరం పోలీస్‌శాఖ, అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో సాహస విన్యాసాల కార్యక్రమం నిర్వహించారు. అధికారులు చేసిన సాహస విన్యాసాలు ప్రజలను అలరించాయి.

కార్యక్రమంలో దర్శి డీఎస్పీ అశోక్‌వర్ధన్‌రెడ్డి, సీఐ షేక్ షమీముల్లా, తదితరులు పాల్గొన్నారు.



పత్రాలు లేని వాహనాలను స్వాధీనం చేసుకున్న పోలీసులు

శాంతి భద్రతల పరిరక్షణకే కార్డన్ సెర్చ్

వెలిగండ్ల, మే 21: శాంతి భద్రతల పరిరక్షణకే కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు సీఐ రాంనాయక్ అన్నారు. మండలంలోని మరపగుంట్ల పంచాయతీలో మంగళవారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఉదయం 4 గంటల నుంచే పోలీసు బలగాలు గ్రామంలో మోహరించారు. ఇంటింటా సోదాలు నిర్వహించారు. దీంతో ప్రజలు ఉలిక్కిపడ్డారు. ద్విచక్రవాహన పత్రాలు, ఆధార్‌కార్డులను పరిశీలించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో సీఐ మాట్లాడుతూ ప్రజల సంక్షేమం, రక్షణ కోసమే పోలీసులు అహర్నిశలు కృషి చేస్తున్నారని అన్నారు. మండలంలో అసాంఘిక కార్యకలాపాలు సాగించే అవకాశం లేకుండా నిఘా ఏర్పాటుచేసి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

ఈ తనిఖీల్లో సరైన పత్రాలు లేని రెండు బైకులను స్వాధీనం చేసుకు న్నారు. కార్యక్రమంలో ఎస్ఐ ఎం.శివ, ప్రేమ్‌కుమార్, సైదాబాబు, అచ్చిరెడ్డి, సారె శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

ఆరంభశూరత్వంగా ఫిష్ ఆంధ్ర విక్రయశాల



మూతపడిన ఫిష్ ఆంధ్ర స్టాల్

పామూరు, మే 21: ఎంతో ఆర్భాటంగా ప్రారంభించిన ఫిష్ ఆంధ్ర చేపల విక్రయాల స్టాల్ కొద్ది రోజులకే మూతపడింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహంతో చేపలప్రియులకు నాణ్యమైన చేపలు విక్రయించాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన ఫిష్ ఆంధ్ర షాపును ప్రారంభించింది. చేపల సప్లయ్ సక్రమంగా జరగకపోవడంతో నిర్వాహకులు మూసివేయడంతో మూన్నాళ్ల ముచ్చటగానే మిగిలింది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో స్థానిక కొత్త చెరువు దగ్గర అన్నా క్యాంటీన్ కోసం పునాదులు వరకు నిర్మాణ పనులు చేపట్టారు. 2019లో అసెంబ్లీ ఎన్నికలు రావడం, వైసీపీ అధికారంలోకి వచ్చినతర్వాత అన్నా క్యాంటీన్‌లను మూసివేయడం తెలిసిందే. అన్నక్యాంటీన్ పునాదుల మీద చేపలు విక్రయాలు చేసేందుకు ప్రభుత్వం ప్రోత్సహంతో స్థానిక వైసీపీ నాయకులు ఫిష్ ఆంధ్ర పేరుతో రెండు గదులు నిర్మించి ఎమ్మెల్యే బుర్రా చేతుల మీదుగా 2022 ఆగస్టులో 21న ప్రారంభించారు. ప్రారంభించిన కొద్ది రోజులకే మూతపడింది. బయట మార్కెట్ కన్న ఫిష్ ఆంధ్ర స్టాల్‌లో తక్కువ ధరలకే నాణ్యమైన చేపల విక్రయాలు అందుబాటులో ఉంటాయని ప్రచారం నిర్వహించారు. వాస్తవానికి బయట మార్కెట్‌లో కన్నా ఫిష్ ఆంధ్ర స్టాల్స్‌లోనే ఎక్కువ ధరకు చేపలను విక్రయించారు. దూరభారం నుంచి సముద్ర ఉత్పత్తులను పామూరు ప్రాంతానికి రవాణ చేయడం కష్టతరంగా మారిందని, మండలంలోని మోపాడు నుంచి కూడా చేపలు రాకపోవడంతో కాంట్రాక్ట్ దారుడు ఫిష్ ఆంధ్ర స్టాల్‌ను మూసివేశాడు.

ఆర్టీసీ యాజమాన్య నిర్లక్ష్యవైఖరే నిండు ప్రాణాలను బలిగొంది!

- ఎమ్మార్పీఎస్ నేతల ఆరోపణ



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కనిగిరి, మే 21: ఆర్టీసీ యాజమాన్య నిర్లక్ష్య వైఖరితోనే రెండు నిండు ప్రాణాలు బలిగొందని ఎమ్మార్పీఎస్ నాయకుడు రావినూతల కోటయ్య, తదితరులు ఆరోపించారు. ఈనెల 19న కనిగిరి ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు చెన్నై వెళ్తూ మార్గమధ్యంలో నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెం వద్ద ప్రమాదానికి గురైన సంఘటన పాఠకులకు విదితమే. ఈ ప్రమాదంలో నియోజకవర్గంలోని వెలిగండ్ల మండలానికి చెందిన ఇద్దరు మృతిచెందారు. ఈప్రమాదానికి పూర్తిగా యాజమాన్యమే నిర్లక్ష్యమేనంటూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్‌ను కలసి వినతిపత్రం అందజేశారు. అనంతరం డిపో ఆవరణలో ఆయన విలేకరులతో మాట్లాడారు. బస్సు ప్రమాదంలో చనిపోయిన కుటుంబాలకు ప్రమాద పరిహారంతో పాటు, ఆర్థిక సహాయం ఆర్టీసి యాజమాన్యం అందించాలని డిమాండ్ చేశారు. మరో ఇద్దరు ప్రాణాపాయ స్థితిలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని, వారికి వైద్యసహాయంతో పాటు ఆర్థిక సహకారం అందించాలని కోరారు. సుదూర ప్రాంతాలకు చెందిన బస్సులకు కూడా ఒకే డ్రైవర్‌ను డ్యూటీ వేయటం సరికాదన్నారు.

ముందురోజు చెన్నై వెళ్లిన బస్సు మధ్యాహ్నం కనిగిరికి వచ్చిందన్నారు. తిరిగి అదే బస్సులో రాత్రి కనిగిరి నుంచి చెన్నైకు వెళ్ళేందుకు కూడా అదే డ్రైవర్‌ను డ్యూటీ వేసినట్టు చెప్పారు. దీంతో డ్రైవర్ అలసిపోవడంతో ప్రమాదం జరిగిందన్నారు. దీనికి పూర్తి బాధ్యత ఆర్టీసీ డిపో మేనేజర్ వహించాలన్నారు. ప్రమాదంలో చనిపోయిన కుటుంబాలకు చెందిన వారిలో చదువుకున్న వారికి ఆర్టీసీలో ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేదంటే ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో డిపో మేనేజర్ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా బాధిత కుటుంబాలకు న్యాయం జరిగే వరకూ ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు జేపీ రాజు, జుటికే దానియేలు, తదితరులు పాల్గొన్నారు.

ధైర్యంగా ఉండండి.. అండగా ఉంటా!



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

దర్శి మే 21 : మండలంలోని తూర్పువెంకటాపురంలో ఇటీవల మృతి చెందిన టీడీపీ కార్యకర్త జంపాల గురుబాబు కుటుంబాన్ని దర్శి అసెంబ్లీ టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి మంగళవారం పరామర్శించారు. గురుబాబు అనారోగ్యంతో మృతి చెందాడు. మృతునికి భార్య శ్రావణి, ఏడు నెలల పాప ఉన్నారు. విషయం తెలుసుకున్న డాక్టర్ లక్ష్మి వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని, అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో స్థానిక టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రత్యేకావసరాల పిల్లల సర్వే నిర్వహించాలి

ఒంగోలు(విద్య), మే 21: జిల్లాలో ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులను గుర్తించేందుకు సర్వే నిర్వహించి వారిని 2024-25 విద్యా సంవత్సరానికి సమీపంలోని పాఠశాలలో చేర్పించాలని భవిత కేంద్రాల్లో పనిచేస్తున్న సహిత విద్యా రిసోర్స్‌పర్సన్లను జిల్లా విద్యాశాఖాధికారి డి.సుభద్ర మంగళవారం ఆదేశించారు. 21 రకాల ప్రత్యేక అవసరాల పిల్లలను గుర్తించి వారి వివరాలను తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేయించాలన్నారు. మండలంలోని గ్రామాలను రెండు క్లస్టర్లుగా విభజించి మండలంలోని సహిత విద్యా రిసోర్స్‌పర్సన్లకు కేటాయించారు. రిసోర్స్ పర్సన్లు తమకు కేటాయించిన క్లస్టరు పరిధిలోని గ్రామాలను సందర్శించి సర్వే నిర్వహించాలని, మండల విద్యాధికారులు ఈ సర్వేను పర్యవేక్షించాలని సూచించారు. 20 రోజుల పాటు జరిగే ఈ సర్వే వివరాలను ఎప్పటికప్పుడు సమగ్ర శిక్ష జిల్లా ప్రాజెక్టు కార్యాలయానికి తెలియజేయాలన్నారు.

సర్వే అనంతరం పిల్లల గుర్తింపు, పాఠశాలల్లో నమోదు పూర్తయిన తర్వాత వివరాలను నిర్ణీత ప్రొఫార్మాలో మండల విద్యాధికారి సంతకంతో సమగ్ర శిక్ష జిల్లా కార్యాలయానికి పంపించాలని ఆదేశించారు.

230 మంది గుర్తింపు..

జిల్లావ్యాప్తంగా ఇప్పటి వరకు 230 మంది ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులను గుర్తించినట్లు జిల్లా సహిత విద్యా కో ఆర్డినేటర్ ఎం.రమేష్ తెలిపారు. సర్వేలో భాగంగా రమేష్ మంగళవారం ఒంగోలులోని గద్దలగుటలోని దివ్యాంగరాలు ఇంటిని సందర్శించారు. భవిత కేంద్రాల్లో దివ్యాంగులకు లభిస్తున్న ప్రత్యేక సదుపాయాలు, సేవలు గుర్తించి తల్లిదండ్రులకు వివరించారు. కార్యక్రమంలో సహిత విద్యా రిసోర్స్ టీచర్లు పాల్గొన్నారు.

కల్లు కోసమే వృద్ధురాలి దారుణహత్య

కొత్తపట్నం(ఒంగోలునగరం) మే 21: కల్లు తాగే అలవాటు. వృద్ధురాలి హత్యకు దారితీసింది. కల్లు అమ్మే వృద్ధురాలి ఇంటిలోకి దొడ్డిదారిన ప్రవేశించిన ఇరువురు కలు తాగుండగా ఆమె నిద్ర లేవడంతో హత్య చేసి చేతులకు ఉన్న రోల్డు గోల్డు గాజులు.. చెవికమ్మలు దొంగిలించి పరారయ్యారు. ఈ కేసును పోలీసులు ఛేదించి నిందితులను అరెస్టు చేశారు. గత శనివారం కొత్తపట్నంరెడ్డిపాలెంలో జరిగిన వృద్ధురాలి హత్య కేసును పోలీసులు తక్కువ స మయంలోనే ఛేదించారు. హత్యకు పాల్పడిన ఇద్దరిని మంగళవారం అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచగా న్యాయాధికారి రిమాండ్ విధించారు. హత్యకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి..

కొత్తపట్నం రెడ్డిపాలెంకు చెందిన గౌరవరపు నాంచార్లు, కోడూరి నాగరాజు బంధువులు. ఇద్దరు మద్యానికి అలవాటు పడ్డారు. చుక్కపడనిదే నిద్ర పట్టని పరిస్థితికి వారిది. రెడ్డిపాలెంలో కల్లు అమ్మే గుడపల్లి నాగేశ్వరమ్మ దగ్గర తరచూ కల్లు తాగు తుండే వారు. నాగేశ్వరమ్మ నివాసంలో ఒంటరిగానే ఉంటున్న విషయం వీరికి తెలుసు. గత శనివారం అర్ధరాత్రి ఇద్దరూ కల్లు కోసం నాగేశ్వరమ్మ ఇంటిలోకి ప్రవేశించారు. దొంగతనంగా కల్లు తాగుతుండగా నాగేశ్వరమ్మ నిద్రలేచి ఇద్దరిని పెద్దగా మందలించారు. దీంతో ఆగ్రహానికి గురయిన ఇద్దరు ఆమె త లపై బలంగా కొట్టారు. కింద పడిపోయిన ఆమె గొంతును గట్టిగా నులిమేశారు. అంతేగాకుండా ముఖంపై దిండుతో అదిమిపట్టారు. దీంతో నాగేశ్వరమ్మ అక్కడికక్కడే మృతి చెందారు. అనంతరం వారు మృతిరాలి చేతులకు ఉన్న గాజులను, చెవులకు ఉ న్న బంగారు కమ్మలను లాగేసుకున్నారు. ఆమె వద్ద ఉన్న తాళాలు తీసుకుని బీరువాని తెరిచారు. బీరు వాలో ఎలాంటి నగదుగాని, ఇతర ఆభరణాలు కాని లేకపోవటంతో అలాగే వదిలేసి పోయారు. ఈ విష యం ఎవరికీ తెలియకుండా ఇంటి నుంచి బయట పడ్డారు. అర్ధరాత్రి కావటంతో ఎవరూ గుర్తించలేక పోయారు.

ఉదయాన్నే నాగేశ్వరమ్మ హత్య ఉదంతం గ్రామంలో గుప్పుమంది. పోలీసులు వేగంగా స్పందించారు. ఏఎస్పీ శ్రీధర్‌రావు, డీఎస్పీ కిషోర్ బాబు, టూ టౌన్ సీఐ జగదీష్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. హత్య జరిగిన ప్రాంతంలోని చుట్టు పక్కల అందుబాటులో ఉన్న సీసీకెమెరాల పుటేజీలను పరిశీలించారు. డాగ్ స్క్వాడ్‌లతో పరిశీలన జరిపారు. ఎట్టకేలకు నిందితులను గుర్తించి అరెస్టు చేశారు. నిందితులు నేరాన్ని పోలీసుల ఎదుట అం గీకరించినట్లు తెలిసింది. ఇద్దరిని కోర్టులో హాజ రుపర్చగా రిమాండ్ విధించినట్లు టూటౌన్ సీఐ జగదీష్ తెలిపారు.







పరీక్ష మమ..!

బాపట్ల, మే 21 (ఆంధ్రజ్యోతి): నేల తీరు ద్వారా ఏ పైరు సాగు చేస్తే అధిక దిగుబడులు వస్తాయో తెలుసుకోవడానికి భూసార పరీక్షలు అత్యంత కీలకం. ఈ విషయంలో గత నాలుగేళ్లుగా వైసీపీ ప్రభుత్వం వహించిన నిర్లక్ష్యంతో అన్నదాతలకు తీరని నష్టం మిగిల్చింది. అరకొరగా ఉన్న కేంద్రాలకు కూడా ఒక్క రూపాయి నిధులు మంజూరు చేసిన దాఖలాలు లేవు. అంతంత మాత్రంగా ఉన్న అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి సైతం జీతాలు సకాలంలో ఇవ్వలేకపోయారు. జిల్లాలో ఉన్న భూసార పరీక్ష కేంద్రాలను దాదాపు నిర్వీర్యం చేసిన జగన్ సర్కారు రైతుభరోసా కేంద్రాల్లోనే పరీక్షలు చేస్తామని, అన్నదాతలకే పరీక్షల కిట్లు అంది స్తామనే మోసపు మాటలతోనే నాలుగేళ్లు గా కాలయాపన చేసిందే తప్ప రైతులకు ఒరగ బెట్టిందేమి లేదు.

- నాలుగేళ్లుగా అటకెక్కిన భూసార పరీక్షలు
- పరీక్షా కేంద్రాల్లో నిధుల కొరత, సిబ్బందిలేమి
- నేల అదును తెలియక తీవ్రంగా నష్టపోతున్న అన్నదాతలు
- ఈ సారి ముందుగానే వానలు..
- ఖరీఫ్ సాగుకు సన్నద్ధమవుతున్న రైతాంగం

పరీక్షల ఊసే లేకుండా...

2014--19 మధ్య భూసార పరీక్షల విషయంలో నిర్దిష్ట షెడ్యూల్ ప్రకారం ప్రక్రియ పూర్తి చేసేవారు. ఖరీఫ్ సీజన్‌కు ముందు ఏప్రిల్ 15లోగా నమూనాలు సేకరించడం, వాటిని ప్రయోగశాలలకు పంపి మే 15లోగా ఫలితాలను రైతులకు వివరించేవారు. ఆ రిపోర్టుల ఆధారంగా ఖరీఫ్‌లో సాగు చేసే పంట విషయంలో అన్నదాతలు ఓ అంచనాకు వచ్చేవారు. ఇంతటి కీలకమైన పరీక్షలకు ఈ ప్రభుత్వం గ్రహణం పట్టించింది. కనీస నిధులు విడుదల చేయకపోవడంతో పరీక్షా కేంద్రాలు నిధుల లేమితో కునారిల్లుతున్నాయి.

రైతులకు విస్తృత ప్రయోజనాలు..

పరీక్షల ద్వారా ముఖ్యంగా ఆయా నేలల తత్వం రైతులకు తెలుస్తుంది. పోషకాలైన నత్రజని, భాస్వరం, పొటాష్ ఇతరత్రా ఆ భూమిలో ఎంత మోతాదులో ఉందన్న విషయం అన్నదాతలకు తెలిసేది. తద్వారా లోపం ఉన్న పోషకాల వాడకం ద్వారా భూసారం మెరుగయ్యేది. ఆ ప్రభావం వల్ల రైతు ఆశించిన స్థాయిలో దిగుబడులు ఉండేవి. కానీ వీటన్నింటికి నాలుగేళ్లుగా అన్నదాతలు దూరమయ్యారు.

లక్ష్యాలు నిర్దేశించుకుంటున్నారు...

ప్రతిసీజన్‌కు ముందు మట్టినమూనాల సేకరించి ఫలితాలు అందించే విషయంలో లక్ష్యాలు మాత్రం ఘనంగానే యంత్రాంగం నిర్దేశించుకుంటోంది. జిల్లాలో పదివేల మట్టి నమూనాల లక్ష్యాన్ని ప్రతిసీజన్‌లో పెట్టుకుంటారు. ఆ వివరాలను భూమి పోషక్ యాప్‌లో కూడా నమోదు చేయాలి. ఏళ్ల తరబడి కేంద్రాలు నిర్లక్ష్యానికి గురవడంతో అరకొరగా ఉన్న యంత్ర పరికరాలు సైతం పూర్తిగా మూలన పడ్డాయి. బాపట్లలోని ఏజీ కళాశాల ఆవరణలోనే జిల్లా భూసార పరీక్ష కేంద్రంతో పాటు, మొబైల్ టెస్టింగ్ ల్యాబ్ కూడా ఉంది. వీటిలో ఉన్న పరికరాలు అంతంతమాత్రమే. చాలీచాలని సిబ్బందితో మొక్కుబడి తంతుగా పరీక్షలు చేస్తున్నారు.

పెరుగుతున్న రసాయన ఎరువుల వాడకం...

పంటలను చీడపీడల నుంచి రక్షించుకోవడానికి ఏటికేడు రసాయన ఎరువుల వాడకాన్ని రైతులు విరివిగా వాడుతున్నారు. దీంతో చాలా వేగంగా భూసారం కోల్పోతుండడంతో పాటు సహజ స్వభావాన్ని మార్చుకుంటూ వస్తోంది. దీంతో రైతుల పని రెంటికి చెడ్డ రేవడిలా తయారవుతోంది. ఇటు పెట్టుబడి ఖర్చులు రెట్టింపవుతుండగా మరోవైపు నేల స్వభావం సరిపడక వేసిన పైరు తాలూకా దిగుబడులు తీసికట్టుగా ఉంటున్నాయి.

ముందుగానే వర్షాలు...

ఈ ఏడాది వర్షాలు కాస్త ముందుగానే పడుతున్నాయి. ఇందుకు తగ్గట్లుగానే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న రైతులు ఖరీఫ్ సాగుకు సన్నద్ధం అవుతున్నారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో వరికి సంబంధించి దాదాపు 1,15,000 హెక్టార్లలో సాగు కానుంది. ఉద్యాన పంటలతో పాటు పత్తి కూడా సాగు చేయడానికి రైతులు సమాయత్తమవుతున్నారు. ఎన్నికల ప్రక్రియ ఇటీవలే ముగియడంతో ప్రభుత్వ కార్యకలాపాల విషయంలో ఓ రకమైన స్తబ్దత ఆవరించి ఉంది. ఈ ప్రభావం అన్నదాతల మీద పడి వారికి అందు కాస్త ప్రయోజనాలు కూడా అందకుండా పోయే ప్రమాదం ఉంది. నాలుగేళ్లుగా అటకెక్కించిన భూసార పరీక్షలను ఈ ఏడాదైనా చిత్తశుద్ధితో నిర్వహించాలని, అందుకు కావాల్సిన ఏర్పాట్లను ప్రభు త్వం చేయాలని రైతులు కోరుకుంటున్నారు.

శిక్షణ లేదు.. సేకరణా లేదు..

వ్యవసాయశాఖ సిబ్బంది అయినటువంటి ఏవో, ఏఈవో, వీఏలకు సీజన్ మొదలవ్వడానికి ముందు శిక్షణ కార్యక్రమం నిర్వహించాలి. ఇప్పటి వరకు వాటి ఊసేలేదు. ప్రతి ఆర్‌బీకే నుంచి మట్టి నమూనాలు సేకరించి పరీక్షల నిమిత్తం బాపట్లలో ఉన్న భూసార పరీక్ష కేంద్రానికి వాటిని తీసుకురావాల్సి ఉంది. ఖరీఫ్ మొదలవబోతున్న ఈ ప్రక్రియ మొదలు కాలేదు. ఏవో మొక్కుబడిగా ఒక ట్రెండు మట్టి శాంపిల్స్ సేకరించి మమ అనిపించడం తప్పితే అన్నదాతలకు అవ గాహన కల్పించేవారే కరువయ్యారు. ఇక నియోజకవర్గానికి ఒక అగ్రిటెస్టింగ్ ల్యాబ్ మరో ప్రహసనం. బాపట్లలోని మార్కెట్ యార్డులో ఉన్న ఆ అగ్రిల్యాబ్ అలంకార ప్రాయంగా మిగిలిందే తప్ప అన్నదాతలకు ఉపయోగపడిన దాఖలాలులేవు.



బాపట్ల ఏజీ కళాశాల ఆవరణలో భూసార పరీక్ష కేంద్రం

కిట్లలో.. కోత



- ఉమ్మడి జిల్లాలో భారీగా పడిపోయిన విద్యాకిట్ల పంపిణీ
- విద్యా సంస్కరణలు అంటూ ప్రభుత్వం ఊకదంపుడు
- అయినా సర్కారు పాఠశాలల్లో పెరగని విద్యార్థుల సంఖ్య
- 50వేలకు పైగా విద్యార్థులు ప్రైవేటు బాట..

గుంటూరు(విద్య), మే 21: నాడు నేడుతో ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి మౌలిక వసతులు కల్పిస్తున్నాం.. ప్రాథమిక స్థాయి నుంచే టోఫెల్ తరగతులు.. ఉన్నత పాఠశాలల్లో ఇంటరాక్టివ్ ప్యానల్ బోర్డులతో బోధన.. ట్యాబులు, విద్యాకానుక పంపిణీ, మధ్యాహ్న భోజనం, చిక్కీలు, రాగిజావ పంపిణీ ఇలా ఎన్ని పథకాలు అమలు చేసినా ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించడానికి తల్లిదండ్రులు ఆసక్తి చూపడం లేదు. ఉమ్మడి జిల్లాలో గత ఏడాది దాదాపు 50వేల మందికి పైగా విద్యార్థులు ప్రైవేటు బాట పట్టారని విద్యాకిట్లు పంపిణీ చేసే గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో ఈ ఏడాది విద్యాకిట్ల పంపిణీ కోసం ఇప్పటికే ప్రభుత్వం మండలాల వారీగా ఏర్పాట్లు చేసింది. జిల్లా కేంద్రాలకు కిట్లు పంపిణీ చేశారు. ఇందులో భాగంగా విద్యార్థులకు యూనిఫాం క్లాత్, బ్యాగు, పాఠ్యపుస్తకాలు, షూ, బెల్ట్, సాక్సులు తదితర వస్తువులు అందజేస్తారు. ఉమ్మడి జిల్లాలో 2023-24 సంవత్సరాలకు గాను గుంటూరు జిల్లాలకు 1,26,428, బాపట్ల జిల్లాకు 1,11,022, పల్నాడు జిల్లాకు 1,80,089 కిట్లు పంపిణీ చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. అయితే గత ఏడాది ఆయా జిల్లాల్లో విద్యార్థులకు పంపిణీ చేసిన కిట్లకు ఈ ఏడాది పంపిణీ చేసే కిట్లకు భారీ స్థాయిలో తేడా ఉంది. గుంటూరు జిల్లాలో గత ఏడాది 1,35,07 కిట్లు పంపిణీ చేశారు. అంటే గత ఏడాదికి ఇప్పటికి దాదాపు 18,659 కిట్లు తేడా ఉంది. అదే విధంగా పల్నాడు జిల్లాలో గత ఏడాది 1,90,941 కిట్ల పంపిణీ చేశారు. ఇందులో దాదాపు 20వేల పైగా కిట్లలో కోత పడింది. బాపట్ల జిల్లాలో గత ఏడాది 1,30,963 కిట్లు పంపిణీ చేయగా ఈ ఏడాది 18,575 కిట్లు కోత పడింది. ఇలా ఉమ్మడి జిల్లాలో దాదాపు 50వేల మందికి పైగా విద్యార్థులు ప్రైవేటు బాటపట్టారు. ఫలితంగా కిట్ల పంపిణీలో భారీగా కోత పడిందని ఉపాధ్యాయ సంఘాల నాయకులు చెబుతున్నారు.

సంవత్సరం	జిల్లా	పంపిణీ చేసిన కిట్లు
2022-23	గుంటూరు	1,35,087
2023-24	గుంటూరు	1,16,428
2022-23	పల్నాడు	2,05,841
2023-24	పల్నాడు	1,80,089
2022-23	బాపట్ల	1,30,963
2023-24	బాపట్ల	1,11,022

ప్రాథమిక విద్యకు పాతర...

ఉమ్మడి జిల్లాలో ప్రాథమిక పాఠశాలలు వందల సంఖ్యలో మూత పడ్డాయి. అనేక పాఠశాలల్లో ఉన్న విద్యార్థులను సమీపంలోని ఉన్నత పాఠశాలల్లో 3, 4, 5 తరగతుల్లో చేర్పించాలని జీవో తీసుకు రావడంతో అనేకమంది విద్యార్థుల తల్లిదండ్రులు దూరప్రాంతాల్లో ఉన్న ఉన్నత పాఠశాలలకు విద్యార్థుల్ని పంపలేక ప్రైవేటు వైపునకు మొగ్గు చూపినట్లు చెబుతున్నారు. ప్రాథమిక పాఠశాలల్లో 1, 2 తర గతుల్లో చేర్పించడానికి కూడా ఎవరూ ముం దుకు రావడం లేదు. ఫలితంగా అక్కడ కూడా అడ్మిషన్లు భారీగా తగ్గిపోయినట్లు చెబుతున్నారు. ఉమ్మడి జిల్లాలో దాదాపు 100 పైగా ఏకోపాధ్యాయ పాఠశాలలు ఉన్నట్లు సమాచారం.

మౌలిక వసతుల కల్పనలో తీవ్ర జాప్యం

నాడు నేడు పేరుతో రెండు విడతల్లో చేస్తున్న పనులు ఇంకా ఒక కొలిక్కిరాలేదు. అనేక పాఠశాలల్లో పనులు జరుగుతూనే ఉన్నాయి. మరోవైపు అనేక పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఉంది. సబ్జెక్టు టీచర్లు లేక ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. కనీసం విద్యా వలంటీర్లను నియమించాలనే స్పృహ కూడా ప్రభుత్వానికి లేకపోవడంతో విద్యార్థుల సంఖ్య ఉన్నత పాఠశాలల్లో భారీగా పడిపోయింది. ఇంకోవైపు తాగునీటి కోసం చేసిన ఏర్పాట్లు పూర్తిస్థాయిలో ఫలితం లేకుండా పోయాయి. ఇప్పటికీ అనేక పాఠశాలల్లో తాగునీటి కోసం తీసుకు వచ్చిన మినరల్ వాటర్ ప్లాంట్లు బిగించకుండా వదిలేశారు. మరోవైపు మరుగుదొడ్ల నిర్వహణ కోసం నిధులు ఇవ్వడం లేదు. ఇలా కర్షడి చావుకు కారణాలు అనేకం అన్నచందంగా విద్యార్థుల సంఖ్య క్రమంగా తగ్గిపోతుందని ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మెజార్టీపై.. బెట్టింగ్

- జోరుగా పందేలు కాస్తున్న వైనం

అద్దంకి, మే 21: ఎన్నికలు ముగిసి ఎనిమిది రోజులు అయింది. కౌంటింగ్‌కు 12 రోజులు గడువు ఉంది. ఈ నేపథ్యంలో అద్దంకి నియోజకవర్గంలో బెట్టింగ్‌ల జోరు పెరిగింది. అత్యధిక నియోజకవర్గాలలో గెలుపు, ఓటమిలపై బెట్టింగ్‌లు సర్వసాధారణంగా జరుగుతుంటాయి. కానీ అద్దంకి నియోజకవర్గంలో గెలుపోటమిలపై బెట్టింగ్ కాయడం లేదు. కొద్దిమంది గెలుపోటమిలపై బెట్టింగ్ కాసినా ఒకటికి రెండింతలు ఇచ్చేలా పందేలు కడుతున్నారు. టీడీపీ గెలిస్తే వైసీపీ వాళ్లు లక్ష, అదే వైసీపీ గెలిస్తే రూ.2లక్షలు ఇచ్చే విధంగా అతి కొద్ది మంది మాత్రమే బెట్టింగ్ కాసినట్లు సమాచారం. ఇక సిట్టింగ్ ఎమ్మెల్యే, టీడీపీ కూటమి అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్‌కు 15వేల మెజార్టీ పైనే వస్తుందని ఎక్కువ శాతం బెట్టింగ్‌లు సాగుతున్నట్లు తెలుస్తుంది. ఈ పందెంకు అటు వైసీపీ, ఇటు టీడీపీ నుంచి పెద్ద సంఖ్యలో బెట్టింగ్‌లు పెట్టినట్లు సమాచారం. అద్దంకి నియోజకవర్గంలో మొత్తం 2,44,057 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 2,15,375 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ విడత పోలింగ్ శాతం బాగా పెరిగింది. పెరిగిన పోలింగ్ శాతాన్ని టీడీపీ, వైసీపీలు ఎవరికి వారే అనుకూలంగా చెప్పుకుంటున్నారు. ఓటర్లకు డబ్బులు చేరవేయడంలో టీడీపీ ఒకింత ముందు ఉన్నప్పటికీ వైసీపీ కూడా గతంలో ఎప్పుడు ఇవ్వనంత మొత్తంలో పంపిణీ చేశారు. టీడీపీకి ఏకపక్షంగా ఓటింగ్ జరుగుతుందన్న మూడు సామాజికవర్గాల లోని ఓటర్లలో అతి తక్కువ మందికి మాత్రమే వైసీపీ నేతలు డబ్బులు పంపిణీ చేసినట్లు తెలుస్తోంది. ఈక్రమంలో ఆయా సామాజిక వర్గాలలో అంచనాకు మించి టీడీపీకి ఎక్కువ ఓట్లు వచ్చే అవకాశం ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో టీడీపీ మెజార్టీ 15 వేలు దాటుతుందన్న గట్టి నమ్మకంతో టీడీపీ శ్రేణులు ఉన్నాయి. వైసీపీ నేతలు మాత్రం గత ఎన్నికలతో పోల్చితే ఈ విడత గతం కంటే భిన్నంగా ఎక్కువ మంది ఓటర్లకు డబ్బులు పంపిణీ చేసినందువల్ల గట్టి పోటీ ఇచ్చామన్న భావనలో ఉన్నారు. మరికొందరు గ్రామ, మండల స్థాయి నేతలు ఇంకో అడుగు ముందుకేసి మండలాల, గ్రామాలవారీ మెజార్టీలపై బెట్టింగ్‌లు పెట్టినట్లు తెలుస్తుంది. కౌంటింగ్ సమయం దగ్గర పడుతుండడంతో బెట్టింగ్ రాయుళ్ల గుండెల్లో రైళ్లు పరుగెత్తుతున్నాయి.



కళ్లకు గంతలు!

- హైకోర్టు అవసరాలకు కేటాయించిన భూమిలో ఏర్పాటు చేసిన హెచ్చరికి బోర్డు మాయం
- తీరంలో అనధికారిక విందులు, వినోదాలు
- పట్టించుకోని అధికారులు

ముందుపాతిన హెచ్చరిక బోర్డును తొలగించడంతో, మరలా బోర్డు పాతి అడ్డుగా పెద్ద గోతులు తీయించిన అధికారులు(ఫైల్)



చీరాల, మే 21: అక్రమార్కులు అధికారుల కళ్లకు గంతలు కట్టారు. సాక్షాత్తు హైకోర్టు వారికి కేటాయించిన భూమిగా రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డును మాయం చేశారు. ఆ భూమిలో రాకపోకలు నియంత్రించేందుకు తీయించిన గోతులను పూడ్చారు. వేసిన ఫెన్సింగ్ కూడా కనిపించడం లేదు. ప్రస్తుతంలో తీరప్రాంతంలోని వారిలో ఈ అంశంపై జోరుగా చర్చ సాగుతోంది. ప్రభుత్వపరంగా కట్టడి చేసేందుకు ఏర్పాటు చేసిన చర్యలను అక్రమార్కులు ఉల్లంఘించడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

వేటపాలెం మండలం చల్లారెడ్డిపాలెం పంచాయతీ పరిధిలోని తీరప్రాంతంలో సముద్రం వెంట ఉన్న రోడ్డుకు పక్కన కొంత ప్రభుత్వ భూమి ఉంది. పక్కన ప్రైవేటు వ్యక్తుల స్థలాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వ భూమిలో కొంత భాగాన్ని హైకోర్టు వారి అవసరాలకు రెవెన్యూ అధికారులు కేటాయించారు. ఈ క్రమంలో ఆ భూమి వద్ద హెచ్చరిక బోర్డును ఏర్పాటు ఏర్పాటు చేశారు. తొలుత ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డును అగంతకులు తొలగించారు. తరువాత ఆ స్థలానికి అడ్డుగా పెద్ద గోతులు తీసి మరలా హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఆ హెచ్చరిక బోర్డు కూడా లేదు. అధికారులు తీయించిన గొయ్యి కూడా లేదు. ఆ గొయ్యిని అధికారులే పూడ్పించి, హెచ్చరిక బోర్డును అధికారులే తొలగించారా లేకుంటే ఆ ప్రాంతంలోని బడాబాబులు తమకు అనుకూలంగా ఆ గోతిని పూడ్చి, తమ అవసరాలకు అనుగుణంగా మార్చారా అనే విషయమై తీర ప్రాంతంలో చర్చ సాగుతోంది. ఇదిలావుంటే పలువురు రిసార్ట్ నిర్వాహకులు సముద్రతీరం వెంట నిర్వహించే అనుమతులులేని పార్టీలు, ఫంక్షన్లపై కూడా జనాల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నికల నేపథ్యంలో బదిలీపై వచ్చిన అధికారులు, ఈ ప్రక్రియ పూర్తయితే తాము ఇక్కడ నుంచి వెళ్లిపోతాం.అనవసరంగా వివాదాస్పద విషయాలలో జోక్యం చేసుకోవడం ఎందుకనే విధంగా ప్రవర్తిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. దీన్ని ఆసరాగా చేసుకుని అక్రమార్కులు తమకు అనుకూలంగా మరల్చుకుంటున్నారనే ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి. సంబంధీకులు అధికారుల కళ్లకు గంతలు కడుతున్నారని ప్రజలు ఎద్దేవా చేస్తున్నారు.

తీరంలో విందు కార్యక్రమానికి ఏర్పాటు చేసిన ఏర్పాట్లు (పాత చిత్రం)



స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద.. పటిష్ట భద్రత

- కలెక్టర్ పి.రంజిత్‌బాషా



బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలోని స్ట్రాంగ్‌రూమ్‌లు, భద్రతను పరిశీలిస్తున్న జిల్లాకలెక్టర్ పి.రంజిత్‌బాషా, ఎస్పీ వకుల్ జిందాల్

బాపట్ల, మే 21: స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకు పటిష్ట భద్రత కొనసాగించాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. మంగళవారం బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూమ్‌లను జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు కేంద్రాలలో ఈసీ మార్గదర్శకాల మేరకు అధికారులు ఏర్పాట్లు చేయాలన్నారు. ఓట్ల లెక్కింపు కేంద్రాలకు ఆరు నియోజకవర్గాల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు, వారి ఏజెంట్‌లు వచ్చేందుకు మార్గాలు ఏర్పాట్లు చేయాలన్నారు. బారికేడ్‌లు సిద్ధం చేసుకోవాలని, అనుమతులు లేకుండా ఎవరిని కళాశాల ప్రాంగణం వైపు రానివ్వరాదన్నారు. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు కొరకు ప్రత్యేక టేబుల్స్, ఈవీఎం యంత్రాలలో ఓట్ల లెక్కింపు కొరకు ప్రత్యేక టేబల్స్ ఏర్పాటు చేయాలన్నారు. స్ట్రాంగ్ రూమ్‌లు, ఓట్లలెక్కింపు కేంద్రాల వద్ద ప్రతి పరిస్థితిని క్షుణ్ణంగా పరిశీలించేలా వెబ్ క్యాస్టింగ్ కంట్రోల్ రూమ్ నడిపించాలన్నారు. కంట్రోల్ రూమ్ వద్దనే మీడియా సెంటర్‌ను ఏర్పాటు చేయాలన్నారు. ఓట్ల లెక్కింపు కేంద్రానికి కొంత దూరంలో వాహనాల పార్కింగ్ స్థలం ఎంపిక చేయాలని ఎస్పీకి సూచించారు. మూడు అంచల భద్రతపైఅధికారులు అప్రమత్తంగా ఉండాలని పలుసూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ శ్రీధర్, అదనపు ఎస్పీ విఠలేశ్వరరావు, జిల్లా రెవెన్యూ అధికారి సి.హెచ్.సత్తిబాబు, ఆర్డీవో జి.రవీందర్, అధికారులు పాల్గొన్నారు.

కల్లు కోసమే వృద్ధురాలి దారుణహత్య

కొత్తపట్నం(ఒంగోలునగరం) మే 21: కల్లు తాగే అలవాటు. వృద్ధురాలి హత్యకు దారితీసింది. కల్లు అమ్మే వృద్ధురాలి ఇంటిలోకి దొడ్డిదారిన ప్రవేశించిన ఇరువురు కలు తాగుండగా ఆమె నిద్ర లేవడంతో హత్య చేసి చేతులకు ఉన్న రోల్డు గోల్డు గాజులు.. చెవికమ్మలు దొంగిలించి పరారయ్యారు. ఈ కేసును పోలీసులు ఛేదించి నిందితులను అరెస్టు చేశారు. గత శనివారం కొత్తపట్నం రెడ్డిపాలెంలో జరిగిన వృద్ధురాలి హత్య కేసును పోలీసులు తక్కువ సమయంలోనే ఛేదించారు. హత్యకు పాల్పడిన ఇద్దరిని మంగళవారం అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచగా న్యాయాధికారి రిమాండ్ విధించారు. హత్యకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి..

కొత్తపట్నం రెడ్డిపాలెంకు చెందిన గౌరవరపు నాంచార్లు, కోడూరి నాగరాజు బంధువులు. ఇద్దరు మద్యానికి అలవాటు పడ్డారు. చుక్కపడనిదే నిద్ర పట్టని పరిస్థితికి వారిది. రెడ్డిపాలెంలో కల్లు అమ్మే గుడపల్లి నాగేశ్వరమ్మ దగ్గర తరచూ కల్లు తాగు తుండేవారు. నాగేశ్వరమ్మ నివాసంలో ఒంటరిగానే ఉంటున్న విషయం వీరికి తెలుసు. గత శనివారం అర్ధరాత్రి ఇద్దరూ కల్లు కోసం నాగేశ్వరమ్మ ఇంటిలోకి ప్రవేశించారు. దొంగతనంగా కల్లు తాగుతుండగా నాగేశ్వరమ్మ నిద్రలేచి ఇద్దరిని పెద్దగా మందలించారు. దీంతో ఆగ్రహానికి గురయిన ఇద్దరు ఆమె తలపై బలంగా కొట్టారు. కిందపడిపోయిన ఆమె గొంతును గట్టిగా నులిమేశారు. అంతేగాకుండా ముఖంపై దిండుతో అదిమిపట్టారు. దీంతో నాగేశ్వరమ్మ అక్కడికక్కడే మృతి చెందారు. అనంతరం వారు మృతిరాలి చేతులకు ఉన్న గాజులను, చెవులకు ఉన్న బంగారు కమ్మలను లాగేసుకున్నారు. ఆమె వద్ద ఉన్న తాళాలు తీసుకుని బీరువాని తెరిచారు. బీరు వాలో ఎలాంటి నగదుగాని, ఇతర ఆభరణాలు కాని లేకపోవటంతో అలాగే వదిలేసి పోయారు. ఈ విషయం ఎవరికీ తెలియకుండా ఇంటి నుంచి బయట పడ్డారు. అర్ధరాత్రి కావటంతో ఎవరూ గుర్తించలేక పోయారు. ఉదయాన్నే నాగేశ్వరమ్మ హత్య ఉదంతం గ్రామంలో గుప్పుమంది. పోలీసులు వేగంగా స్పందించారు. ఏఎస్పీ శ్రీధర్‌రావు, డీఎస్పీ కిషోర్ బాబు, టూ టౌన్ సీఐ జగదీష్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. హత్య జరిగిన ప్రాంతంలోని చుట్టు పక్కల అందుబాటులో ఉన్న సీసీకెమెరాల పుటేజీలను పరిశీలించారు. డాగ్ స్కాడ్‌లతో పరిశీలన జరిపారు. ఎట్టకేలకు నిందితులను గుర్తించి అరెస్టు చేశారు. నిందితులు నేరాన్ని పోలీసుల ఎదుట అంగీకరించినట్లు తెలిసింది. ఇద్దరిని కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించినట్లు టూటౌన్ సీఐ జగదీష్ తెలిపారు.

పలు ప్రాంతాల్లో కార్డన్‌సెర్చ్

టంగుటూరు, మే 21 : జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మంగళవారం టంగుటూరు పంచాయతీ పరిధిలోని పోతుల చెంచయ్య వెస్ట్ కాలనీలో ఉదయం 5 నుంచి 8గంటల వరకు పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈసెర్చ్‌లో ఎలాంటి పత్రాలు లేని 25 మోటారు సైకిళ్లను గుర్తించారు. వీటన్నింటిని వారు స్వాధీనం చేసుకున్నారు. ఆ మోటారు సైకిళ్ల ను పోలీసులు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఎస్సై పున్నారావు ఆ బైక్‌ల వివరాలను ఒంగోలు ఆర్‌టీవో కార్యాలయానికి పంపిస్తారు. వాటి తాలూకా ఆధారాలే దొరకకుంటే వాటియజమానులకు ఆర్టీవో జరిమానా విధిస్తారు. జరిమానా చెల్లించాక ఆర్టీవో కార్యాలయం రిలీజ్ ఆర్డర్ చూపితే ఆ బండిని యజమానికి అప్పగిస్తారు. ఈ దాడిలో సింగరాయకొండ సీఐ రంగనాథ్, టంగుటూరు, జరుగుమల్లి ఎస్సైలు పున్నారావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పొన్నలూరులో 16 వాహనాలు స్వాధీనం

పొన్నలూరు (కొండపి): పొన్నలూరులో కొండపి సీఐ పాండురంగారావు ఆధ్వర్యంలో మంగళవారం పోలీసు సిబ్బంది కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. సరైన ధ్రువీకరణ పత్రాలు లేని 16 ద్విచక్రవాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంత రం ఆయన పోలీస్‌స్టేషన్ ఆవరణలో ప్రజలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కౌంటింగ్ జరిగేంత వరకు రాజకీయ దాడులకు పాల్పడినా, అవాంఛనీయ సంఘటనలకు పాల్పడినా కఠిన చర్యలు చేపడతామని హెచ్చరించారు. హింసాత్మక ఘటనలకు పాల్పడి, సంఘ వ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొని కేసుల పాలు కావద్దని ముఖ్యంగా యువతను హెచ్చరించారు. ఎన్నికల కేసుల్లో ఇరుక్కుంటే జీవితాంతం ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో కొండపి, పొన్నలూరు, మర్రిపూడి ఎస్సైలు కృష్ణ బాజీబాబు, రాజేష్, బసవరాజు పాల్గొన్నారు.

రెడ్డిపాలెంలో 20 బైక్‌లు.

కొత్తపట్నం(ఒంగోలునగరం): కొత్తపట్నంలో పోలీసులు మంగళవారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. రెడ్డిపాలెంలో ఇంటింటిని జల్లెడపట్టారు. ఎలాంటి పత్రాలు లేకుండా ఉన్న 20 మోటార్ సైకిళ్ల లను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. ఈ సెర్చ్‌లో ఒంగోలు టూ టౌన్ సీఐ జగదీష్, కొత్తపట్నం ఎస్ఐ సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల నిర్వహణ పై ఏపీవో ఆగ్రహం

నాగులుప్పలపాడు, మే 21: ఉపాధి హామీ పథకం పనుల నిర్వహణలో అలసత్వం, నాణ్యత లేకపోవడంతో సిబ్బందిపై ఏపీవో ఆగ్రహం వ్యక్తం చేశారు. కె.తక్కెళపాడు, కొత్తకోట గ్రామాలలో పలు చోట్ల జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను మంగళవారం ఒంగోలు క్లస్టర్ ఏపీవో పాలేటి వెంకటస్వామి తనిఖీ చేశారు. తక్కెళపాడు గ్రామ పంచాయతీ పరిధిలో మూడు ప్రదేశాలలో పనులు చేపడుతుండగా ఉదయం 8 గంటలు దాటినా పనులు ప్రారంభించక పోవడం, అక్కడ చేపట్టిన పనులు నాణ్యత లేక నాసిరకంగా ఉండటంతో టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్ లపై ఏపీవో పాలేటి వెంకటస్వామి ఆగ్రహం వ్యక్తం చేశారు. క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతూ ఉన్నతాధికారులకు నివేదిక అందించటం జరుగుతుందన్నారు. వేసవి కాలంలో ఎండలు ఎక్కువగా ఉన్నందున కూలీలను ఉదయాన్నే 6 గంటలకు పని ప్రదేశంలో ఉండాలన్నారు. పని ప్రదేశంలో నీడ కోసం టెంట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, త్రాగునీరు, మెడికల్ కిట్లు తప్పనిసరిగా అందుబాటులో ఉంచాలని సిబ్బందికి సూచించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు కూలీలకు 300 రూపాయలు వేతనం అందేలా పనులు చేయించాలన్నారు. అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని ఏపీవో వెంకటస్వామి సిబ్బదిని హెచ్చరించారు. ఆయన వెంట ఏపీవో రవి, టీఏలు, ఎఫ్ఏలు ఉన్నారు.

టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలకు హాల్‌టిక్కెట్లు సిద్ధం

ఒంగోలు(విద్య), మే 21: పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థుల హాల్ టిక్కెట్లు వెబ్‌సైట్‌లో సిద్ధంగా ఉన్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి డి.సుభద్ర మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలు ఈనెల 24నుంచి జూన్ 3వతేదీ వరకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. హాల్ టిక్కెట్లను ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ వెబ్‌సైట్ నుంచి పాఠశాలల హెచ్‌ఎంల లాగిన్ ద్వారా డౌన్‌లోడ్ చేసు కోవచ్చు న్నారు. ఇందుకు సంబంధించిన సమాచారం కోసం 7842777439, 7842777429 సెల్‌నెంబర్లను సంప్రదించాలని డీఈవో కోరారు.

మహిళా కాలేజీలో మూల్యాంకనం ప్రారంభం

ఒంగోలు(విద్య), మే 21: ఆచార్య నాగారుజన యూనివర్సిటీకి సంబంధించిన మూడవ సంవత్సరం 5వ సెమిస్టర్ రెండవ సంవత్సరం నాల్గవ సెమిస్టర్ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం మంగళవారం ఒంగోలులోని ప్రభుత్వ మహిళా కళాశాలలో ప్రారంభమైంది. బీఎస్సీ అన్ని సబ్జెక్టులు, బీఏ ఎకనామిక్స్, హిస్టరీ పొలిటికల్ సైన్స్, బీకాం కామర్స్‌కు సంబంధించిన సబ్జెక్టుల మూల్యాంకనం జరుగుతుందని క్యాంపు ఆఫీసర్ డాక్టర్ డి.కళ్యాణి తెలిపారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు కళాశాలల అధ్యాపకులు మూల్యాంకనానికి హాజరైనట్లు ఆమె పేర్కొన్నారు.

గుంటిగంగలో లలితా సహస్రనామ పూజలు

తాళ్లూరు, మే 21 : పవిత్ర పుణ్యక్షేత్రమైన గుంటిగంగలో దేవదాయ, ధర్మాదాయశాఖ నూతనవరవడితో గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టింది. అందులోభాగంగా మంగళవారం అమ్మవారి ఆలయంలో లలితా సహస్రనామ పూజలు నిర్వహించారు. పలుగ్రామాలకు చెందిన 50 మంది ముత్తైదువులు 108 సార్లు లలితాసహస్రనామ పారాయణం, దేవిఖడ్గమాల పారాయణం వంటి పూజా కార్యక్రమంలు జరిపారు. ఇతరప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజా కార్యక్రమాలను తిలకించారు. కార్యక్రమంలో ఈవో కార్తీక్, ఆలయకమిటీ చైర్మన్ కొసనా గురుబ్రహ్మం, పూజారులు కామేశ్వరశర్మ, ప్రకా ష్ పంతులు, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే చర్యలు

పామూరు, మే, 21: పామూరు మండలంలో ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకొంటామని తహసీల్దార్ షాకిర్‌పాష హెచ్చరించారు. మండలంలోని పడమటకట్టకిందపల్లి పంచాయతి కందులవారిపల్లి గ్రామం 368 సర్వేనెంబర్‌లోని గ్రామ కంఠం స్థలాన్ని గ్రామ వలింటర్ గురుస్వామి ఆక్రమించారు. స్థలం చుట్టూ తడికలతో కంచె ఏర్పాటుచేశారు. గ్రామ వలంటర్ గ్రామ కంఠం స్థలాన్ని ఆక్రమించి, గతంలో రెవెన్యూ సిబ్బంది ఏర్పాటు చేసిన బోర్డులను సైతం తొలగించి ఆక్రమించారని పత్రికల్లో కథనాలు వచ్చాయి. దీనిపై స్పందించిన తహసీల్దార్ ఆక్రమణలు తొలగించి స్థలం చుట్టూ ఫెన్సింగ్ వేయాలని ఆదేశించారు. ఆయన ఆదేశాల మేరకు వీఆర్వో షేక్ ఖాజా రఫీ స్థలాన్ని పరిశీలించి స్థలం చుట్టూ ఉన్న తడికల కంచెను తొలగించారు. త్వరలో స్థలం చుట్టూ ఫెన్సింగ్ వేయించి బోర్డులు ఏర్పాటు చేయిస్తామని తెలిపారు.

ఉపాధిలో వీరదోపిడీ

- వైసీపీ నేతలు, ఈజీఎస్ సిబ్బంది కుమ్మక్కు
- పనులు చేయకుండానే మస్టర్లు
- బోగస్ ఫొటోలతో హాజరు నమోదు
- కూలీల నుంచి వారానికి రూ.200 వసూలు
- పట్టించుకోని ఉన్నతాధికారులు

మండలంలోని దాదాపు అన్ని గ్రామాల్లో అదే పరిస్థితి

పేదలకు ఉపాధి కల్పించేందుకు కేంద్రప్రభుత్వం చేపట్టిన మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం అధికార పార్టీ నాయకులకు కల్పతరువుగా మారింది. పేద కూలీలకు చెందాల్సిన ఉపాధి సొమ్మును సీనియర్ మెట్లగా చలామణి అవుతున్న వైసీపీ నేతలు, సాంకేతిక సహాయకులు దర్జాగా దోచుకుంటున్నారు. జిల్లా, మండలస్థాయి అధికారులు కూడా వీరి నుంచి వాటాలు తీసుకొని చోద్యం చూస్తున్నారన్న ఆరోపణలున్నాయి. వాస్తవ పరిస్థితులు ఆ ఆరోపణలకు బలం చేకూరుస్తున్నాయి. కలెక్టర్ ప్రత్యేకంగా విచారణ కమిటీని ఏర్పాటు చేస్తే వాస్తవాలు వెలుగు చూస్తాయని స్థానికులు పేర్కొంటున్నారు.

పుల్లలచెరువు, మే 21: ఉపాధి హామీ పథకం కొందరు అక్రమార్కులకు వరంగా మారింది. అధికారపార్టీ నేతలు, ఉపాధి సిబ్బంది ఒక్కటై ఇష్టారీతిన దోచుకుతింటున్నారు. వీరికి జిల్లాస్థాయిలో ఉన్నతాధికారుల అండదండలు ఉండటంతో యథేచ్ఛగా అక్రమాలకు పాల్పడి భారీగా స్వాహా చేస్తున్నారు. ఇందుకు పుల్లలచెరువు మండలంలో జరుగుతున్న తంతునే నిదర్శనం. మండలంలో 19 పంచాయతీలు ఉండగా, సుమారు 15 పంచాయతీల్లో మాయ వ్యవహారం జోరుగా సాగుతుంది. క్షేత్రస్థాయి సీనియర్ మెట్‌లు, టెక్నికల్ అసిస్టెంట్లు కుమ్మక్కై కూలీల నుంచి ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. ప్రతి కూలీ నుంచి పనులు చేయకుండానే వారానికి రూ.200 నుంచి రూ.300 వరకు వసూలు చేస్తున్నారు. హైదరాబాద్, బెంగళూరు, ఇతర ప్రాంతాల్లో ఉండే సాఫ్ట్‌వేర్ ఉద్యోగులకు, కూలీలకు మస్టర్లు వేసి వారి నుంచి సగం తీసుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. కొందరి నుంచి నేరుగా నగదు ముందుగా తీసుకొని మస్టర్లు వేస్తుండగా, కొందరి నుంచి ఆన్‌లైన్‌లో నగదు తెప్పించుకుంటున్నారు..!



కవలకుంట్లలో ఒకే బోగస్ ఫొటోలతో రెండు మస్టర్లకు పనులు చేసినట్లు కూలీలను చూపిన వైనం

నిబంధనలు ఇలా

ఉపాధి హామీ పథకం ప్రకారం ఒక చెరువును ఉపాధి హామీ పథకం ద్వారా పూడిక తీస్తే మూడేళ్ల పాటు ఆ చెరువులో ఎటువంటి పని చేయరాదు. కానీ అందుకు విరుద్ధంగా మండల అధికారులు అదే చెరువుల్లో పూడికతీత పనులతో పాత గుంతలకు కొత్త మెరుగులు ఇచ్చి కొలతలు చూపించి మస్టర్లు నమోదు చేస్తున్నారు. మండలంలో నిత్యం 3వేల మంది పేరుతో ఇలానే బోగస్ మస్టర్లు వేసి దోపిడీ చేస్తున్నారు. కొలతలు ప్రకారం ఒక క్యూబిక్ మీటరు పనిచేస్తే ఆ కూలీలకు రూ. 250 వరకు ఉపాధి వేతనం చెల్లించాలి. కాని ఇవేం పట్టకుండా టెక్నికల్ అసిస్టెంట్లు తమకు నగదు ముట్టజెప్పిన వారికి మస్టర్లు వేస్తున్నారు. దీనిలో సీనియర్ మేట్ నుంచి టీఏ, పైస్థాయి అధికారులకు నిత్యం వాటాలు అందుతున్నాయన్న ఆరోపణలున్నాయి. మండలంలోని దాదాపు అన్ని గ్రామాల్లో ఇదే తంతు నడుస్తోంది.

ఒకటే ఫొటో.. 747 మందికి మస్టర్లు

మండలంలోని కవలకంట పంచాయతీని పరిశీలిస్తే గత ఆదివారం 747 మందికి మస్టర్లు వేసినట్లు ఆన్‌లైన్‌లో చూపారు. అయితే ఆయా పనులకు సంబంధించి మొత్తం ఒకేవిధమైన ఫొటో అప్‌లోడ్ చేయగా, అది కూడా చెరువులో బురదలో పూడిక తీస్తున్నట్లు ఉంది. గ్రామంలోని తిమ్మారెడ్డి చెరువులో ఆ మేరకు పూడిక తీసినట్లు చూపారు. బురదతో కూడిన చెరువులో అంతమంది ఎలా పనిచేశారో అధికారులే సమాధానం చెప్పాలి. ఇక పనికి సంబంధించిన ఫొటోలో సైతం ఏడెనిమిది మందికి మించి లేరు. అయితే 747 మందికి మస్టర్లు ఎలా పడాయో..! లోగుట్టు ఆయా అధికారులే అర్థం చేసుకోవాలి. ఇలా ఈ ఒక్క పంచాయతీలోనే కాదు మండలంలోని అన్ని గ్రామాల్లో ఇదే మాయ కొనసాగుతోంది. ఆ మేరకు ఆన్‌లైన్‌లో చూస్తే సామాన్యులకు సైతం అర్థం అవుతుంది. ఇక అధికారులకు ఇవేమి తెలియకపోవడంలో ఉన్న అంతర్యాన్ని అర్థం చేసుకోవచ్చు. ఇలాంటి పూడికతీత పనులైతే రేపు సోషల్ అడిట్ నాటికి నీళ్లు చేరి ఉంటాయని కవర్ చేయవచ్చు. విచారణాధికారులు కూడా తమ వారే కాబట్టి ఏం ప్రమాదం ఉండదని ఉపాధి సిబ్బంది ధీమాగా ఉన్నారు.



పుల్లలచెరువు మండలం కవలటకుంట్లలో చెరువులో బురదలో కుడా ఉపాధి పనులు చేస్తున్నట్లు నటిస్తున్న కూలీలు

వారానికి రూ.20 లక్షల వసూలు

ఒక్క పుల్లలచెరువు మండలంలో మొత్తం 19 పంచాయతీలు ఉండగా ఆయా పంచాయతీలో అక్రమ మస్టర్ల ద్వారా రూ.20లక్షల వరకు అధికారులు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఈ లెక్కన నెలకు నెలకు రూ.80లక్షల వరకు సొమ్మును అధికారులు వాటాలు వేసుకొని పంచుకుంటున్నారు. ఈ విధంగా చూస్తే జిల్లాలోని మిగతా మండలాల్లో ఉపాధి హామీ పనులలో ఏ స్థాయిలో అవినీతి జరుగుతుందో అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికైనా ఈ అక్రమాలపై కలెక్టర్ విచారించి అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

కొలతలు తీయించి చర్యలు తీసుకుంటాం

ఈ విషయంపై మార్కాపురం ఏపీడీని వివరణ కోరగా పుల్లలచెరువు మండలంలో 200 వసూలు చేస్తున్నట్లు, అవినీతి ఆరోపణలు ఉన్నట్లు తన దృష్టికి రాలేదని చెప్పడం గమనార్హం. అయితే గ్రామాల్లో జరిగిన పనులపై కొలతలు తీయించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. వసూళ్లలో అవినీతి తనకు తెలియదన్నారు.

అతడంతే.. అపర కీచకుడు

- మారని సీనియర్ అసిస్టెంట్ ప్రవర్తన
- మహిళా ఉద్యోగులతో అసభ్య ప్రవర్తన
- ఫిర్యాదు చేసిన స్పందించని డివిజనల్ స్థాయి అధికారి
- భరించలేక జిల్లా అధికారులకు ఫిర్యాదు

మార్కాపురం, మే 21: 'ఎన్నిసార్లు ఉన్నతాధికారులు మందలించినా, శిక్షించినా ఆ మనిషి మారలేదు... అతని తీరూ మారలేదు.' మళ్లీ మళ్లీ అదే తప్పులు చేస్తున్నాడు. తన కార్యాలయంలో పనిచేసే తనకన్నా ఉన్నత, కింది స్థాయి ఉద్యోగినుల పట్ల అసభ్యగా ప్రవర్తిస్తున్నాడు. కొంతమేర భరించిన ఆ ఉద్యోగినులు స్థానికంగా ఉండే డివిజనల్ స్థాయి అధికారికి ఫిర్యాదు చేశారు. కానీ సీనియర్ అసిస్టెంట్‌కు ఉన్న రాజకీయ పలుకుబడితో ఆయన చర్యలు తర్వాత అసలు హెచ్చరించడానికి కూడా సాహసించలేదు. దీంతో సదరు బాధిత ఉద్యోగినులలో ఒకరు జిల్లా పంచాయతీ అధికారికి ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం ఆ ఫిర్యాదుపై విచారణ జరుగుతోంది.

మహిళా ఉద్యోగులతో అసభ్యకరంగా..

ప్రస్తుతం మార్కాపురం డివిజనల్ పంచాయతీ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా జి.శ్రీనివాసులు పనిచేస్తున్నాడు. అయన కార్యాలయంలో పనిచేసే మహిళా ఉద్యోగులతో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారని ఆరోపణలున్నాయి. అయన సీటుకన్నా ఉన్నత స్థానంలో ఉన్నా, కిందిస్థానంలో ఉన్నా.. అయన నుంచి వేధింపులు తప్పడం లేదు.. తొలుత అవసరం లేకపోయినా ఫైళ్లు అడగటం, ఫైళ్లు ఇస్తున్న సమయంలో చేతులు పట్టుకోవడం, ద్వంద్వ అర్థాలతో మాట్లాడటం చేసేవాడు. ముఖ్యంగా తన భర్త మరణించడం ద్వారా వచ్చిన ఉద్యోగాన్ని జాగ్రత్తగా చేస్తున్న ఓ మహిళా ఉద్యోగినిని ఆయన లక్ష్యంగా చేసుకున్నాడు.

చివరకు లాడ్జీకి రా అంటూ పిలిచేదాకా వచ్చాడంటే ఆయనకు ఉన్న రాజకీయ పలుకుబడి ఏస్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. మార్కాపురం డీఎల్‌పీవో కార్యాలయంలో పనిచేసే ఒక ఉన్నత స్థాయి ఉద్యోగిని శ్రీనివాసులు అరాచకాలు భరించలేక తనను వెంటనే బదిలీ చేయమని ఉన్నతాధికారులను వేడుకున్నారు.



డివిజనల్ పంచాయతీ కార్యాలయం

గతంలోనూ ఇంతే..

సదరు సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులు కందుకూరు డీఎల్‌పీవో, ఒంగోలు డీపీవో కార్యాలయాల్లో పనిచేశాడు. అక్కడ కూడా మహిళా ఉద్యోగులతో అసభ్యకరంగా ప్రవర్తించినట్లు ఆరోపణలుఉన్నాయి. తోటి ఉద్యోగులతో దురుసుగా ప్రవర్తించేవాడని బాధితులు తెలిపారు. కందుకూరు కార్యాలయంలో పనిచేస్తున్న సమయంలో సహచర ఉద్యోగులతో ఇలానే ఒక పర్యాయం ఘర్షణ పడ్డాడు.

దీంతో ఒంగోలుకు బదిలీ చేశారు. అక్కడ కూడా ఉద్యోగుల పట్ల అసభ్య ప్రవర్తన కారణంగా విచారణ చేపట్టిన అనంతరం కలెక్టర్ దినేష్‌కుమార్ కమిషనర్ కార్యాలయానికి సరెండర్ చేశారు. కోర్టు ఉత్తర్వులకు అనుగుణంగా తిరిగి జిల్లాలో ఉద్యోగానికి వచ్చాడు. అనంతరం శ్రీనివాసులు తనకున్న రాజకీయ పలుకుబడితో మార్కాపురం డీఎల్‌పీవో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా బాధ్యతలు స్వీకరించారు. నాటి నుంచి నేటి వరకు కార్యాలయాన్ని తన సామ్రాజ్యంగా భావిస్తున్నాడు. ఇక్కడ తాను చెప్పిందే వేదమని, తాను చెప్పిన మాట వినకుంటే ఉద్యోగాలకు సంబంధించి సర్వీసు నమోదులో తేడా ఉంటుందని భయపెట్టినట్లు మహిళా ఉద్యోగులు చెబుతున్నారు.

డీపీవోకు ఫిర్యాదు

కామాంధుడి అవతారమెత్తిన సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులు తమ పట్ల ఉన్న అనుచిత ప్రవర్తనపై జిల్లా పంచాయతీ అధికారి ఉషారాణికి ఉద్యోగినులలో ఒకరు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. దీంతో ఆ విషయంపై ప్రస్తుతం విచారణ సాగుతోంది.

ఆరోగ్యశ్రీ సేవలపై ప్రభుత్వ నిర్లక్ష్యం!

- జిల్లాలో భారీగా పేరుకుపోయిన బకాయిలు
- నెట్‌వర్క్ ఆస్పత్రులకు బకాయిలు రూ.50కోట్లకుపైనే
- చెల్లింపులు లేకపోవడంతో సేవలు నిలిపివేత
- ట్రస్ట్‌కు లేఖ ఇచ్చినా పట్టించుకోని వైనం

ఒంగోలు(కలెక్టరేట్), మే 21: ఆరోగ్యశ్రీ పథకాన్ని వైసీపీ ప్రభుత్వం అనారోగ్యశ్రీగా మార్చుతుందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. బకాయిల కోసం ఈనెల 22 నుంచి సేవలను నిలిపివేస్తున్నామని నెట్‌వర్క్ ఆస్పత్రులు ప్రకటించినా ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు కనీస స్పందన కరువైంది. గత నాలుగైదు నెలల నుంచి ఆరోగ్యశ్రీ బకాయిలను ప్రభుత్వం చెల్లించలేదు. బకాయిల కోసం అనేకసార్లు ఆస్పత్రుల యాజమాన్యాలు ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయినా పట్టించుకోకపోవడంతో విధి లేని పరిస్థితుల్లో ట్రస్ట్‌కు ఆరోగ్యశ్రీ సేవలను నిలిపివేస్తామని లేఖ ఇచ్చాయి. అయినా ఎటువంటి సమాధానం ఇవ్వని పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం పేదలకు గత ప్రభుత్వాల కంటే మెరుగైన వైద్యసేవలు అందిస్తుందని ప్రగల్భాలు పలికిన వైసీపీ ప్రభుత్వం నెట్‌వర్క్ హాస్పటల్స్‌కు బకాయిల చెల్లింపుల్లో తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించింది. భారీగా బకాయిలు పేరుకుపోవడంతో ఆ ఆస్పత్రుల యాజమాన్యాలు గగ్గోలుపెట్టడమే కాకుండా ఆరోగ్యశ్రీ సేవలను నిలుపుదల చేస్తామని ఇటీవలే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాయి. అయితే, బకాయిలను ఇస్తున్నట్లు నాలుగైదు నెలల క్రితం ప్రకటించినా అందులో నాల్గవ వంతు కూడా ఇవ్వలేదు. మరోవైపు పెరిగిన ధరలకు అనుగుణంగా తాము నిర్వహించే శస్త్రచికిత్సలకు ఆరోగ్యశ్రీ కింద అందించే మొత్తాలను పెంచాలని విజ్ఞప్తి చేసినా పట్టించుకోని పరిస్థితి ఏర్పడింది. జిల్లాలో 60కిపైగా నెట్‌వర్క్ హాస్పటల్స్‌కు రూ.50 కోట్లకుపైగా బకాయిలు చెల్లించాల్సి ఉంది. ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన రాకపోవడంతో ఏమిచేయాలో దిక్కుతోచని స్థితిలో ఆరోగ్యశ్రీ సేవలను నిలిపివేస్తున్నట్లు ప్రకటించినట్లు సమాచారం. గత ప్రభుత్వంలో ఎప్పటికప్పుడు బకాయిలు చెల్లింస్తుండగా వైసీపీ ప్రభుత్వం వచ్చాక చెల్లింపులు అనేది కష్టతరంగా మారింది. నెట్‌వర్క్ హాస్పటల్స్‌లో సేవలు నిలిపివేస్తే ప్రత్యామ్నాయంగా ఏర్పాట్లు చేసేందుకు కూడా యంత్రాంగం చర్యలు చేపట్టడం లేదు. ప్రభుత్వం నుంచి మంగళవారం కూడా ఈవిషయమై ఆరోగ్యశ్రీ పథకాన్ని పర్యవేక్షించే అధికారులకు ఎలాంటి సమాచారం రాలేదని తెలుస్తోంది.

పొగాకు కిలో రూ.322

- మార్కెట్లో కొనసాగుతున్న జోరు
- మీడియం, లోగ్రేడ్‌లకు భారీ డిమాండ్

ఒంగోలు, మే 21 (ఆంధ్రజ్యోతి): దక్షిణాది పొగాకు మార్కెట్లో అదే జోరు కొనసాగుతోంది. మేలురకం బేళ్ల గరిష్ఠ ధరలు మంగళవారం మార్కెట్లో ఏకంగా కిలో రూ.322 పలికింది. ఒంగోలు-2 వేలంకేంద్రంలో ఈ ధర లభించగా ఇతరచోట్ల కూడా గరిష్ఠ ధర రూ.312 నుంచి రూ.320 వరకు ఉంది. వారం క్రితం కిలో రూ.300లుగా ఉండగా శనివారం రూ.311 పలికింది. మంగళవారం కిలోకు మరో రూ.11 పెరిగి ఏకంగా రూ.322 లభించింది. పొగాకు బోర్డు చరిత్రలో దక్షిణాది వేలం కేంద్రాలలో ఈ స్థాయి ధర లభించడం ఇదే ప్రథమం. మార్కెట్లోకి ఇంకా కూడా మేలురకం బేళ్లు పరిమితంగానే వస్తుండగా వాటి కోసం బయ్యర్లు పోటీపడుతున్నారు. తదనుగుణంగా డిమాండ్ లభించి గరిష్ఠ ధరలు పెరుగుతున్నాయి. ఇదిలా ఉండగా మంగళవారం మార్కెట్లో మీడియం, లోగ్రేడ్‌లకు కూడా భారీ డిమాండ్ కనిపించింది. మీడియంగా భావించే ఎఫ్-3 రకం ధర ఇంచుమించు మేలురకంతో పోటీపడుతూ కిలో రూ.310పైనే పలికింది. అదే సమయంలో లోగ్రేడ్‌లో నాణ్యమైనదిగా భావించే బ్రౌన్, అలాగే చిలకపచ్చ రకం బేళ్లను కిలో రూ.280పైగా ధరలు లభిస్తున్నాయి. ఇక లోగ్రేడ్‌లో తక్కువ రకం బేళ్లకు కూడా కిలో రూ. 205నుంచి రూ.220 వరకు పలుకుతున్నాయి. అయితే పొగాకు మార్కెట్లో దిగ్గజ కంపెనీలుగా పేరున్న వారి కన్నా డీలర్లు, మధ్యస్థాయి కంపెనీల బయ్యర్లు అధికంగా ఈ ధరలకు కొనుగోలు చేస్తున్నారు. కాగా ఈ సీజన్‌లో ఇప్పటివరకు దక్షిణాది వేలంకేంద్రాలలో సుమారు 52 మిలియన్ కిలోల కొనుగోళ్లు జరగ్గా సగటున కిలోకు రూ.243 ధర లభించింది. ఈ స్థాయి గరిష్ఠ ధరలు అలాగే సగటు ధరలు గతంలో ఎన్నడూ లేకపోగా ప్రస్తుత మార్కెట్ పొకడ చూస్తే సగటు ధరలు మరింత పెరుగుతాయని తెలుస్తోంది.

ఓట్ల లెక్కింపు కోసం అబ్జర్వర్లు నియామకం

ఒంగోలు(కలెక్టరేట్), మే 21: పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు కోసం అబ్జర్వర్లను నియమిస్తూ ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీచేసింది. వివిధ రాష్ట్రాలకు చెందిన సీనియర్ అధికారులను నియోజకవర్గాల వారీగా ఓట్ల లెక్కింపు కోసం ప్రత్యేక అధికారులుగా నియమించింది. ఈనెల 13న పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాలకు పోలింగ్ జరిగిన నేపథ్యంలో రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో పెద్దఎత్తున గొడవలు జరిగిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో వచ్చేనెల 4వతేదీన ఓట్ల లెక్కింపు జరగనున్న నేపథ్యంలో నియోజకవర్గాల వారీగా జరిగే ఓట్ల లెక్కింపు కోసం పలు రాష్ట్రాలకు చెందిన సీనియర్ అధికారులను పరిశీలకులుగా నియమించారు.

డాక్టర్ బాపు గోపినాథ్ పవర్ (సంతనూతలపాడు), మయూర్ కే మెహత(వైపాలెం), డాక్టర్ గుంజం సోని(దర్శి), డాక్టర్ అరవింద్‌కుమార్ (ఒంగోలు), డాక్టర్ ఐ.ఆనంద్‌కుమార్(కొండపి), ఆనిమేష్.డి(మార్కాపురం), ఆల్బినోలిన్ మోలాంగ్(గిద్దలూరు), బిరేంద్ర.కే(కనిగిరి)లను నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

టీడీపీకి ఓటు వేశారని... నీళ్ల ట్యాంకర్ల సరఫరా నిలిపివేత

మార్కాపురం రూరల్, మే 21: 'మీరు మా పార్టీకి ఓటు వేయలేదు. మీకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా ఎందుకు చేయాలి ' అని టీడీపీకి ఓటు వేశారని భావిస్తున్న వారిపై వైసీపీ నాయకులు వివక్షత చూపుతున్నారు. గ్రామాలలో ఎక్కడైనా నీటి సమస్య ఉంటే అక్కడికి ప్రభుత్వ అధికారులు అక్కడ నీటి సమస్యలను తీర్చాలి. కానీ వైసీపీ నాయకుల ఆదేశాల ప్రకారం గ్రామాలలో ప్రభుత్వం ద్వారా సరఫరా చేస్తున్న నీటి ట్యాంకర్లను టీడీపీ మద్దతుదారుల వద్దకు రాకుండా చూస్తున్నారు. మండలంలోని నాయుడుపల్లి, పెద్దయాచవరం గ్రామాలలోని ఎస్సీ కాలనీలలో టీడీపీకి ఓటు వేశారని వారి ప్రాంతాలకు నీటి సరఫరా చేయడం లేదని వాపోతున్నారు. ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ వారి నుంచి ఎటువంటి స్పందన లభించలేదని ప్రజలు వాపోయారు. ప్రభుత్వం ట్యాంకర్ల ద్వారా సరఫరా చేసే నీటిని సమస్య ఉన్న అన్ని ప్రాంతాలకు అందించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ప్రత్యేక అవసరాల పిల్లల సర్వే నిర్వహించాలి

ఒంగోలు(విద్య), మే 21: జిల్లాలో ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులను గుర్తించేందుకు సర్వే నిర్వహించి వారిని 2024-25 విద్యా సంవత్సరానికి సమీపంలోని పాఠశాలలో చేర్పించాలని భవిత కేంద్రాల్లో పనిచేస్తున్న సహిత విద్యా రిసోర్స్ పర్సన్లను జిల్లా విద్యాశాఖాధికారి డి.సుభద్ర మంగళవారం ఆదేశించారు. 21 రకాల ప్రత్యేక అవసరాల పిల్లలను గుర్తించి వారి వివరాలను తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేయించాల న్నారు.

మండలంలోని గ్రామాలను రెండు క్లస్టర్లుగా విభజించి మండలంలోని సహిత విద్యా రిసోర్స్‌పర్సన్లకు కేటాయించారు. రిసోర్స్‌పర్సన్లు తమకు కేటాయించిన క్లస్టరు పరిధిలోని గ్రామాలను సందర్శించి సర్వే నిర్వహించాలని, మండల విద్యాధికారులు ఈ సర్వేను పర్య వేక్షించాలని సూచించారు. 20 రోజుల పాటు జరిగే ఈ సర్వే వివరాలను ఎప్పటికప్పుడు సమగ్ర శిక్ష జిల్లా ప్రాజెక్టు కార్యాలయానికి తెలియజేయాలన్నారు. సర్వే అనంతరం పిల్లల గుర్తింపు, పాఠశాలల్లో నమోదు పూర్తయిన తర్వాత వివరాలను నిర్ణీత ప్రొఫార్మాలో మండల విద్యాధికారి సంతకంతో సమగ్ర శిక్ష జిల్లా కార్యాలయానికి పంపించాలని ఆదేశించారు.

230 మంది గుర్తింపు..

జిల్లావ్యాప్తంగా ఇప్పటి వరకు 230 మంది ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులను గుర్తించినట్లు జిల్లా సహిత విద్యా కోఆర్డినేటర్ ఎం.రమేష్ తెలిపారు. సర్వేలో భాగంగా రమేష్ మంగళవారం ఒంగోలులోని గద్దలగుంటలోని దివ్యాంగరాలు ఇంటిని సందర్శించారు. భవిత కేంద్రాల్లో దివ్యాంగులకు లభిస్తున్న ప్రత్యేక సదుపాయాలు, సేవలు గుర్తించి తల్లిదండ్రులకు వివరించారు. కార్యక్రమంలో సహిత విద్యా రిసోర్స్ టీచర్లు పాల్గొన్నారు.

కౌంటింగ్ ఏర్పాట్లను వేగవంతంగా పూర్తి చేయాలి

ఒంగోలు(కలెక్టరేట్), మే 21 : వచ్చేనెల 4వతేదీన జరగనున్న ఓట్లలెక్కింపునకు అవసరమైన కౌంటింగ్ కేంద్రాల పనులను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా ఎన్నికల అధికారైన జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. ఒంగోలు సమీపంలోని రైజ్ ఇంజనీరింగ్‌లో జరుగుతున్న పనులను మంగళవారం రాత్రి దినేష్‌కుమార్ పరిశీలించారు. ఇదే ప్రాంగణంలో కౌటింగ్ కూడా ఉన్నందున ఆదిశగా చర్యలు తీసుకోవాలన్నారు.

ఓట్ల లెక్కింపు గదుల వద్ద సిబ్బందికి, రాజకీయ పార్టీల ఏజెంట్లకు వేరువేరుగా బ్యారీకేడ్లు ఏర్పాటు చేయాలన్నారు. ఓటల లెక్కింపు విధులలో పాల్గొనే సిబ్బందికి శిక్షణ కార్యక్రమాన్ని ఈ ప్రాంగణంలోనే గురువారం నిర్వహించనున్నట్లు తెలిపారు. టేబుల్స్ ఏర్పాటు చేసే విషయంలో అధికారులకు పలు సూచనలను చేశారు. కలెక్టర్ వెంట డిఆర్వో శ్రీలత, ఒంగోలు లోక్‌సభ నియోజకవర్గ ఏఆర్వో ఝాన్సీ లక్ష్మి, గిద్దలూరు ఆర్వో డి.నాగజ్యోతి, ఎన్నికల విభాగ సూపరిటెండెంట్ శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు



మాట్లాడుతున్న ఏఎస్పీ విఠలేశ్వర్

పార్టీల ప్రతినిధులు సంయమనం పాటించాలి

ఏఎస్పీ విఠలేశ్వర్

చీరాలటౌన్, మే 21 : ఓట్ల లెక్కింపు ముందు, అనంతరం అన్ని పార్టీల ప్రతినిధులు సంయమనం పాటించి శాంతి వాతావరణం ఉండేలా సహకరించాలని ఏఎస్పీ టీపీ విఠలేశ్వర్ విజ్ఞప్తి చేశారు. ఎస్పీ ఆదేశాల మేరకు మంగళవారం చీరాల వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో సమావేశంలో నిర్వహించారు. ఈసందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా హింసాత్మక ప్రాంతాలను గుర్తించామని, ప్రత్యేక నిఘా, పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అలాగే పలు ఘటనలకు సంబంధించి అనేక మందిపై కేసులు నమోదు చేసినట్లు వివరించారు. కౌంటింగ్ అనంతరం విజయోత్సవాలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. ఇందుకు భిన్నంగా వ్యవహరిస్తే కఠినమైన కేసులతో పాటు జిల్లా బహిష్కరణ ఉంటుందని హెచ్చరించారు. సమావేశంలో వన్‌టౌన్ సీఐ శేషగిరిరావు, టూటౌన్ సీఐ సోమశేఖర్, ఎస్ఐ వెంకటేశ్వర్లు, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఊరించి.. ఉసూరుమనిపించి..!

- లోగ్రేడ్ ధరకే పరిమితమైన నాణ్యమైన పొగాకు
- ఆందోళనలో వైట్‌బర్లీ రైతులు
- ధర కోసం ఎదురుచూపు



పర్చూరులో అమ్మకానికి సిద్ధంగా ఉన్న పొగాకు

పర్చూరు, మే 21 : ఒక పక్క ప్రకృతి వైపరీత్యాలు, మరో పక్క వాతావణ పరిస్థితులు, అధిక పెట్టుబడులు వెరసి రైతులను కలవరానికి గురిచేస్తున్నాయి. వేలకు వేల పెట్టుబడులు పెట్టి సాగు చేసుకున్న రైతులకు సరైన ధరలేకపోవడంతో నష్టాలపాలు కావాల్సిన దుస్థితి నెలకొంది. దీంతో ఏమిచేయాలో పాలుపోని స్థితిలో రైతులు ఉన్నారు. పర్చూరు వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో వేల ఎకరాల్లో సాగు చేసుకున్న వైట్ బర్లీ పొగాకు రైతులు పరిస్థితి అగమ్య గోచరంగా తయారైంది. పంట చేతికి వచ్చిన తరుణంలో లోగ్రేడ్ పొగాకు క్వింటాకు రూ.14వేలు పైచిలుకు పలకడంతో సాగుచేసుకున్న రైతులకు ఎంతో ఊరటనందించింది. దీంతో నాణ్యమైన వైట్‌బర్లీ పొగాకుకు మంచి ధర పలుకుతుందని ఆశపడ్డారు. ఆశ కాస్త అడి ఆశగా ప్రస్తుత పరిస్థితి నెలకొంది. లోడ్ గ్రేడ్ ధరకు మించి నాణ్యమైన పొగాకు కొనుగోలు జరగడం లేదు. దీంతో ఏమిచేయాలో పాలుపోని స్థితిలో అన్నదాతలు ఉన్నారు. ఎన్నికల నేపథ్యంలో కొనుగోలుదారులు ముందుకు రావడం లేదని రైతులు అనుకున్నారు. ఎన్నికలు ముగిసినా ధరల పెరుగుదలలో మార్పులేకపోవడం, కొనుగోళ్లు కూడా మందకుడిగా సాగడంతో రైతుల్లో నైరాశ్యం నెలకొంది. మరో పక్క వర్షాల నేపథ్యంలో చేతికి అందివచ్చిన పంట దెబ్బతింటుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. బహిరంగ మార్కెట్‌లో వైట్‌బర్లీ పొగాకుకు నాణ్యమైన ధర ఉన్నా వ్యాపారులు సిండికేట్‌గా మారడం వల్లే ధరలు ఇలా దిగజారుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరో పక్క వ్యవసాయ సీజన్ సమీపిస్తుండడంతో పెట్టుబడుల కోసం విక్రయాలు చేయాల్సి వస్తుందని రైతులు అంటున్నారు.

ధరపైనే రైతుల ఆశ

ప్రస్తుతం వ్యవసాయ ఖర్చులు, నామమాత్రపు దిగుబడుల నేపథ్యంలో ధర అనుకూలంగా ఉంటేనే పెట్టిన పెట్టుబడులు వచ్చే పరిస్థితి. గత ఏడాది వ్యవసాయ సీజన్ ముగిసే సమయంలోనాణ్యమైన పొగాకు క్వింటా రూ.18వేలకు కొనుగోలు చేశారు. దీంతో ఈఏడాది కూడా అనుకున్న మేర ధర ఉంటుందన్న ఆశతో రైతులు వ్యయ ప్రయాశలకోర్చి వేల ఎకరాల్లో వైట్‌బర్లీ పొగాకును సాగు చేశారు. ప్రస్తుతం ఉన్న ధరలతో రైతుల్లో నైరాశ్యం నెలకొంది.



సర్వేను పరిశీలిస్తున్న ఎంఈవో రమేష్

వైకల్య విద్యార్థుల సర్వే

బల్లికురవ, మే 21 : ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థుల కోసం భవిత కేంద్రం అందుబాటులో ఉందని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ఎంఈవో రమేష్ తెలిపారు. మంగళవారం బల్లికురవ మండలంలోని పలు గ్రామాలలో పూర్తి వైకల్యం ఉన్న విద్యార్థుల గుర్తింపునకు భవిత కేంద్రం సిబ్బంది చేస్తున్న సర్వేను ఎంఈవో పరిశీలించారు. ఈ సందర్భంగా మండలంలో ఇప్పటికే ఆరేళ్ల నుంచి 18 ఏళ్ల వయస్సు ఉన్న విద్యార్థులు 134 మంది ఉండగా కొత్తగా మరో 34 మంది తమ సర్వేలో నమోదయ్యారని, వారందరికీ ప్రభుత్వం నుంచి వచ్చే పలు రకాల రాయతీలను అందిస్తామన్నారు. బల్లికురవ ప్రాథమిక పాఠశాల ఆవరణలో భవిత కేంద్రం ఉందని ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులను అక్కడికి పంపిస్తే మిగతావారితో సమానంగా విద్యను అందిస్తామన్నారు. మంచంపై కదలలేని స్థితిలో ఉన్న విద్యార్థుల ఇళ్లకు వచ్చి విద్యను అందించేలా ఏర్పాట్లు చేస్తున్నామని ఎంఈవో తెలిపారు. గ్రామాల్లో ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులు ఉంటే వెంటనే భవిత కేంద్రానికి సమాచారం ఇవ్వాలని ఎంఈవో సూచించారు. ఈసర్వేలో ఐఈఆర్‌పీఎస్ పి.నాగబాబు, జి.నాజిని పాల్గొన్నారు.

బాలాజీ కుటుంబానికి అండగా ఉంటాం

చీరాలటౌన్, మే 21 : మత్స్యకారుడి మృతి ఆ కుటుంబానికి తీరనిలోటని తప్పక వారికి అండగా ఉంటామని చీరాల కాంగ్రెస్ అభ్యర్థి ఆమంచి కృష్ణమోహన్ అన్నారు. సోమవారం ద్విచక్ర వాహనం అదుపుతప్పి వేటపాలెం మండలం ఊటుకూరి సుబ్బయ్యపాలెంకు చెందిన ఊటుకూరి బాలాజీ(55) మృతి చెందారు. చీరాల ఏరియా హాస్పిటల్‌లో ఉన్న మృతదేహాన్ని మంగళవారం ఆమంచి పరిశీలించారు. ఘటన వివరాలు అడిగి తెలుసుకున్నారు. అండగా ఉంటామని, కుటుంబానికి మనోధైర్యాన్ని ఇచ్చారు. ఆయన వెంట పలువురు నాయకులు, వర్గీయులు ఉన్నారు.

వేసవి శిక్షణను వినియోగించుకోవాలి



శిక్షణ ఇస్తున్న ఉపాధ్యాయుడు శ్రీబాబు

చినగంజాం, మే 21 : శాఖ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలను విద్యార్థులు వినియోగించుకోవాలని గ్రంథపాలకులు ఎ.మోహనలక్ష్మీనరసింహాచార్యులు అన్నారు. శాఖ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాలు ఉల్లాసంగా, ఉత్సహంగా సాగుతున్నాయి. వివిధ విభాగాల్లో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతులు విద్యార్థులు వినియోగించుకునేలా తల్లిదండ్రులు ప్రొత్సహించాలని గ్రంథపాలకులు కోరారు. వేసవి శిక్షణ తరగతులలో భాగంగా విద్యార్థులకు తెలుగు ఉపాధ్యాయుడు పి.శ్రీబాబు చేతిరాత, తెలుగు భాష, భావ వ్యక్తీకరణ, వై.రామాంజనేయులు కంప్యూటర్‌పై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వెంకయ్య ఆశ్రమానికి నిత్యావసరాల పంపిణీ

మార్టూరు, మే 21: విజయనగర్ కాలనీలో వెంకయ్య ఆశ్రమానికి మంగళవారం ఉపాధ్యాయుడు గరిమిడి శ్రీనివాసరావు దంపతులు పెళ్లిరోజు సందర్భంగా, రోటేరియన్ బీ అశ్వనీకుమార్ పుట్టినరోజు సందర్భంగా నిత్యవసర సరుకులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రోటరీ సభ్యులు సాంబశివరావు, రావి అంకమ్మ చౌదరి, నాగేశ్వరరావు, కాజా హుస్సేన్, జాష్టి సాంబ శివరావు, కొర్రపాటి కాజారావు చెరుకూరి అంజి బాబు పాల్గొన్నారు.

అందుబాటులో పచ్చిరొట్ట ఎరువులు

పర్చూరు, మే 21 : రైతులకు అవసరమైన పచ్చిరొట్ట ఎరువులు సబ్సిడీపై అందజేసేందుకు రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నట్లు వ్యవసాయాధికారి ఎస్.రామమోహన్‌రెడ్డి మంగళవారం ప్రకటనలో తెలిపారు. పచ్చిరొట్ట ఎరువులు వాడకం వల్ల భూమి సారవంతం అవుతుందని తద్వారా నాణ్యమైన దిగుడులు పొందేందుకు ఎంతగానో దోహద పడుతుందన్నారు. 50 శాతం సబ్సిడీపై అందించే విధంగా భరోసా కేంద్రాల్లో సిద్ధం చేసినట్లు చెప్పారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

రోటరీ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ



మజ్జిగను పంపిణీ చేస్తున్న వైద్యులు, రోటరీ సభ్యులు

అద్దంకిటౌన్, మే 21 : సామాజిక కార్యక్రమాలల్లో రోటరీ క్లబ్ సేవలు అభినందనీయమని సీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శరత్‌కుమార్ అన్నారు. మంగళవారం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలలో రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో పేదలకు తమ వంతు సాయంగా వైద్యశాలలోని రోగులకు విశ్రాంత ఉపాధ్యాయిని యనమండ్ర వరలక్ష్మి సౌజన్యంతో ఉచితంగా మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారులతో పాటు రోటరీ సెక్రటరీ చప్పిడి వీరయ్య, రోటరీ అసిస్టెంట్ గవర్నర్ అద్దంకి లేవి ప్రసాద్, షేక్ మహమ్మద్ రఫీ, జ్యోతి చంద్రమౌళి, మాలాది శ్రీనివాసరావు, తమ్మ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేర నియంత్రణకు సహకరించండి

రామాపురం(చీరాలటౌన్), మే 21 : చీరాల పరిధిలో నేరాల నియంత్రణకు లాడ్జి నిర్వాహకులు, రిసార్ట్స్ నిర్వాహకులు సహకరించాలని రూరల్ సీఐ సత్యనారాయణ అన్నారు. మంగళవారం రాత్రి వాడరేవు, రామాపురం ప్రాంతాల్లోని నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో అల్లర్లు జరిగే అవకాశం ఉందన్నారు. ఈనేపథ్యంలో నియోజకవర్గంపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు చెప్పారు. అందుకు సంబంధించి అనుమానితులను గుర్తిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఆధారాలు లేకుండా రూములు అద్దెకు ఇవ్వరాదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సైలు శివకుమార్, సురేష్, లాడ్జి, రిసార్ట్స్ నిర్వాహకులు పాల్గొన్నారు.



నిర్వాహకులతో మాట్లాడుతున్న రూరల్ సీఐ సత్యనారాయణ



క్రీడా ప్రాంగణంలో సేద తీరుతున్న పశువులు

నిరుపయోగంగా క్రీడా ప్రాంగణం

- టీడీపీ హయాంలో ఏర్పాటు
- వైసీపీ వచ్చాక పట్టించుకోని వైనం
- అందుబటులోకి తేవాలని క్రీడాకారుల విజ్ఞప్తి

పర్చూరు, మే 21 : గ్రామీణ క్రీడాకారులకు శిక్షణను అందించి జాతీయ స్థాయిలో వారు రాణించేలా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో గత తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో ఎన్టీఆర్ క్రీడా వికాశం పేరుతో రూ.2కోట్ల పైచిలుకు నిధులతో ప్రాంగణాన్ని నిర్మించారు. అయితే తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ దీనిని పట్టించుకోకపోవడంతో ప్రారంభానికి నోచుకోలేదు. ఏళ్ల తరబడి ఎలాంటి అలానా పాలనకు నోచుకోక నిరుపయోగంగా మారింది. భవనం చుట్టూ చిల్లచెట్లు, ముళ్ల పొదలు అలముకున్నాయి. ఈలోపు ఎన్నికల పుణ్యమా అని అధికారుల కన్ను పడింది. క్షణాల్లో ఆగమేఘాలమీద క్రీడా ప్రాంగణాన్ని వినియోగంలోకి తీసుకొచ్చి ఎన్నికల విధులకు సంబంధించిన శిక్షణ, సమావేశాలను ఈ భవనంలో నిర్వహించుకున్నారు. దీంతో క్రీడా ప్రాంగణం అధికారులతో కళకళలాడింది. ఎన్నికలు ముగియడంతో యధారాజా తదా ప్రజా అన్నట్లు పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చింది. ప్రస్తుతం పశువులతో ప్రాంగణం దర్శనమిస్తోంది. ప్రాంగణంలో పశువులను తోలడంపై క్రీడాకారులు ఆవేదన వ్య క్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దీనిపై దృష్టిసారించి కోట్ల రూపాయల ప్రభుత్వ నిధులతో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాన్ని వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు. అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు

విశేష అలంకరణలో భీమలింగేశ్వరస్వామిఅమ్మవారు





పంగులూరు, మే 21 : పంగులూరులో శ్రీ భీమలింగేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. రెండవరోజు మంగళవారం వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా వేద పండితులు శాస్త్రోక్తంగా కార్యక్రమాలు నిర్వహించారు. స్వామివారి కల్యాణం సందర్భంగా స్వామి అమ్మవారికి విశేషాలంకరణ గావించారు. ఉదయం నిత్యోపాసన, బలిహరణ, గ్రామోత్సవం, మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అమ్మవారి కుంకుమార్చన, స్వామివారిని పెళ్లి కుమారునిచేసే కార్యక్రమలు శాస్త్రోక్తంగా జరిగాయి. సాయంత్రం ఆలయ బలిహరణ, గ్రామోత్సవం అనంతరం రాయబారం గావించి స్వామివారి దివ్య కల్యాణోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. భక్తులు స్వామివారి దివ్య కల్యాణ మహోత్సవాన్ని తిలకించి పులకించారు. రాయబారం కార్యక్రమ వ్యాఖ్యాతగా శ్రీమాన్ నకరికంటి గోపి శరవణశర్మ వ్యవహరించగా, బ్రహ్మశ్రీ శైవాగమ పండితులు పేటేటి ఉదయభాస్కర శర్మ నేతృత్వంలో కార్యక్రమాలు జరిగాయి. కార్యక్రమాలలో ఆలయ ఈవో ఉప్పలమర్తి శ్రీనివాసరావు, అర్చక స్వాములు చందలూరి సునీల్‌కుమార్ శర్మ, కారంచేటి సాంబశివరావులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

1న శ్రీ వీరాంజనేయస్వామి తిరునాళ్ల

మార్టూరు, మే 21 : మండల పరిధి బొబ్బేపల్లి, రాజుగారిపాలెం గ్రామాల మధ్య కొండపై వెలసిన శ్రీవీరాంజనేయస్వామి తిరునాళ్లను వచ్చే నెల 1వ తేదీ శనివారం నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఈ నెల 29వ తేదీ నుంచి దేవస్థానంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. అనంతరం 1వ తేదీన శ్రీ సువర్చలా సహిత వీరాంజనేయస్వామి కల్యాణం నిర్వహిస్తామన్నారు. అదే రోజు రాత్రి కోలాటం, ఎడ్ల బల ప్రదర్శన, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

నూతన భవనం నుంచి విధులు



విధులు నిర్వహిస్తున్న సుభద్ర

అద్దంకి, మే 21 : శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం అధికారులు, సిబ్బంది మంగళవారం నుంచి నూతన భవనంలో విధుల నిర్వహణను ప్రారంభించారు. ఈవో, అసిస్టెంట్ కమిషనర్ సుభద్ర మంగళవారం ప్రత్యేక పూజల అనంతరం నూతన భవనంలో విధులు నిర్వహణ ప్రారంభించారు. ఇప్పటి వరకు దేవాలయం ప్రాంగణంలో ఉన్న ఇరుకు గదులలో అధికారులు, సిబ్బంది విధులు నిర్వహిస్తున్నా రు. దక్షిణ రాజగోపురం ఎదురు అన్నదాన మండపం పక్కన ఉన్న నూతన భవనంలోకి మంగళవారం మార్పు చేశారు.

ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని రద్దు చేయాలి



మాట్లాడుతున్న ప్రతినిధులు

చీరాలటౌన్, మే 21 : ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన భూహక్కు చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సీనియర్ సిటిజన్స్ కార్యాలయంలో ల్యాండ్ టైటిలింగ్ చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఈ చట్టం అమలు జరిగితే భూ హక్కులు రాజకీయ నాయకుల చేతుల్లోకి వెళ్లిపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటికే వ్యతిరేకత ఉన్నట్లు చెప్పారు. వెంటనే దీనిని రద్దు చేసి ప్రజలకు, భూ హక్కుదారులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమం లో ఏఐటీయూసీ నాయకులు బత్తుల శామ్యేల్, సీఐటీయూ నాయకులు వసంతరావు, హేమసుందరరావు, పుష్పరాజ్, వాసు, మాచర్ల మోహన్‌రావు, కోటేశ్వరరావు, వెంకటేశ్వర్లు, కట్టా రాజీవినయ్‌కుమార్, మేడా వెంకటరావు, హరిహరరావు పాల్గొన్నారు.

నేడు లక్ష్మీనరసింహస్వామి తిరునాళ్ల

స్వామివారి శాంతి కల్యాణం



ప్రత్యేక అలంకరణలో శ్రీలక్ష్మీ నరసింహస్వామి, అమ్మవారు



పంచముఖ ఆంజనేయస్వామి

మార్టూరు, మే 21 : మండలంలోని బొల్లాపల్లి గ్రామంలో బుధవారం శ్రీలక్ష్మీనరసింహస్వామి 33వ తిరునాళ్ల వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఏటా గ్రామంలో ప్రజలు స్వామి వారి తిరునాళ్లను నిర్వహించడం ఆనవాయితీ. అందులో భాగంగా ఈ ఏడాది కూడా తిరునాళ్లను వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ తిరునాళ్లకు గ్రామానికి చెందిన వారు ఇతర ప్రాంతాలలో నివసించేవారు తప్పని సరిగా కార్యక్రమానికి వస్తారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి ఇంటా బంధువులతో స్నేహితులతో పండుగ వాతావరణం, సందడి కనిపిస్తుంది. మంగళవారం నుంచి ప్రారంభమైన తిరునాళ్ల కార్యక్రమంలో భాగంగా ఉదయం దేవస్థానంలో హరినామ సంకీర్తన, ప్రత్యేక పూజలు తదితర కార్యక్రమాలను నిర్వహించారు. బుధవారం ఉదయం గ్రామంలోని కొండపై వేంచేసి ఉన్న లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానంలో ఉదయం 9 గంటలకు స్వామి వారి శాంతి కల్యాణం నిర్వహిస్తారు. ఆలయంలో ఉన్నలక్ష్మీ నరసింహస్వామి ఉత్సవ విగ్రహాలకు అర్చకులు ముప్పాళ్ల ప్రసాద్ ఆధ్వర్యంలో స్వామి వారి కల్యాణం నిర్వహిస్తారు. ఈ స్వామి వారి కల్యాణం తిలకించడానికి గ్రామంలోని ప్రజానీకం అందరూ కొండ పైకి వెళ్లి దేవస్థానంలో పూజా కార్యక్రమంలో పాల్గొంటారు. అదేవిధంగా కొండ పైన దేవస్థానం ఆవరణలో పంచ ముఖ నిలువెత్తు ఆంజనేయస్వామి విగ్రహం భక్తులను విశేషంగా ఆకట్టుకుంటుంది. మహిళలు ఈ విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు చేసి స్వామి వారి ఆశీస్సులను అందుకుంటారు. స్వామి వారి కల్యాణం అనంతరం మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేస్తారు. సాయంత్రం 6 గంటలకు గ్రామంలో కల్యాణం జరుపుకున్న శ్రీలక్ష్మీ నర సింహస్వామి దంపతుల ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో భక్తులు వెంటరాగా గరుడోత్సవం నిర్వహిస్తారు. కార్యక్రమానికి లో భక్తులు, గ్రామస్థులు విశేషంగా తరలిరావాలని ఆలయ కమిటీ సభ్యులు కోరుతున్నారు.



ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న భక్తులు

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

పావులూరు (ఇంకొల్లు), మే 21 : ఇంకొల్లు మండంలోని పావులూరు శ్రీ పొలిమేర వీరాంజనేయస్వామి తిరునాళ్ల మంగళవారం ప్రారంభమైంది. తొలిరోజు స్వామివారికి భక్తులు ప్రత్యేక పూజలు చేసారు. అంకరార్పణ, అఖండ కలశ స్థాపన కార్యక్రమాలతో శ్రీహనుమాన్ జయంతి ఉత్సవాలు వైభవంగా మొదలయ్యాయి. వీరాంజనేయస్వామి దేవాలయాన్ని విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. ఉదయం నుంచి భక్తులు తరలివెళ్లి స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. వచ్చే భక్తుల సౌకర్యార్థం పలు స్వచ్ఛంద సేవా సంస్థలు మజ్జిగ, తాగునీరు, అన్నదానం నిర్వహించారు. మంగళవారం ప్రారంభమైన తిరునాళ్ల బుధ, గురువారం జరుగుతుంది. చివరిరోజు గురువారం జరిగే తిరునాళ్లకు చుట్టుపక్కల మండలాల నుంచి వేలాదిగా తరలివచ్చే భక్తుల సౌకర్యార్థం ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా తగు చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్సై మల్లికార్జునరావు తెలిపారు.



దుకాణంలో తనిఖీలు చేస్తున్న అధికారులు

విత్తనాల షాప్‌లో సోదాలు

రెండు రకాల సీడ్స్ అమ్మకాల నిలిపివేత

ఇంకొల్లు, మే 21 : ఇంకొల్లులో శ్రీహనుమాన్ సీడ్స్ అండ్ పెస్టిసైడ్స్ షాపులో విజిలెన్సు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, వ్యవసాయాధికారులు మంగళవారం సోదాలు చేశారు. రెండు కంపెలనీలకు చెందిన రెండు రకాల ఉత్పత్తులకు సో ర్స్ సర్టిఫికెట్ లేనందున దుకాణంలోని 28 కేజీల విత్తనాలు సుమారు రూ.3,36,388 విలువ కలిగిన వాటి అమ్మకాలను నిలిపివేశారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వ్యవసాయాధికారి కే రమణకుమార్ మాట్లాడుతూ ఎవరైనా అనుమతి లేకుండా, నకిలీ విత్తనాలు అమ్మితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీలలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఎం.రామచంద్రయ్య, వ్యవసాయాధికారి వేణుగోపాల్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. ప్రతి రైతు విత్తనాలు కొనేటప్పుడు దుకాణదారుడు నుంచి కచ్చితంగా బిల్లు తీసుకోవాలని వేణుగోపాల్ సూచించారు.

ఎవరి వద్దా లంచాలు తీసుకోలేదు



మాట్లాడుతున్న ఎంపీపీ ప్రసన్నకుమారి

మేదరమెట్ల, మే 21 : తాము ఎవరివద్దా లంచాలు తీసుకోలేదని, తమపై అనవసరంగా వివాదం చేస్తున్నారని, తప్పుడు కేసులు పెట్టడానికి ప్రయత్నించారని ఎంపీపీ సాధినేని ప్రసన్నకుమారి అన్నారు. మంగళవారం కొరిశపాడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి ఆమె అధ్యక్షతన వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ పనులు చేయకుండా ఏ ఒక్కరికీ బిల్లులు చెల్లించలేదని, తమపై అనవసరంగా నిందలు వేస్తున్నారన్నారు. ఇటువంటి విమర్శలు బాధిస్తాయన్నారు. కొంతమంది అధికారులు మండల అభివృద్ధిలో భాగం కాగా మరికొంత మంది వివాదం సృష్టిస్తున్నారన్నారు. కోరం లేకపోవడంతో మండల పరిషత్ సమావేశం వాయిదా వేస్తున్నట్లు ఆమె ప్రకటించారు. సమావేశానికి ఎం పీపీతో పాటు నలుగురు ఎంపీటీసీలు హజరు కావడంతో సమావేశం వా యిదా వేశారు. వేసవిలో తాగునీటి సమస్యలు వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులు, తోలకరిలో రైతులకు అందించాల్సిన పచ్చిరొట్ట వివరాలు కానీ సమావేశంలో చర్చించకపోవడంపై ప్రజాప్రతినిధుల తీరును మం డల ప్రజలు ఆక్షేపిస్తున్నారన్నారు. సమావేశానికి జడ్పీటీసీ సభ్యుడు తుళ్లూరి వెంకటరమణ, తహసీల్దార్ బి.సుశీలా, ఎంపీడీవో సమతావాణి, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు.

పిచ్చికుక్క స్వైరవిహారం

- ఒకే రోజు 10మందిని గాయపరిచన వైనం
- ప్రభుత్వాసుపత్రికి పరుగులు తీసిన క్షతగాత్రులు
- ఆందోళనలో ప్రజలు



కుక్క దాడిలో గాయపడి ఆసుపత్రిలో వైద్యం పొందుతున్న వృద్ధురాలు



గాయపడిన బాలుడు

పర్చూరు, మే 21 : పిచ్చికుక్క దాడిలో 10 మంది తీవ్రంగా గాయపడిన సంఘటన మంగళవారం పర్చూరులో చోటుచేసుకుంది. ఒకే రోజు పదుల సంఖ్యలో పిచ్చికుక్క దాడిలో గాయపడడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పిచ్చికుక్క దాడిలో తీవ్రంగా గాయపడినవారు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి పరుగులు తీసారు. మూకుమ్మడిగా బాధితులు మూకుమ్మడిగా క్యూ కట్టి మరీ వైద్యం కోసం పర్చూరు ప్రభుత్వ వైద్యశాలకు పోవడంతో వారుసైతం ఒకింత ఆందోళనకు గురయ్యారు. పర్చూరు మండలం దేవరపల్లి గ్రామానికి చెందిన మారినేని ఆదిలక్ష్మి పర్చూరు గుడికి వచ్చి తిరుగు ప్రయాణం చేస్తుంగా వెనుకండి వచ్చిన పిచ్చి కుక్క ఆమెపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. అపస్మారక స్థితిలో ఉన్న వృద్ధురాలిని హుటాహుటిన పర్చూరు వైద్యశాలకు తరలించారు. వృద్ధురాలిని రక్షించే క్రమంలో అదే గ్రామానికి చెందిన మరో వ్యక్తిని కూడా పిచ్చికుక్క దాడిచేసి గాయపరిచింది. అదేవిధంగా పర్చూరు ఇందిరాకాలనీలో ఆడుకుంటున్న ఇద్దరు బాలురుతోపాటు, సమీపంలో ఉన్న పశువులపై కూడా కుక్క దాడిచేసి గాయపడరినట్లు స్థానికులు చెప్తున్నారు.

పర్చూరులో పరిస్థితి దయనీయం

పర్చూరులో పరిస్థితి మరింత దయనీయంగా మారింది. వీధుల్లో ఎక్కడ చూసినా వందల సంఖ్యలో కుక్కలు కన్పిస్తుంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. రాత్రి సమయాల్లో వీధుల్లోకి రావాలంటే ప్రజలు భయపడుతున్నారు. ఏది పిచ్చికుక్కో ఏది మంచి కుక్కో తెలియని స్థితిలో పరిస్థితి నెలకొందని ప్రజలు వాపోతున్నారు. ప్రస్తుత పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని శునకాల బారి నుంచి ప్రజలను రక్షించే విధంగా పంచాయతీ అధికారులు ప్రత్యేక దృష్టిసారించాలని ప్రజలు కోరుతున్నారు.

అనారోగ్యాలకు కేరాఫ్.. ఖాళీ ప్లాట్లు



అత్మకూరు : జేఆర్‌పేటలో ఉన్న ఖాళీ స్థలంలో నిలిచిన మురుగునీరు

- ఆత్మకూరు ఇళ్ల మధ్యలో ఖాళీ స్థలాలు
- డంపింగ్ యార్డులు.. మురుగు గుంతలకు ఆవాసం
- విష కీటకాలు, దోమలకు నిలయంగా మారిన వైనం
- విష జ్వరాలు ప్రబలుతాయన్న ఆందోళనలో జనాలు

ఆత్మకూరు, మే 21: స్థానిక మున్సిపాలిటీలోని జేఆర్‌పేట, ఎల్‌ఆర్‌పల్లి, ఆర్టీసీ డిపో సమీప ప్రాంతాల్లో నివాసం ఉండే ఇళ్లు ఉన్నాయి. ఈ ఇళ్ల మధ్య లో అక్కడక్కడ ఖాళీ స్థలాలు ఎక్కువగా ఉన్నాయి. ఈ స్థలం యజ మానుల పర్యవేక్షణ లేకపోవడంతో అవి డంపింగ్ యార్డులుగా దర్శనమిస్తున్నాయి. దానికితోడు ఇళ్లలోని వాడిన నీరంతా ఖాళీ స్థలాల్లో నిలిచి మురుగు గుంతలుగా మారుతున్నాయి. వాటిలో పిచ్చిమొక్కలు, కంపచెట్లు పెరుతున్నా యి. అంతటితో ఆగక వాటిలో వాడేసిన కొబ్బరి బొండాలు, విరిగిపోయిన ప్లాస్టిక్ సామగ్రి, పాత టైర్లు వంటివన్నీ పారవేస్తున్నారు. వర్షం పడగానే వాటిలో నీరు చేరి ప్రమాదకరమైన డెంగీ, మలేరియా వ్యాధులకు కారణమయ్యే దోమలు ప్రబలుతున్నాయి. ఈ ఖాళీస్థలాల చుట్టుపక్కల నివాసముంటున్న ఇళ్లలో డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి జ్వరాల బారినపడిన బాధితులు ఉన్నారు. ఈ క్రమంలో మున్సిపల్ అధికారులు ఇప్పటికే పలుమార్లు ఖాళీస్థలాల యజమానులకు నోటీసులు జారీ చేసినా వారు పట్టించుకోవడం లేదు.



ఎస్‌ఆర్‌పల్లిలోని ఖాళీ స్థలంలో పెరిగిన కంపచెట్లు

700 ఖాళీ స్థలాలు

మున్సిపాలిటీ పరిధిలో 23వార్డులుంటే ఖాళీస్థలాలు 700లకు పైగా ఉన్నాయి. వీటిలో అధికారికంగా 280స్థలాలను గుర్తించారు. గుర్తింపు లేని ఖాళీస్థలా లు మరో 500కి పైగా ఉన్నాయి. ఇటీవల అధికారులు పారిశుధ్యం మెరుగుదలపై ప్రత్యేక దృష్టి సారించారు. అందులో భాగంగానే ఖాళీ జాగాలపై ప్రత్యేక దృష్టి సారించారు. ఇలా చేస్తే మున్సిపాలిటీలో పారిశుధ్యం మరింత మెరుగుపడుతోందని ప్రజలు చర్చించుకుంటున్నారు.

కోర్టు ఆదేశాలు బేఖాతరు

ఖాళీ స్థలాలను చదును చేయించి పిచ్చిమొక్కలు మొలవకుండా, మురుగునీరు నిల్వ ఉండకుండా, చెత్త వ్యర్థాలు ఖాళీ స్థలాల్లో పారవే యకుండా ఉంచాలని కోర్టు ఆదేశించింది. అలా చేయని ఖాళీస్థలాల యజమా నులకు రూ.1000లు జరిమానా విధించాలని ఉత్తర్వులు సైతం మున్సిపల్ అధికారులకు జారీ చేసింది. కానీ ఈ ఆదేశాలు ఎక్కడ అమలు కావడం లేదు.

ప్రబలుతున్న జ్వరాలు

దోమలతో విష జ్వరాలు వచ్చినప్పుడే హడావుడి చేసే వైద్య, మున్సిపల్ శాఖల అధికారులు శాశ్వత నియంత్రణపై శ్రద్ధ చూపడం లేదు. దోమల కారక లార్వాలు ఖాళీ స్థలాల్లోని మురుగునీటిలో అలాగే ఉండిపోతున్నాయి. వాతావరణంలో మార్పులు రాగానే విజృంభిస్తున్నాయి. శాశ్వత ప్రాతిపదికన చర్యలు ఉండడం లేదు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

సీతారామపురం, మే 21: ఉదయగిరి నుంచి సీతారామపురం మార్గంలోని 33కేవీ ఫీడర్ లైన్ మరమ్మతు పనుల్లో భాగంగా బుధవారం ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనున్నట్లు విద్యుత్‌శాఖం మండల ఏఈ శ్రీహరి మంగళవారం ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించవలసిందిగా కోరారు.

డీసీపల్లి బోర్డులో పొగాకు ధరలు

మర్రిపాడు. మే 21: డీసీపల్లి పొగాకు బోర్డు ధరలు రైతుల్లో రోజురోజుకు ఆశలు కల్పిస్తున్నాయి. ఎప్పుడూ చూడని విధంగా మంగళవారం ధరలు పలికాయి. బోర్డుకు రైతులు 832బేళ్లను తీసుకెళ్లగా 18కంపెనీల ప్రతినిధులు వేలంలో పాల్గొని 796బేళ్లను కొనుగోలు చేశారు. వివిధ కారణాలతో 36బేళ్లను తిరస్కరించారు. కిలో గరిష్ట ధర రూ.320.. కనిష్ట ధర రూ.205.. సగటు ధర రూ.279.03గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు.

మండల సమావేశం వాయిదా

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), మే 21: స్థానిక మండల కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా వేసినట్లు ఎంపీడీవో సురేష్‌బాబు తెలిపారు. ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు హాజరు కాలేదన్నారు. తిరిగి ఎప్పుడు నిర్వహించేది తెలియజేస్తామన్నారు.

సీడీపీవో ఆకస్మిక తనిఖీలు

కలువాయి, మే 21: మండల సెక్టారులోని అంగన్‌వాడీ కేంద్రాలను మంగళవారం రాపూరు ఐసీడీఎస్ సీడీపీఓ సునంద ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ నెల 1వ తేదీ నుంచి కేంద్రాల్లో ఒకపూట నిర్వహిస్తున్నారు. అయితే పలు అంగన్‌వాడీ కేంద్రాలు సక్రమంగా తెరుచుకోకపోవడం, తెరిచినా విద్యార్థులకు పౌష్టికాహారం అందడం లేదన్న పత్రికల్లో వచ్చే కథనాలపై స్పందించినట్లు తెలిపారు.

త్వరితగతిన పనులు పూర్తి చేయాలి



పనులు పరిశీలిస్తున్న ఎంఈవోలు

ఉదయగిరి రూరల్, మే 21: మండలంలో జరుగుతున్న మనబడి నాడు-నేడు పథకం కింద జరిగే రెండో విడత పనులను ఈ నెల చివరినాటికి పూర్తి చేయాలని ఎంఈవోలు మస్తాన్‌వలి, శ్రీనివాసులు సూచించారు. మంగళవారం అప్పసముద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న అదనపు తరగతి గదుల నిర్మాణాన్ని వారు పరిశీలించారు. టాయిలెట్స్, తరగతి గదులు, ఎలక్ట్రిషియన్ పనులు వెంటనే పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు విజయకుమార్, పీఎంసీ కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అలజడులు సృష్టిస్తే చర్యలు తప్పవు



బసినేనిపల్లిలో స్వాధీనం చేసుకున్న వాహనాలు

సీతారామపురం, మే 21: బసినేనిపల్లి, ఎస్‌ఆర్‌నగర్, సింగరెడ్డిపల్లి, చిన్ననాగంపల్లి గ్రా మాల్లో మంగళవారం సీఐ గిరిబాబు స్పెషల్ పార్టీ పోలీసులతో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎస్పీ ఆరీఫ్ హాఫీజ్ ఆదేశాల మేరకు ఈ తనిఖీలు చేపట్టామ న్నారు. సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెల్లడించే సమయంలో ఎలాంటి అలజడులు సృష్టించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎలాంటి గొడవలు జరుగకుండా ముందస్తు జాగ్రత్తగా ఇళ్లు తనిఖీ చేశామన్నారు. బసినేనిపల్లిలో ఎలాం టి ధ్రువీకరణ పత్రాలు లేని 9 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నామని, వాటి పత్రాలు చూపించినట్లయితే తిరిగి ఇచ్చేస్తామన్నారు. కార్యక్రమంలో సీతారామపురం ఎస్‌ఐ అనూష, ఉదయగిరి ఎస్‌ఐ ఇంద్రసేనారెడ్డి పాల్గొన్నారు.

పచ్చిరొట్ట విత్తనాలతో ప్రయోజనకరం

చేజర్ల, మే 21: రసాయన ఎరువులు తగ్గించి సేంద్రియ, జీవ ఎరువులు వాడుతూ పకృతి వ్యవసాయ పద్ధతులు పాటిస్తే భూసారంను పెంచుకోవచ్చని జిల్లా వనరుల కేంద్రం డీఆర్‌సీలు చక్రవర్తి, వాసులు సూచించారు. మంగళవారం వారు చేజర్ల, మడపల్లి ఆర్‌బీకేల్లో రైతులతో సమావేశమై భూసార పద్ధతులపై అవగాహన కల్పించారు. పచ్చిరొట్ట విత్తనాలు చల్లుకు ని పూతదశలో ఉన్నప్పుడు దున్నుకుని భూసారం పెంచుకోవాలన్నారు. జీలగ, జనుము, పిల్లిపెసర విత్తనాలు 50శాతం సబ్సిడీతో అందజేస్తామని తెలిపారు. జీలగ, జనుము కేజి రూ.44, పిల్లి పెసర విత్తనాలు కేజి రూ.67లకు అందజేస్తామని, కావలసిన రైతులు ఆర్‌బీకేల్లో పేర్లు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరారు. ఏఓ శశిధర్, ఏఈవో వెంకటేశ్వర్లు, రైతులు పాల్గొన్నారు.

దుత్తలూరు(ఉదయగిరి రూరల్): మండలంలోని 11 రైతుభరోసా కేంద్రాల్లో పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నట్లు మండల వ్యవసాయాధికారి ఎన్.వెంకటసుబ్బారెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 50శాతం సబ్సిడీపోను 10కేజీల జీలుగలు, జనుములు రూ.440లకు, 8కేజీల పిల్లిపెసర్లు రూ.536లకు పంపిణీ చేస్తామన్నారు. ఎకరాకు ఒక సంచి పచ్చిరొట్ట విత్తనాల చొప్పున ఐదెకరాల వరకు అందజేయనున్నట్లు తెలిపారు. అవసరమైన రైతులు ఆయా రైతుభరోసా కేంద్రంలో పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు.

ఉచిత ఒడుగుల కార్యక్రమం

ఆత్మకూరు, మే 21: స్థానిక త్రికోటేశ్వర కల్యాణ మండపంలో ఆవాజ్ కమిటీ సభ్యులు మంగళవారం ముస్లిం చిన్నారులకు ఉచిత ఒడుగుల (ఖత్నా) కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆవాజ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సోమశిలలో 7.665 టీఎంసీలు

అనంతసాగరం, మే 21: సోమశిల జలాశయం పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా మంగళవారానికి 7.665 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 200, ఉత్తర, దక్షిణ కాలువలకు 10 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నట్లు వివరించారు.

గ్రంథాలయంలో వేసవి శిక్షణ



పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

ఉదయగిరి, మే 21: పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో మంగళవారం నిర్వహించిన వేసవిశిక్షణ శిబిరంలో విద్యార్థులతో పుస్తక పఠనం చేయించారు. గ్రంథాలయ అధికారి షేక్ ఫజులుల్లా ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో తెలుగు, ఆంగ్ల పాఠ్యపుస్తకాల్లోని కొన్ని పేరాలను చూచి రాసే పోటీలు నిర్వహించారు. జూన్ 7న ముగింపు సందర్భంగా ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తామని తెలిపారు.

అనంతసాగరం: గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని లైబ్రేరియన్ నారాయణ రావు తెలిపారు. వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా మంగళవారం విద్యార్థులకు పుస్తకపఠం, క్విజ్ పోటీలను నిర్వహించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు.

వైభవంగా లక్ష్మీనరసింహుడి కల్యాణం



కలువాయి: పరమానంద ఆశ్రమంలో లక్ష్మీనరసింహస్వామి కల్యాణం



దాచూరులో కోన భక్తులకు అన్నదానం



పప్పులవారిపల్లిలో పూజల్లో పాల్గొన్న భక్తులు

కలువాయి, మే 21: రాజుపాలెం సమీపంలోని పరమానంద ఆశ్రమంలో నరసింహస్వామి జయంతిని పురస్కరించుకుని మంగళవారం స్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. అంతకుముందు స్వామివారికి అభిషేకం, స్నపన, తిరుమంజనం, ప్రత్యేక పూజలు చేసి భక్తులకు తీర్థ, ప్రసాదాలు అందజేశారు. ఉభయకర్తలుగా రాజుపాళెంకు చెందిన నందిమండలం పృథ్వీరాజ్‌వర్మ, ఉషారాణి, నంది మండలం ప్రణీత్‌వర్మ షాలిని దంపతులు వ్యవహరించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు ఈదూరు రామాచార్యులు, పరమానంద ఆశ్రమం జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ చైర్మన్ వేమారెడ్డి రఘునందనరెడ్డి పాల్గొన్నారు.

కోన భక్తులకు అన్నదానం

పెంచలకోన లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా కోనకు వెళ్లే భక్తులకు దాచూరు గ్రామస్థులు అన్నదానం చేశారు. ఈ నెల 24వ తేదీ వరకు భక్తులకు అన్నదానం, నిమ్మరసం ఏర్పాటు చేస్తామని నిర్వాహకులు తెలిపారు.

ఉదయగిరి రూరల్: పప్పులవారిపల్లిలో మంగళవారం సీతారాములస్వామి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అర్చకులు ఆలయ శుద్ధి, గణపతి పూజ, కలశ స్థాపన, పుణ్యాహవచనం, స్వామివారి మూల విరాట్‌కు అభిషేకం, ప్రత్యేక అలంకరణలు, మంగళహారతి, తీర్థప్రసాద వినియోగం తదితర కార్యక్రమాలు చేపట్టారు. ఆయా పూజా కార్యక్రమాలకు భక్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామివారికి మొక్కులు తీర్చుకున్నారు.

సీతారామపురం: పండ్రంగి గ్రామ సమీపంలోని వెలసిన పాండురంగ విఠలేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం గరుడ వాహన సేవ నిర్వహించారు. సింగరెడ్డిపల్లి గ్రామం నుంచి గరుత్మండుని ట్రాక్టర్‌పై ఉంచి డప్పు వాయిద్యాలతో ఊరేగింపుగా ఆలయం వద్దకు తీసుకెళ్లారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద భక్తులకు అన్నదానం చేశారు.

కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

ఉపాధి పనుల్లో సౌకర్యాల మృగ్యం

- మండుటెండలో కూలీలు
- తాగునీరు, మజ్జిగ, ఓఆర్‌ఎస్ పంపిణీ ఊసేలేదు
- కనిపించని టెంట్లు, మెడికల్ కిట్లు
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ



కాకుటూరులో షామియానా లేక చెట్లకింద సేద తీరుతున్న ఉపాధి కూలీలు

వలేటివారిపాలెం, మే 21 : కూలీల వలసల నిరోధానికి, ఉన్న గ్రామంలోనే పనులు కల్పించాలనే ఉద్దేశంతో కేంద్రం ఉపాధి హామీ పథకాన్ని అమలు చేస్తున్నది. దీన్ని విజయవంతంగా చేపట్టేందుకు నూతన సాంకేతికతను అమల్లోకి తీసుకొచ్చింది. కూలీల వివరాలు ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం విధానాన్ని ప్రవేశ పెట్టింది. వచ్చిన వారి ఫొటోను ఉదయం పని ప్రదేశం నుంచే తీసి పోర్టల్‌లో నమోదు చేయడం, పని పూర్తయిన తరువాత మళ్లీ ఫొటో తీసి నిక్షిప్తం చేయడం వంటి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. అలాగే గతంలో రోజుకు రూ.272 కూలీ ఇచ్చేవారు. ప్రస్తుతం రూ.300 చేశారు. అంతా బాగానే ఉన్నా కూలీలకు కనీస సౌకర్యాలు కరువై తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలోని 21 గ్రామ పంచాయతీల్లో ప్రస్తుతం 4,200 మంది కూలీలు పనిచేస్తున్నారు. పలు గ్రామాల్లో పని ప్రదేశంలో కూలీలు అలసిపోయి సేద తీర్చుకునేందుకు షామియానాలు లేవు. దీంతో వారు సేదతీరడానికి చిల్లచెట్లను ఆశ్రయించాల్సి వస్తున్నది. తాగునీరు లేక కూలీలే సీసాలతో ఇంటి నుంచి నీరు తెచ్చుకుంటున్నారు. కూలీలు అలిసిపోయి సొమ్మసిల్లి పడిపోతే ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు ఇవ్వడం లేదు. పనిచేసే సమయంలో ప్రమాదవశాత్తు గాయాలైతే ప్రథమ చికిత్స చేసేందుకు ఫస్టుఎయిడ్ బాక్సులు కూడ అందుబాటులో లేవు. మౌలిక వసతులు పూర్తిగా విస్మరించడంతో కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాక ఉపాధి పనుల్లో అధికారుల పర్యవేక్షణ కొరవడింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పని ప్రదేశాల్లో కూలీలకు వసతులు కల్పించాల్సిన అవసరం ఉంది.

చెత్తాచెదారంతో నిండిన రైతుబజారు



రైతుబజారు ప్రధాన ద్వారం వద్ద పేరుకుపోయిన చెత్త

కావలి, మే21: పట్టణ నడిబొడ్డున ఉన్న రైతుబజారు ప్రధాన ద్వారం వద్ద చెత్తాచెదారం కుళ్లి దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో రైతుబజారులో ముందుభాగాన నేలపై కూర్చుని వ్యాపారాలు చేసుకునే మహిళలు, కూరగాయల కొనుగోలుకు వెళ్లే ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. గతంలో రోజు మార్చి రోజు అక్కడ చెత్తను మున్సిపాలిటీ వారు తీసుకెళ్లేవారు. ఇప్పుడు ఐదారు రోజులకు ఒక్కసారి చెత్త తీసుకెళ్లుతున్నందున అక్కడ దుర్గంధం వెదజల్లుతోందని చెబుతున్నారు. ఈ దుర్గంధం వల్ల రోగాలు ప్రబలే ప్రమాదం ఉన్నందున అక్కడ చెత్తను గతంలో లాగా రోజు మార్చి రోజుకానీ, వీలుంటే నిత్యం కాని తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

రైతులు రసాయనిక ఎరువుల వాడకం తగ్గించాలి

లింగసముద్రం, మే 21: పంటల సాగులో రైతులు రసాయనిక ఎరువుల వాడకం తగ్గించాలని మండల వ్యవసాయ అధికారి టీ అబ్రహంలింకన్ తెలిపారు. మంగళవారం మండలంలోని ముత్యాలపాడు, పెదపవని ఆర్‌బీకేల్లో పీఎం ప్రణామ్ కార్యక్రమం కింద రైతులకు భూసార పరిరక్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వీఏఏలు శ్రీనివాసులు, ఇమ్రాన్ నజీర్, పలువురు రైతులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

లింగసముద్రం, మే 21 : మండలంలోని వీఆర్ కోట గ్రామ సమీపంలోని మన్నేరు నుంచి మంగళవారం తెల్లవారుజామున ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. ముందుగా అందిన సమాచారం మేరకు స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఏ మల్లికార్జునరావు సిబ్బందితో దాడి చేసి ట్రాక్టర్‌ను, డ్రైవర్‌ను పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

514 పొగాకు బేళ్లు కొనుగోలు

కలిగిరి, మే 21: స్థానిక పొగాకు వేలం కేంద్రానికి మంగళవారం రైతులు మొత్తం 550 పొగాకు బేళ్లు అమ్మకానికి తీసుకొచ్చారు. వేలంలో 16కంపెనీల ప్రతినిధులు పాల్గొని 514బేళ్లు కొనుగోలు చేశారు. నోబిడ్-13, సీఆర్-11, జంపింగ్ లాట్స్-12 కారణాలతో 36బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.314, కనిష్ఠ ధర రూ.205, సగటు ధర రూ.262.05గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి మహేష్‌కుమార్ తెలిపారు.

అధికారులపై చర్యలు తీసుకోవాలి

కందుకూరు, మే 21: గుడ్లూరు మండలం చేవూరు వద్ద చెరువు భూమిని ఆక్రమించి నిర్మించిన రామదూత స్వామి ఆశ్రమంలో ఆక్రమిత భూమిని స్వాధీనం చేసుకోవాలని, రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జారీచేసిన ఆదేశాలను అమలుచేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని ఏపీ హేతువాద సంఘం అధ్యక్షుడు నార్నె వెంకటసుబ్బయ్య మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. దొంగస్వామి ఇచ్చే ముడుపులకు ఆశపడి గుడ్లూరు తహసీల్దార్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఆదేశాలను బుట్టదాఖలు చేయగా జిల్లా కలెక్టరు సైతం పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారని ఆయన ఆరోపించారు. అధికారుల బాధ్యతారాహిత్యంపై ఇటీవల సీసీఎల్‌ఏకు కూడా ఫిర్యాదు చేశామన్నారు. కలెక్టరుపై చర్యలు తీసుకుని గుడ్లూరు తహసీల్దార్‌ను సస్పెండ్ చేయాల్సిందిగా సీసీఎల్‌ఏకు ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు.


బకాయిపడ్డ వేతనాలు చెల్లించాలని వినతి



మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న పారిశుధ్య కార్మికులు

కావలిటౌన్ : బకాయిపడిన జీతాలు, అలవెన్సులు చెల్లించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ పారిశుధ్య కార్మికులు మంగళవారం మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం కార్మిక సంఘం గౌరవాధ్యక్షుడు పెంచలయ్య మాట్లాడుతూ మున్సిపాలిటీలో పనిచేసే వందలాదిమంది పారిశుధ్య కార్మికులను రెండు నెలలు జీతాలు, అలవెన్సులు, సంక్రాంతి బోనస్, సమ్మెకాలం జీతం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చ రించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు అఖిలేష్, రమేష్, శ్రీనివాసులు, మహేష్, చిన్నమ్మ పాల్గొన్నారు.

దారుణంగా అల్లూరు ప్రధాన రహదారి



అల్లూరు బీసీ కాలనీ వద్ద ప్రధాన రహదారి దుస్థితి

అల్లూరు : రాజుపాలెం-ఇస్కపల్లి రోడ్డు పునర్నిర్మాణం నేపథ్యంలో అల్లూరు బీసీ కాలనీ వద్ద రోడ్డు పరిస్థితి దారుణంగా ఉంది. బాగున్న రోడ్డును ఇరువైపులా తవ్వేసి మళ్లీ పూడ్చారు. దీంతో ఆ ప్రాంతంలో గుంతలు ఏర్పడి వర్షపునీరు, డ్రైనేజీ నీరు అక్కడ చేరి రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. రెండేళ్లుగా ఓవైపు దోమల సమస్య, మరోవైపు కాలనీలోకి రాకపోకలకు సమస్య ఏర్పడింది. ఈ విషయంపై పలుమార్లు అధికారులకు తెలుపుకున్నా తామేమీ చేయలేమని వారు సమాధానమిచ్చారు. ఈ విషయమై జిల్లా ఉన్నతాధికారులు స్పందించి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

కమనీయం శ్రీవారి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు, తిలకిస్తున్న భక్తులు

లింగసముద్రం, మే 21 : స్థానిక వెంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం పద్మావతి సమేత శ్రీనివాసుడి కల్యాణం వైభవంగా జరిగింది.ఈనెల 14 నుంచి వెంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి నవాహ్నిక బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి. ఈనెల 24తో ఇవి ముగుస్తాయి.ఇందులో భాగంగా మంగళవారం ఉదయం 11 గంటలకు కల్యాణం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఉభయ కర్తలుగా అడపా బ్రదర్స్ వ్యవహరించారు.

అత్యాచార బాధితులకు నష్టపరిహారం చెల్లించాలి

- ఆర్డీవో కార్యాలయం వద్ద దళిత నేతల నిరసన



ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న దళిత నేతలు

కావలి, మే 21: దళిత, గిరిజన అత్యాచార బాధితులకు వెంటనే నష్టపరిహారం ఇవ్వాలని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్. మల్లి పేర్కొన్నారు. మంగళవారం ఆర్డీవో కార్యాలయం వద్ద దళితులు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం మల్లి మాట్లాడుతూ జిల్లాలో ఒకటిన్నర సంవత్సరంగా అత్యాచారాలకు గురైన బాధితులకు చెల్లించాల్సిన నష్టపరిహారం, ఎస్సీ, ఎస్టీ చట్టాల ద్వారా వచ్చే పరిహారం బాధితులకు ఇప్పటికీ చెల్లించలేదన్నారు. ఈ విషయాన్ని పలుమార్లు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినా ఖజానాలో నిధులు లేవని చెపుతూ జాప్యం చేస్తున్నారన్నారు. వెంటనే పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ హజరత్తయ్య, మందా వెంకటేశ్వర్లు, ముక్కు మోహన్‌రావు, చౌటూరి లక్ష్మయ్య, జడ్డా వాసు, జరుగుమల్లి విజయరత్నం తదితరులు పాల్గొన్నారు.

వైసీపీకి వత్తాసు పలికారనడం అవాస్తవం..



విలేకరులతో మాట్లాడుతున్న జనసేన నేతలు

కావలిటౌన్, మే21: జనసేన కావలి నియోజకవర్గ ఇన్‌చార్జి అళహరి సుధాకర్ ఇటీవల జరిగిన ఎన్నికల్లో వైసీపీకి వత్తాసు పలికారనడం అవాస్తవమని జనసేన నేతలు పేర్కొన్నారు. మంగళవారం తుమ్మలపెంట రోడ్డులోని జనసేన కార్యాలయంలో టౌన్ కోర్డినేటర్ సుధీర్, రూరల్ అధ్యక్షుడు వెంకయ్య, అల్లూరు అధ్యక్షుడు పడకల నాని, దగదర్తి అధ్యక్షుడు వెంకట్‌యాదవ్, బోగోలు అధ్యక్షుడు వెంకటేష్ విలేకరులతో మాట్లాడారు. కొందరు జనసేన పట్టణ నాయకులు అళహరి సుధాకర్‌పై నిరాధార ఆరోపణలు చేయడం హేయమైన చర్యగా అభివర్ణించారు. అళహరిపై అవాకులు,చెవాకులు పేలితే జన సైనికులు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. కార్యక్రమంలో నేతలు చంటి, బాలు, అగస్టీన్, రాజేష్, లక్ష్మీ, సాహితి, హెలెన్, లిఖిత తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా షఫీవుల్లా



షేక్ షఫీవుల్లాను సత్కరిస్తున్న ముస్లిం పెద్దలు


కావలిటౌన్, మే21: ముస్లిం హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా షేక్ షఫీవుల్లా నియమితులయ్యారు. దీంతో ఆయన్ను మంగళవారం పట్టణంలో పలువురు మైనార్టీ ప్రముఖులు, మతపెద్దలు అభినందన సత్కారమందించారు. అనంతరం ముస్లిం పెద్దలు మాట్లాడుతూ షఫీవుల్లా మైనార్టీల అభ్యున్నతికి విశేషంగా కృషి చేస్తున్నారని, వక్ఫ్ బోర్డు డైరెక్టర్‌గా ముస్లిం ఆస్తుల పరిరక్షణకు పాటుపడ్డారన్నారు. షఫీవుల్లా మాట్లాడుతూ తనపై ఉంచిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తానన్నారు. కార్యక్రమంలో మతపెద్దలు జమీర్, సిరాజ్, ప్రొఫెసర్ హాజీ ఫైజుద్దీన్, దస్తగిరిబాషా, నాగూరు తదితరులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బందిపై దాడులు అమానుషం : చేజెర్ల

నెల్లూరు(వైద్యం), మే 21 : శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండల సామాజిక ఆరోగ్య కేంద్రంలో విధి నిర్వాహణలో ఉన్న వైద్య సిబ్బందిపై దాడులు చేయడం దారుణమని ఏపీ హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్(హంస) జిల్లా అధ్యక్షుడు చేజెర్ల సుధాకర్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. నెల్లూరులో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైద్య సిబ్బందిపై దాడులు చేసి కొట్టడమే కాకుండా ఫర్నిచర్, రికార్డులు ధ్వంసం చేయడం అన్యాయమన్నారు. ఇలాంటి అరాచక శక్తులకు గుణపాఠం చెప్పాలని, దాడులు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నేడు రంగనాథుడికి బంగారు గరుడసేవ

నెల్లూరు(సాంస్కృతికం), మే 21 : నరసింహ జయంతి సందర్భంగా తల్పగిరి రంగనాథ స్వామికి బుధవారం బంగారు గరుడసేవ నిర్వహించనున్నట్లు ఆలయ సహాయ కమిషనర్, ఈవో డబ్బుగుంట వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఉత్సవం ఉదయం 8 గంటలకు రంగడి ఆలయం నుంచి ప్రారంభమై ఉభయకర్త రాజా హజరత్‌బాబు నివాసం ఉంటున్న లక్ష్మీపురానికి చేరుకుంటుందని తెలిపారు. అక్కడ విశేష పూజలు నిర్వహిస్తారని, భక్తులందరూ తరలిరావాలని కోరారు.



బుచ్చిరెడ్డిపాలెం : మినగల్లు రీచ్ ఒడ్డున ఉన్న భారీ ఇసుక డంప్

ఇసుక అక్రమాలకు
బ్రేక్ పడేనా!?

ఇసుక.. ఒకప్పుడు ఈ పేరు చెబితే ఉచితం అనే మాట గుర్తుకొచ్చేది. ఇప్పుడు ఆ పదం వినిపిస్తే అధికార వ్యవస్థలో వణుకు పుడుతోంది. వైసీపీ పెద్దల దోపిడీకి కల్పతరువుగా మారిన ఈ ఖనిజం వైపు చూసేందుకు కూడా ఏ ఒక్క అధికారి గడిచిన ఐదేళ్లుగా సాహసించలేదు. టన్నుల కొద్దీ ఇసుక తరలిపోతున్నా జిల్లా ఉన్నతాధికారులు మాత్రం అబ్బే.. అటువంటిదేమీ లేదు అని జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్‌కు (ఎన్జీటీ) నివేదిక ఇవ్వడం గమనార్హం. రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు ఒకటే ఫార్మాట్‌లో నివేదిక ఇవ్వడంతో ఆశ్చర్యపోయిన ఎన్జీటీ.. వారి పనితీరును వేలెత్తి చూపింది. ఈ నేపథ్యంలో తాజాగా ఇసుక అక్రమ తవ్వకాలపై సాక్షాత్తూ సుప్రీం కోర్టు సీరియస్ అయ్యింది. ఇసుక అక్రమ తవ్వకాలకు బ్రేకులు వస్తూ మార్గదర్శకాలు జారీ చేసింది. ఈ మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని, ఈ ప్రక్రియలో పాల్గొనే ప్రతి అధికారీ సుప్రీంకోర్టు నియమించిన అధికారిగా వ్యవహరించాలని, కాదని ప్రవర్తిస్తే తీవ్రంగా పరిగణిస్తామని హెచ్చరించడం విశేషం. ఈ క్రమంలోనైనా జిల్లాలో ఇసుక అక్రమ తవ్వకాలకు బ్రేక్ పడుతుందా!? దర్జాగా దోపిడీ చేస్తున్న అక్రమార్కులను నిలువరిస్తారా!? ఇప్పటి వరకూ జరిగిన దోపిడీని నిగ్గు తేలుస్తారా!? అన్నది చర్చనీయాంశంగా మారింది.

- అక్రమ తవ్వకాలపై సుప్రీంకోర్టు సీరియస్
- వెంటనే తవ్వకాలు నిలిపేయాలని ఆదేశం
- ఫిర్యాదులకు గ్రీవెన్స్ సెల్ ఏర్పాటుకు సూచన
- అధికారులు, పోలీసులతో ప్రత్యేక బృందాలు
- అధికారులు కదిలేనా.. అక్రమాలు నిగ్గు తేలేనా!?

నెల్లూరు, మే 21 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ ప్రభుత్వంలో ఉచితంగా అందుతున్న ఇసుకకు వైపీపీ ప్రభుత్వం వెలకట్టింది. భారీ ధరను నిర్ణయించింది. పోనీ ఆ ధర కన్నా ఇసుక దొరుకుతుందా.. అంటే అందుకూ నానా తంటాలు పడాలి. పెన్నా పరివాహక ప్రాంతాలైన పడమటి కంభంపాడు, సంగం, అప్పారావుపాలెం, మినగల్లు, ముదివర్తి, విరువూరు, పొట్టేపాలెం, గొల్లకందుకూరు, పల్లిపాలెం రీచ్‌ల ద్వారా పెన్నా నదిని కుళ్లబొడిచారు. ఎంత తవ్వుతున్నారు..? ఎంత విక్రయిస్తున్నారు..? అన్న వాటికి లెక్కలు లేవు. తెల్లకాగితాలపై బిల్లులు ఇస్తూ భారీ దోపిడీకి పాల్పడ్డారు. జిల్లాలో పుష్కలంగా ఇసుక నిల్వలు ఉన్నా జిల్లా వాసులకు మాత్రం ఇసుక కష్టాలు తప్పలేదు. ఈ అక్రమ తవ్వకాలపై గతేడాది కొందరు జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్, సుప్రీంకోర్టును ఆశ్రయించారు. గతేడాది మార్చిలో ఇసుక తవ్వకాలను నిలిపేయాలని ఎన్జీటీ ఆదేశించింది.



దీనిపై అప్పటి కాంట్రాక్ట్ సంస్థ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. అయితే నాలుగు రోజుల క్రితం ఈ కేసుపై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలిచ్చింది. ఇసుక అక్రమ తవ్వకాలు నిజమని నిర్ధారించుకున్న సుప్రీంకోర్టు.. అనుమతులు లేని చోట తవ్వకాలను ఆపేయాలని ఆదేశించింది. అయితే జిల్లాలో ఇంకా ఇసుక డంపింగ్ యార్డుల పేరుతో ఇసుక విక్రయాలు జరుగుతున్నాయి. ప్రస్తుతం ప్రతిమా సంస్థకు ఇసుక టెండర్‌ను ప్రభుత్వం అప్పగించింది. గతేడాది డిసెంబరు నుంచి ఈ సంస్థ ఇసుక తవ్వకునేలా అందులో పేర్కొన్నారు. అయి తే గతేడాది మార్చిలోనే ఇసుక తవ్వకాలను నిలిపేయాలని ఎన్జీటీ ఆదేశించినప్పుడు ఇక ఆ తర్వాత తవ్వకాలు ఎలా జరుపుతారన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఇటీవల సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చే వరకు ఎన్జీటీ ఆదేశాలు అమల్లో ఉన్నాయని, ఆ లెక్కన జిల్లాలో అసలు ఇసుకను తవ్వడానికి అనుమతులే లేవని అధికార వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. అటువంటప్పుడు గతేడాది డిసెంబరులో టెండర్ దక్కించుకున్న ప్రతిమా సంస్థ ఇప్పుడు యార్డుల పేరుతో ఎలా ఇసుక వ్యాపారం చేస్తోందన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ యార్డుల్లో ఎంత ఇసుక నిల్వ ఉంది? ఇప్పటి వరకూ ఎంత విక్రయించారు? అన్న వివరాలు ఏ ప్రభుత్వ శాఖ వద్ద లేవు. కనీసం ఆ యార్డుల వైపు కన్నెత్తి చూసే సాహసం కూడా అధికారులు చేయలేక పోతున్నారు.

● అక్రమాలు ఆగుతాయా!?

సుప్రీం కోర్టు మార్గదర్శకాల ప్రకారం ఇకపై జరిగే అక్రమాలను అడ్డుకునేందుకు అవకాశం కలిగింది. మరి ఇప్పుడైనా అధికారులు ఇసుక అక్రమాలపై కఠినంగా వ్యవహరిస్తారా? అన్నదే ప్రశ్నార్థకంగా మారింది. కాగా ఇప్పటి వరకూ జరిగిన అక్రమాలను సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలోనైనా నిగ్గు తేలుస్తారో లేదో చూడాలి. పెన్నాలో ఏ రీచ్‌ను పరిశీలించినా భారీ గుంతలు కనిపిస్తున్నాయి. గూగుల్ ఫొటోస్ ద్వారా విచారణ జరిపితే ఆ గుంతలు ఎప్పుడు తీశారు.. అన్నది తేలిపోతుంది. అయితే ఇప్పటి వరకూ జరిగిన అక్రమాలపై విచారణ జరిపేందుకు ఇంకా ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందలేదని జిల్లా అధికారులు చెబుతున్నారు.

అక్రమాలపై ప్రత్యేక గ్రీవెన్స్ సెల్

ఇసుక అక్రమ తవ్వకాలను నిలిపేయడమే కాకుండా ఫిర్యాదుల పర్యవేక్షణకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. కలెక్టర్, పోలీసుల నేతృత్వంలో ఈ బృందాలు ఏర్పాటు కావాలని సూచించింది. ప్రత్యేక గ్రీవెన్స్ సెల్, టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేసి అక్రమ ఇసుక తవ్వకాలపై ఫిర్యాదులు స్వీకరించాలని ఆదేశించింది. ఆ ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను ఎప్పటికప్పుడు తెలియజేయాలని, ఇందుకు సంబంధించి జూలైలోపు కలెక్టర్లు అఫిడవిట్లు దాఖలు చేయాలని మార్గదర్శకాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం అధికారులు ప్రత్యేక గ్రీవెన్స్ సెల్ ఏర్పాటుకు కసరత్తు చేస్తున్నారు. వివిధ శాఖల అధికారులతో ప్రత్యేక పర్యవేక్షణ బృందాలను నియమించి, ఒకటి, రెండు రోజుల్లోనే ఈ వివరాలను వెల్లడించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ఆరోగ్యశ్రీ పథకం ద్వారా చేసిన వైద్యసేవలకు సంబంధించి బకాయిలు విడుదల చేయాలని పలుమార్లు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరినా పాలకులు పెడిచెవిన పెట్టారు. ఇక తాము వైద్యసేవలు అందించలేమని నెట్‌వర్క్ ఆసుపత్రుల యాజమాన్యం ఆరోగ్యశ్రీ ట్రస్ట్‌కు తేల్చి చెప్పింది. బుధవారం నుంచి తమ ఆసుపత్రులలో వైఎస్సార్ ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు.

ఆరోగ్యశ్రీ సేవలు
నేటి నుంచి బంద్!

- నెట్‌వర్క్ ఆసుపత్రులకు పేరుకుపోయిన బకాయిలు
- ప్రైవేటు ఆసుపత్రులకు రూ.70 కోట్లు.. ప్రభుత్వ ఆసుపత్రులకు రూ.10కోట్ల పెండింగ్
- నోటీసులు ఇచ్చినా చలించని ప్రభుత్వం
- వైద్యసేవల నిలిపివేతకు ప్రైవేటు ఆసుపత్రుల సంఘం నిర్ణయం



నెల్లూరు (వైద్యం), మే 21 : బకాయిలు చెల్లించాలని నెట్‌వర్క్ ఆసుపత్రుల యాజమాన్యం ఆరోగ్యశ్రీ ట్రస్ట్‌ను గత 6 నెలలుగా పలు దఫాలు నోటీసులు ఇచ్చింది. అయితే, రాష్ట్ర ప్రభుత్వం మొక్కుబడి చర్యలు తప్ప పూర్తిస్థాయి బకాయిలు చెల్లించలేదు. ఈ నెల 2వ తేదీనే నెట్‌వర్క్ ఆసుపత్రుల సంఘం ప్రభుత్వానికి నోటీసులు అందించింది. బకాయిలు చెల్లించకపోతే ఆరోగ్యశ్రీ వైద్య చికిత్సలు ఆపేస్తామని తేల్చిచెప్పింది. అయినా, ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదు. ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ పరిధిలో 32 ఆసుపత్రులు ఉన్నాయి. అలాగే 28 డెంటల్ ఆసుపత్రులు, ప్రభుత్వ పరంగా మరో 64 ఆసుపత్రులు ఉన్నాయి. అయితే నెల్లూరులోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రితోపాటు ఆత్మకూరు జిల్లా ఆసుపత్రి, కందుకూరు, కావలి ఏరియా ఆసుపత్రులలోనే కొద్ది మొత్తంలో ఆరోగ్యశ్రీ చికిత్సలు అందుతున్నాయి. డెంటల్ ఆసుపత్రులలో కేవలం ఈహెచ్‌ఎస్ కార్డులు ఉన్న వారికే వైద్యసేవలు అందిస్తున్నారు.

● రూ. 70 కోట్ల వరకు బకాయిలు

జిల్లాలోని ఆరోగ్యశ్రీ కింద నెట్‌వర్క్ ఆసుపత్రులకు రూ.70 కోట్లకుపైగా బకాయిలు ఉన్నట్లు తెలుస్తోంది. ఆరోగ్యశ్రీ కింద అందించే వైద్యసేవలకు 60 రోజుల్లో బకాయిలు చెల్లిస్తామని ప్రభుత్వం గతంలో ప్రకటించింది. అయితే ఏడాది దాటినా చెల్లింపులు నామమాత్రంగా ఉన్నాయి. బకాయిల కోసం ప్రభుత్వానికి నోటీసులు ఇస్తున్నా ఫలితం ఉండటం లేదు. కేవలం 20 శాతం బకాయిలు మాత్రమే చెల్లిస్తూ పబ్బం గడుపుకుంటోంది. దీంతో బకాయిలు సరిగ్గా రాకపోవటంతో నెల్లూరులోని రెండు కార్పొరేట్ ఆసుపత్రులు ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ నుంచి బయటకు వచ్చేశాయి. ఏడాదికి 4500లకుపైగా జిల్లాలో శస్త్రచికిత్సలు జరుగుతున్నా బకాయిలు రాక నెట్‌వర్క్ ఆసుపత్రులు ఆర్థిక ఇబ్బందులలో అల్లాడుతున్నా యి. ఈ నేపథ్యంలో ఆరోగ్యశ్రీ చికిత్సలు అందించేందుకు ఆయా ఆసుపత్రులు వెనుకాడుతున్నాయి. మరోవైపు ప్రభుత్వ ఆసుపత్రులకు కూడా రూ.10 కోట్ల వరకు ఆరోగ్యశ్రీ బకాయిలు ఉన్నట్లు సమాచారం. బకాయిలు విడుదలైతే ఆసుపత్రిలో పలు మౌలిక సదుపాయాలు కల్పించే అవకాశం ఉంటుంది. ప్రభుత్వ ఆసుపత్రులపైనా రాష్ట్ర ప్రభుత్వ వైఖరిపై అధికారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఎన్నికల ఫిర్యాదులను
పరిష్కరించండి!

● ఘర్షణలు, అల్లర్లు జరగకుండా చూడండి : ఆర్వోలతో కలెక్టర్

నెల్లూరు (హరనాథపురం), మే 21 : జిల్లాలో ఎన్నికలపై ఫిర్యాదులు వస్తున్నాయని, ప్రతి ఫిర్యాదును పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ హరినారాయణన్ రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తిక్కన భవన్‌లో రిటర్నింగ్ అధికారులు, నోడల్ అధికారులతో ఆయన సమీక్షించారు. ఎన్నికల తరువాత రాజకీయ ఘర్షణలు, అల్లర్లు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మండల స్థాయిలో తహసీల్దార్లు, పోలీసు అధికారులు సంయుక్తంగా గ్రామాల్లో పర్యటించాలని సూచించారు. జూన్ 4న ఓట్ల లెక్కింపు జరుగుతున్నందున కౌంటింగ్ కేంద్రాలలో అవసరమైన సౌకర్యాలు కల్పించాలన్నారు. రాబోయే 13 రోజులు అప్రమత్తంగా ఉండి ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యేవరకు జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉంటుందన్నారు. ఈ సమీక్షలో జిల్లా అదనపు ఎస్పీ సౌజన్య, కోవూరు రిటర్నింగ్ అధికారి సేతు మాధవన్, నెల్లూరు సిటీ ఆర్వో వికాస్ మర్మత్, కందుకూరు, కావలి ఆర్వోలు విద్యాధరి, శీనా నాయక్ తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం... ఆత్మకూరు ఆర్డీవోకు నోటీసులు

ఆత్మకూరు, మే 21 : ఎన్నికల ప్రక్రియలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఆత్మకూరు ఆర్డీవో, ఆర్వో మధులతకు జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ హరినారాయణన్ షోకాజ్ నోటీసు అందచేసినట్లు ఆలస్యంగా వెలుగు చూసింది. ఆత్మకూరులో జరిగిన పోస్టల్ బ్యాలెట్ కేంద్రంలో, ఎన్నికల సామగ్రి పంపిణీలో సరైన సదుపాయాలు కల్పించకపోవడంతోపాటు నిర్లక్ష్యంగా వ్యవహరించారని కలెక్టర్‌కు ఫిర్యాదులు అందాయి. దీంతో ఆయన ఆర్వో మధులతకు షోకాజ్ నోటీస్ అందచేసినట్లు విశ్వసనీయ సమాచారం. ఆ నోటీసు అందుకున్న ఆమె ఏఆర్వోగా విధులు నిర్వహించిన ఆత్మకూరు తహసీల్దారు శివనాగిరెడ్డి, ఆర్‌ఐ పృథ్వీకి షోకాజ్ నోటీసులు అందజేశారు. ఏఆర్వో, ఆర్‌ఐకి షోకాజ్ నోటీసులు అందచేయడంతో ఈ విషయం వెలుగుచూసింది.

కోనలో పెంచలోరి వైభోగం

- సరస్వతీదేవి అలంకరణలో హంస వాహనంపై విహారం
- స్వర్ణ హనుమతుడిపై భక్తులకు దర్శనం

రాపూరు (డక్కిలి), మే 21 : పెంచలకోనలో పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం ఉదయం సరస్వతీదేవి అలంకరణలో శ్రీవారు హంసవాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనం ఇచ్చారు. ముందుగా అలంకార మండపంలో స్వామివారిని విశేషంగా తీర్చిదిద్ది హంస వాహనంపై కొలువుదీర్చారు. అనంతరం క్షేత్రోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గోవింద నామస్మరణలతో కోన క్షేత్రం మారుమోగింది. ఆ తర్వాత ఊంజల్ సేవ, తిరుమంజనం సేవలు జరిగాయి. వివిధ సేవలతో అలసిన శ్రీవారిని సేదతీర్చేందుకు అర్చకులు స్నపన, తిరుమంజనం జరిపించారు. దేవదేవుళ్ల ఉత్సవ విగ్రహలను పాలు, పెరుగు, తేనె, వివిధ రకాల పళ్లరసాలు, చందనం, పసుపు, కొబ్బరి నీటితో అభిషేకించారు. యాగశాలలో లక్ష్మీనృసింహ స్వామి హోమం జరిగింది.

● హనుమపై వైభోగం

శ్రీరామచంద్రుడి అలంకారంలో ముస్తాబైన నృసింహ స్వామి రాత్రి బంగారు హనుమంతుడిపై విహరించారు. మాడవీధుల్లో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. ఆలయ ఏసీ సాగర్‌బాబు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

● నేడు గరుడవాహన సేవ

బుధవారం నృసింహ జయంతి సందర్భంగా స్వామి వారు తనకిష్టమైన స్వర్ణగరుడ వాహనంపై విహరించనున్నారు. ఈ వేడుకలను తిలకించడానికి భారీ సంఖ్యలో భక్తులు తరలిరానున్నారు. రద్దీ దృష్ట్యా ఆర్టీసీ అధికారులు 120కి పైగా బస్సులను తిప్పనున్నారు.


స్వర్ణ హనుమంతుడిపై విహరిస్తున్న పెంచలస్వామి

సంబరాలకు సన్నద్ధం

- నేడు విక్రమ సింహపురి వర్సిటీ 8, 9 స్నాతకోత్సవాలు
- పాల్గొననున్న రాష్ట్ర గవర్నర్
- ఏర్పాట్లను పరిశీలించిన ఉన్నతాధికారులు

వెంకటాచలం, మే 21 : కాకుటూరులోని విక్రమసింహపురి విశ్వవిద్యాలయం (వీఎస్‌యూ) 8, 9 స్నాతకోత్సవాలు బుధవారం జరగనున్నాయి. ఎంతో అట్టహాసంగా జరిగే ఈ వేడుకల్లో రాష్ట్ర గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్ పాల్గొననున్నారు. ఈ మేరకు మంగళవారం సాయంత్రం జిల్లా ఉన్నతాధికారులు, వర్సిటీ వీసీ సుందరవల్లి, రిజిస్ట్రార్ రామచంద్రారెడ్డిలతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. యూనివర్సిటీ ప్రాంగణంలో స్నాతకోత్సవం జరిగే సభా ప్రాంగణాన్ని, గ్యాలరీలు పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. గవర్నర్ పర్యటన నేపథ్యంలో పోలీసులు వర్సిటీని తమ ఆధీనంలోకి తెచ్చుకుని పటిష్ట బందోబస్తు నిర్వహిస్తున్నారు. అన్ని శాఖల అధికారుల సమన్వయంతో గవర్నర్ పర్యటన ప్రాంతాల్లో ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ సేదుమాధవన్ తెలిపారు. కాగా, స్నాతకోత్సవంలో ప్రత్యక్షంగా 275 మంది డిగ్రీ పట్టాలను గవర్నర్ నుంచి అందుకోనున్నారని వీసీ సుందరవల్లి తెలిపా రు. పరోక్షంగా పోస్టు ద్వారా 3,361 మందికి డిగ్రీ పట్టాలు అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

గవర్నర్‌కు ఘనస్వాగతం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ మంగళవారం రాత్రి నెల్లూరుకు చేరుకున్నారు. జిల్లా కలెక్టర్ ఎం హరినారాయణన్, విక్రమసింహపురి వైస్ చాన్సలర్ సుందరవల్లి, ఎస్పీ ఆరీఫ్ హఫీజ్, మున్సిపల్ కమిషనర్ వికాస్ మర్మత్, జాయింట్ కలెక్టర్ సేదు మాధవన్‌లు నగరంలోని ప్రధాన రైల్వే స్టేషన్‌లో గవర్నర్‌కు ఘన స్వాగతం పలికారు.


రైల్వే స్టేషన్‌లో గవర్నర్‌కు స్వాగతం పలుకుతున్న వీసీ సుందరవల్లి